ఆగస్టు
2022

సంపుటి :18 సంచిక : 3

196

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

జాతీయోద్యమంలో వామపక్షం

రూపాయి పతనం మనందరినీ ఎందుకు కలవరపెడుతోంది?

విజ్ఞానంపై దాడి అజ్ఞాన ప్రచారం

బూర్జువా పార్టీలు - సరళీకృత ఆర్థిక విధానాలు

అశోకుడి శాసనాలూ దక్షిణాది ప్రాంతం

పార్లమెంటరీ విధానంపై బిజెపి దాడి

ఉక్రెయిన్ రణక్షేత్రంలో రష్యాతో నాటో యుద్ధం

పర్యావరణం - పెట్టుబడి

స్ఫూర్తి

# ఆధునిక చైనా మార్గదర్శకుడు

# డెంగ్ సియావో పింగ్

**వై. రాము**

చైనా ప్రగతి ప్రస్థానంలో మావో నుండి నేటి జిన్ పింగ్ వరకు ఎంతో మంది యోధులున్నారు. వారందరిలో ప్రత్యేకమైన వ్యక్తి డెంగ్ సియావో పింగ్. పుట్టిందే విప్లవం కోసం అన్నట్లుగా 20 సంవత్సరాల వయస్సులోనే దేశం కాని దేశంలో కమ్యూనిస్టైనాడు. తన ఆలోచనలతో చైనాను ఆధునికత వైపు నడిపిస్తూనే, సోషలిస్టు ప్రాభవానికి అడ్డంకులు ఏర్పడినప్పుడు కుట్రలు చుట్టిముట్టినప్పుడు కఠిన నిర్ణయాలతో అణిచేసి సామ్యవాద పునాదులను కాపాడారు. చైనా మొదటి తరం అగ్ర నాయకుల అడుగుజాడల్లో ఆయన చైనా ముఖ్య నాయకునిగా ఎదిగారు. సిద్ధాంతాన్ని అచరణలో పెట్టి, ఆచరణ ద్వారా అభివృద్ధి సాధించిన వ్యక్తి డెంగ్ సియావో పింగ్.

**కమ్యూనిస్టుగా మారిన నేపథ్యం**

చైనాలోని అతిపెద్ద రాష్ట్రమైన సిచువాన్ లోని పైపాంగ్ గ్రామంలో 1904 ఆగష్టు 22న డెంగ్ జన్మించారు. డెంగ్ తల్లిదండ్రులు డాన్ షిడెంగ్, డెంగ్ విన్‌మిన్. డెంగ్ తండ్రికి ఆధునిక భావాల పట్ల ఆదరణ ఉన్నప్పటికి డెంగ్ చదువు మొదట్లో సనాతన పద్ధతిలోనే ప్రారంభమయింది. ఏడవ యేట మాత్రం ఆధునిక పాఠశాలలో అడుగుపెట్టాడు. పాఠశాల విద్య పూర్తి కాగానే ఉన్నత చదువుల కోసం చెంగ్ దూకు వెళ్లాల్సి ఉంది. కాని అలా జరగలేదు. డెంగ్ తండ్రి "పని చేస్తూ చదువుకునే అవకాశం" ఫ్రాన్స్‌లో ఉందని వార్తా పత్రిక ద్వారా తెలుసుకుని డెంగ్‌ని ఫ్రాన్స్ పంపడానికి నిశ్చయించుకున్నాడు. ఈ నిర్ణయం డెంగ్ జీవితాన్ని మలుపుతిప్పింది.

1920 సెప్టెంబరు 11న దాదాపు రెండు వందల మంది విద్యార్థులు షాంఘై నుంచి ఫ్రాన్స్‌కి నౌకపై బయలుదేరారు. వీరిలో డెంగ్ సియావో పింగ్ ఆయన పినతండ్రి డెంగ్ ఫో పెంగ్‌లు ఉన్నారు. డెంగ్ ఫ్రాన్స్‌లో అడుగుపెట్టే నాటికి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితులలో చదువుకుంటూ ఉద్యోగం సంపాదించటం కష్టంగా మారింది. అయినా డెంగ్ ఫారిస్–లైన్స్ మధ్య గల లిక్రిసోటో వద్ద స్కిండర్ ఇంజనీరింగ్ వర్క్ ఫ్యాక్టరీలో చేరాడు.



ఇక్కడ చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. ఫ్రాన్స్ ఆర్థిక సంక్షోభ పరిస్థితులు, అక్టోబరు విప్లవ ప్రభావంతో చైనా యువకులలో కొత్త భావాలు పెంపొందసాగాయి. ఫ్రెంచ్ కార్మికోద్యమం కూడా విస్తృతం అయింది. ఈ నేపథ్యంలో మార్క్సిజం, సోషలిస్టు సిద్ధాంతాలు వారిని ఆకర్షించాయి, అనేక మంది మార్క్సిజం స్వీకరించి విప్లవ మార్గంలో నడిచారు. అందులో డెంగ్ ఒకరు.

1922 సంవత్సరంలో ఐరోపాలోని చైనా యువజన కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. దీనిలో అప్పటికే చురుగ్గా ఉన్న చౌఎన్‌లై, షఉవో చియాన్‌లు డెంగ్‌ను ప్రభావితం చేశారు. 1923 జూన్‌లో చైనా సోషలిస్టు యూత్‌లీగ్ ఐరోపా విభాగానికి కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 20 సంవత్సరాల వయస్సులోనే లైన్స్ ప్రాంత పార్టీ ప్రత్యేక ప్రతినిధిగా ఎన్నికయ్యాడు. ఆ తరువాత 1926 సంవత్సరంలో మాస్కో చేరుకొని సన్‌యెట్ సేన్ విశ్వ విద్యాలయంలో చదువుకుని 1927 సంవత్సరం ఫిబ్రవరిలో తన సొంత గడ్డ పై అడుగు పెట్టాడు.

**లాంగ్ మార్చ్ – జపాన్‌తో యుద్ధం**

1934 సంవత్సరంలో చైనా కమ్యూనిస్టు పార్టీ లాంగ్‌మార్చ్ ప్రారంభమయింది. చారిత్రాత్మకమైన లాంగ్ మార్చ్‌లో డెంగ్ రాజకీయ ప్రచారకునిగా పనిచేశారు. ఏడాది పాటు సాగిన ఈ లాంగ్‌మార్చ్ అనేక సవాళ్లను, కష్టనష్టాలను ఎదుర్కొని ముందుకుసాగింది. దాదాపు 12000 కి॥మీ॥ ప్రయాణించింది. 24 నదులను, 8 పర్వత శ్రేణులను దాటి లక్ష్యాన్ని చేరుకుంది. మధ్యలో చాంగ్ కై షేక్ తొత్తులు, స్థానిక యుద్ధ ప్రభువులతో తల పడాల్సి వచ్చింది. ఈ మహత్తర యాత్రలో రాజకీయ ప్రచారకుడిగా డెంగ్ తన వంతు పాత్రను నిర్వహించారు.

చైనా లాంగ్ మార్చ్ అనంతరం జపాన్ యుద్ధం ముందుకు వచ్చింది. 1937 జూలై నుండి 1945 ఆగష్టు వరకు 8 ఏళ్లపాటు ఈ యుద్ధం సాగింది. జపాన్ దురాక్రమణ చైనా ప్రజలలో ఆగ్రహావేశాలను రగిలించింది. మాతృదేశ సంరక్షణే తమ ధ్యేయంగా వారు భావించారు. ఈ సమయంలోనే 13 వేల మంది సైనికులున్న 129 వ డివిజన్ రాజకీయ కమిస్సార్‌గా డెంగ్ సియావో పింగ్ నియమితులయ్యారు.

1949 అక్టోబర్ 1న కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం డెంగ్ వాయువ్య చైనాలోని పార్టీ నాయకత్వాన్ని స్వీకరించారు. తరువాత 1952 సం॥లో ఉప ప్రధాని పదవితో పాటు, ఆర్థిక కమీషన్ ఉపాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. 1953లో ఆర్థిక మంత్రిగా, 1954లో కేంద్ర కమిటి సెక్రటరీగా, 1955లో పోలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా నియమితులయ్యారు. ఈ బాధ్యతల కారణంగా మావో, లీషావ్‌చీ, చౌఎన్ లైతో దగ్గర సంబంధాలు ఏర్పడ్డాయి. దేశ వ్యాప్త పార్టీకీ, పార్టీ నాయకత్వానికి మధ్య వారధిలా మారాడు. ఈ కాలంలోనే పారిశ్రామికాభివృద్ధి, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటుకు బీజాలు పడ్డాయి.

**సాంస్కృతి విప్లవ కల్లోలం :**

చైనాలో 1966 మే నెల నుండి 1976 అక్టోబరు వరకు సాగిన సాంస్కృతిక విప్లవాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. 1966 నుండి 1969 వరకు 1వ దశ, 1969 నుండి 1973 వరకు 2వ దశ, 1973 నుండి 1976 వరకు 3వ దశ.

సాంస్కృతిక విప్లవం ప్రారంభమయ్యే వరకు డెంగ్ చురుకైన నాయకుడిగా ఉన్నారు. అనేక కీలక విషయాల్లో ప్రముఖపాత్ర వహించారు. కానీ సాంస్కృతిక విప్లవ కాలంలో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఆధునిక చైనా మార్గదర్శకుడు డెంగ్ సియావో పింగ్

వై. రాము ......... 2

2. జాతీయోద్యమంలో వామపక్షం

ఇర్ఫాన్ హబీబ్......... 4

3. రూపాయి పతనం ఎందుకు కలవరపెడుతోంది?

సిపి చంద్రశేఖర్ ..... 12

4. విజ్ఞానంపై దాడి అజ్ఞాన ప్రచారం

బి.వి.రాఘవులు ..... 14

5. బూర్జువా పార్టీలు - సరళీకృత ఆర్థిక విధానాలు

ఎస్.వీరయ్య.... 18

6. అశోకుడి శాసనాలూ దక్షిణాది ప్రాంతం

ఎం.వి.ఎస్.శర్మ ...... 20

6. పార్లమెంటరీ విధానంపై బిజెపి దాడి

ఎ.కోటిరెడ్డి ... 22

7. ఉక్రెయిన్ రణక్షేత్రం : రష్యాతో నాటో యుద్ధం

ఎస్.వెంకట్రావు ..... 25

8. పర్యావరణం - పెట్టుబడి

జాన్ బెల్లమీ ఫాస్టర్, బ్రెట్ క్లార్క్ ..... 30



**సంపాదకుడు :**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**

**పాటూరు రామయ్య**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# 75 ఏళ్ల స్వాతంత్ర్యం

అజాదీకా అమృత మహోత్సవాల పేరిట 75 ఏళ్ల స్వాతంత్ర్యోత్సవాలను దేశ వ్యాపితంగా జరుపుకుంటున్నాం. 200 ఏళ్ల విదేశీ బానిస సంకెళ్ల నుండి ఒక దేశం విముక్తి చెంది 75 ఏళ్ల పాటు ప్రజాస్వామ్య పంథాలో, సమైక్యంగా నడిచిందంటే అదంతా మన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగనిరతి, దూరదృష్టి ఫలితం. కాంగ్రెస్ సారథ్యంలో జరిగిన జాతీయోద్యమం, కమ్యూనిస్టుల నాయకత్వంలో కదిలిన కార్మిక, రైతాంగ ఉద్యమాలు, అష్ఫకుల్లా ఖాన్, భగత్‌సింగ్, నేతాజీ వంటి త్యాగధనుల స్ఫూర్తి, బిర్సాముండా, అల్లూరి సీతారామరాజు, కొమురం భీం వంటి విప్లవకారుల పోరాటాలు... ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించింది. కానీ విషాదం ఏమంటే ఆరోజు ఎవరైతే స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్నారో, ఎవరైతే దానికి ద్రోహం చేశారో ఆ ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభ ప్రతినిధులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నారు. నాటి స్వాతంత్ర్య లక్ష్యాలకు, అంబేద్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి వారు నేడు ప్రతిరోజూ ద్రోహం చేస్తున్నారు.

స్వాతంత్ర్యోద్యమ నేతలు ఆసించినట్లు భారత దేశం పేదరికం, ఆకలి, అవిద్య, నిరుద్యోగం, అంటురోగాలనుండి విముక్తి పొందిందా అంటే 75 ఏళ్ల తరువాత కూడా మనం ఈ లక్ష్యాలకు ఆమడ దూరంలోనే ఉన్నాం. అందుకే అమృత మహోత్సవాలు జరుపుకునే వేళ సెంటిమెంట్లతో కొట్టుకుపోకుండా ఒక చోట నిలబడి, వెనక్కి తేరిపారా జూసుకుని ఈ 75 ఏళ్లలో మనం ఏం సాధించాలనుకున్నాం, ఏం సాధించాం, ఏం సాధించలేకపోయాం, ఎందుకు సాధించలేకపోయాం అని సింహావలోకనం చేసుకోవడం, ప్రస్తుత పాలకుల మాటలకూ, చేతలకూ మధ్య తేడాలను తేరిపార చూడ్డం అవసరం.

స్వాతంత్ర్యం లభించినప్పుడు మన దేశ జనాభా 33 కోట్లు మాత్రమే. నేడు 140 కోట్లకు చేరుకున్నది. ఈ జనాభా అంతటికీ కూడు, గూడు, గుడ్డ సరఫరా చేయగల సాంకేతిక స్థాయిని, వనరులను భారత దేశం సమకూర్చుకున్నది. అయినా నేటికీ దేశంలో 40 శాతం ప్రజలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. శతకోటీశ్వరుల సంఖ్య మునుపెన్నడూ లేని విధంగా పెరుగుతున్నది, మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో పేదరికం విలయ తాండవం చేస్తున్నది. ఆకాశ హర్మ్యాల చెంతనే మురికి వాడలు వర్ధిలుతున్నాయి. మనం చంద్రునిమీదకు, అంగారకుని మీదకు ఉపగ్రహాలు పంపాం. కానీ దేశంలో మెజారిటీ ప్రజలు నేటికీ మూఢ నమ్మకాల్లో, అవిద్య, అజ్ఞానంలో మునిగి తేలుతున్నారు. ప్రపంచంలో అత్యధిక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో కోట్లాదిమంది ప్రజలు ఉపాధికోసం పొట్టచేతపట్టుకుని వలసలు పోతున్నారు. ఈ విధంగా స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత మన పాలక వర్గాల విధానాల వల్ల రెండు భారత దేశాలు సృష్టించబడ్డాయి. ఒకటి ఆధునిక, ధనిక భారత దేశం. రెండోది అజ్ఞానం, అవిద్య, అనారోగ్యం, కటిక పేదరికంలో మునిగి తేలుతున్న దారిద్ర్య భారత దేశం.

75 ఏళ్ల కాలంలో ధనిక పేద మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. 1990లలో భారత పాలక వర్గాలు నయా-ఉదారవాద విధానాలు చేపట్టిన తరువాత ముఖ్యంగా నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంతరాలు మరింత తీవ్రంగా పెరుగుతున్నాయి. ఈ ప్రభుత్వం ఆర్థిక అంతరాలతోపాటు ప్రజల మధ్య చీలికలు కూడా ప్రమాదకరంగా పెంచుతున్నది. నయా-ఉదారవాద, మతోన్మాద కాక్‌టైల్ విధానాలు అనుసరిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశానికి మరింత ప్రమాదకరంగా పరిణమించింది. దేశ రక్షణ వ్యవస్థతో సహా మొత్తం ఆర్థిక రంగాన్ని ప్రవేటీకరించడమే కాదు కొద్ది మంది క్రోనీ-క్యాపిటలిస్టులకు కారుచౌకగా కట్టబెడుతున్నది. జిఎస్‌టి పేరుతో ప్రజల మూలుగలు పీలుస్తూ, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు, నజరానాలు ఇస్తున్నది. మరోవైపు మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడనాడి అమెరికా యుద్ధ వ్యూహంలో పావుగా మారుస్తున్నది. నాటి మన స్వాతంత్ర్య సమర యోధుల లక్ష్యాలు సాధించడం నేటి పాలక వర్గాల చేతగాదని తేలిపోయింది. ఆ లక్ష్యాలు సాధించాలంటే వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను అధికారంలోకి తేవడం ఒక్కటే మార్గం. మత, కుల, ప్రాంత రహితంగా దేశ ప్రజలందరినీ పోరాటాల్లో ఐక్య పరచడం ద్వారానే దాన్ని సాధించగలం. అది సాధించాలంటే మతోన్మాద విధానాలతో ప్రజలను చీలుస్తున్న బిజెపిని ఓడించాలి. అదే నేడు మనందరి తక్షణ కర్తవ్యం.

75 ఏళ్ల స్వాతంత్ర్యం ప్రత్యేక వ్యాసం

# జాతీయోద్యమంలో వామపక్షం

**ఇర్ఫాన్ హబీబ్**



రచయిత ప్రముఖ చరిత్ర పరిశోధకులు. భారత దేశ ప్రాచీన, మధ్య యుగాల చరిత్రపై నిపులు

సోషలిస్టు ప్రాపంచిక దృక్పథం పట్ల విశ్వాసం కలిగివున్న అన్ని శక్తుల కలయికయే ''వామపక్షము'' అని జాతీయోద్యమ చరిత్రలోనూ, వర్తమాన రాజకీయ వ్యవహారాల లోనూ నిర్వచించడం జరిగింది. ఈ కూటమిలో మార్క్సిజానిది తిరుగులేని ప్రభావం. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటంలో దానికి ప్రామాణిక సిద్ధాంతవేత్తగా వున్న మార్క్స్ చేసిన ప్రధాన సైద్ధాంతిక రచనలన్నీ ప్రధానంగా పెట్టుబడిదారీ విధాన పని తీరును, శ్రమ దోపిడీని వివరించేవి అనటంలో అవాస్తవమేమీ లేదు. దేశీయంగా స్వాతంత్ర్యోద్యమం ప్రారంభం కావటానికి చాలా ముందే భారత జాతీయ విముక్తిని ఆయన ఎలుగెత్తిచాటాడన్న విషయాన్ని మరువరాదు. ఆమెరికా నుంచి వెలువడే న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ పత్రికలో 1853లోనే మార్క్స్ ఇలా పేర్కొన్నారు.

గ్రేట్ బ్రిటన్‌లో నేడున్న పాలక వర్గాల స్థానాన్ని పారిశ్రామిక కార్మికవర్గం ఆక్రమించుకునే సమయం వస్తేనే తప్ప లేదా ఇంగ్లీషు బానిస శృంఖలాలను హైందవులు తమంతట తామే తునాతునకలుగా తెంచివేసుకునే శక్తిని అభివృద్ధి చేసుకోగలిగే సమయం వస్తేనే తప్ప అంతవరకు తమ మధ్య అక్కడక్కడ చెదురుమదురుగా వెదజల్లబడిన నూతన సామాజిక అంశాల యొక్క ఫలాలు భారతీయుల అనుభవంలోకి రావు.

1857లో మహత్తర తిరుగుబాటు సంభవించినప్పుడు పైన పేర్కొన్న వార్తా పత్రికలో మార్క్స్, ఏంగెల్స్‌లు వ్యాసాలు రాస్తూ తిరుగుబాటుదారులను గట్టిగా సమర్థించడమే గాక బ్రిటిష్‌వారి కిరాతక కృత్యాలను ఖండించారు. మార్క్స్‌కు భారతీయుల పట్ల సానుభూతి లేదంటూ ఎడ్వర్డ్ సెడ్ లాంటి రచయితలు చెపుతున్నందున ఈ విషయాన్ని ప్రత్యేకించి నొక్కి చెప్పవలసివస్తున్నది.

బ్రిటిష్ పాలనను వ్యతిరేకించే ఏ భారతీయునితోనూ మార్క్స్‌కు వ్యక్తిగత సంబంధాలున్నట్లుగా ఆధారాలు లేవు. కాగా మార్క్స్ కీలకపాత్ర వహిస్తున్న అంతర్జాతీయ కార్మిక సమాఖ్య సాధారణ మండలికి 1871లో కలకత్తాకు చెందిన అజ్ఞాత వ్యక్తి నుండి ఒక లేఖ అందింది. భారతదేశంలోని "ప్రజలలో నెలకొన్న.. తీవ్ర అసంతృప్తి" గురించి "కార్మికుల దురవస్థ" గురించి యీ లేఖ పేర్కొంటున్నది. "స్థానికులను చేర్చటానికి" ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఇంటర్నేషనల్ శాఖను ప్రారంభించవలసిందిగా సాధారణ మండలి ఈ లేఖకునికి సలహా ఇచ్చింది. ఇంతకు మించి ఆ లేఖ ఫలితమేమిటో మనకు తెలియదు. అయితే భారత అవిశ్రాంతయోధుడు దాదాబాయ్ నౌరోజీ లండన్‌లో వున్నప్పుడు ఇంగ్లండ్‌లోని తొలి సోషలిస్టుల్లో ఒకరైన హెచ్.ఎం. హైండ్‌మన్ ద్వారా ఆయనకు మార్క్స్‌తో పరోక్ష సంబంధం ఏర్పడింది. 1881 వేసవి వరకు ఆయన మార్క్స్‌తో సత్సంబంధాలు కొనసాగించాడు. మార్క్స్‌ను భారతీయ మిత్రునిగా నౌరోజి స్నేహితుడొకరు వర్ణించారు. భారతదేశంపై పెనుభారంగా మారిన కప్పముల చెల్లింపు గురించీ, అదే విధంగా ప్రజల అసంతృప్తి కారణంగా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చోటు చేసుకుంటున్న ప్రజల కుట్రల గురించి నౌరోజీ అభిప్రాయాలే 1881 ప్రథమంలో మార్క్స్ రాసిన ఒక లేఖలోని అంశాలలో ప్రతిబింబిస్తున్నాయి. దురదృష్టవశాత్తూ ఆ ఏడాది చివరిలోనే మార్క్స్‌తో హైండ్‌మన్ తెగతెంపులు చేసుకోవటంతో మార్క్స్- నౌరోజీల మధ్య వ్యక్తిగత పరిచయానికి అవకాశం లేకుండా పోయింది.

## అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమం - జాతీయ విముక్తి

కార్ల్‌మార్క్స్ 1883లో కన్నుమూశారు. ఆయన మృతి చెందిన కొన్ని సంవత్సరాలలోనే ప్రధానమైన రెండు పరిణామాలు చోటు చేసుకున్నాయి. అటు భారత జాతీయతత్వమూ, ఇటు అంతర్జాతీయ సోషలిజమూ నిర్మాణ రూపాన్ని సంతరించుకున్నాయి. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ బొంబాయిలో ఆవిర్భవించింది. 1889లో రెండవ ఇంటర్నేషనల్ పారిస్‌లో ఏర్పడింది. ఇది ఐరోపా, అమెరికాలలోని కార్మికవర్గ ఉద్యమానికి చెందిన అనేక పురోగామి సెక్షన్లను తన పతాకం క్రింద సమీకరించింది. అయితే దురదృష్టవశాత్తూ కాంగ్రెస్‌లో అత్యంత మధ్యేవాద చట్టబద్ధ రాజకీయాలు, రెండవ ఇంటర్నేషనల్‌లో మితవాద సోషల్ డెమోక్రసీ ఆధిపత్యం పెరగటంతో ఈ రెండు ఉద్యమాలు ఒకదానికొకటి దూరంగానే వుండిపోయాయి. 1886లో కలకత్తా కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన దాదాబాయ్ నౌరోజీ (1906లో కూడా మరోసారి అధ్యక్షత వహించారు) 1904లో ఆమ్‌స్టర్‌డామ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మహాసభకు హాజరయ్యారు. బ్రిటిష్ కార్మికవర్గ మద్దతు పట్ల భారత జాతీయవాదుల విశ్వాసాన్ని ఆయన వెలిబుచ్చాడు. కాగా ప్రవాసంలో వున్న విప్లవకారులతో స్నేహ సంబంధాలు కలిగిన మేడం కామా స్టుట్‌గార్ట్ ఇంటర్నేషనల్ మహాసభ (1907) లో స్వేచ్ఛా భారత చిహ్నమైన త్రివర్ణ (ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ) పతాకాన్ని ఎగురవేశారు. అయితే ఇవన్నీ చాలావరకు చెదురు మదురు ఘటనలే. నిజానికి స్టుట్‌గార్ట్‌లలో వామపక్షాలకు, మధ్యేవాదులకు మధ్య కుదిరిన పొత్తు

పరిమితమైనది. వలస సమస్యకు సంబంధించిన తీర్మానంలోని ఒక అంశాన్ని తొలగించడానికే యిది పరిమితం. పారిశ్రామిక దేశాలలో పెట్టుబడిదారీ విధానం కూలిపోయి సోషలిస్టు పాలన ఏర్పడిన తరువాత కూడా వలసలను అభివృద్ధిపరిచే కార్యక్రమాన్ని కొనసాగించాలనేదే ఆ ప్రస్తావన.

జాతీయ స్వాతంత్ర్యానికై పోరాడే వలస ప్రజలే సోషలిజం కోసం పోరాడే కార్మిక వర్గానికి విశ్వసనీయ మిత్రులన్న దృక్పథాన్ని రెండవ ఇంటర్నేషనల్‌లో పాదు కొల్పింది విప్లవ మార్క్సిస్టులే. కాగా లెనిన్ తాను రచించిన "ప్రపంచ రాజకీయాలలో ప్రజ్వలనాంశాలు" (1908) అన్న వ్యాసంలో దీని గురించిన అవగాహనను ఇచ్చాడు. ఇరాన్, టర్కీ, ఇండియా, చైనాలలో చోటు చేసుకుంటున్న ఘటనలను పరిశీలించి, ఒక ఆదర్శంగా జపాన్ (సోషలిస్టేతర లేదా బూర్జువా జాతీయవాద నమూనా) తూర్పు దేశాలను ఆకర్షిస్తున్నదని ఆయన గుర్తించాడు. అయినప్పటికి ఉమ్మడి శత్రువును, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడంలో కలిసివచ్చే మిత్రులుగా వలస దేశాల ప్రజలను ఉత్సాహంతో అభినందించడంలో ఇది ఆయనకు ఏ మాత్రం ఆటంకం కాలేదు. భారతదేశం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి వున్నవి. "ప్రజాతంత్రవాది" తిలక్‌కు ఆరేళ్ళు జైలుశిక్ష విధించడాన్ని నిరసిస్తూ బొంబాయిలో జరిగిన సమ్మె ప్రదర్శనలను ఆయన ప్రస్తావించారు. "వర్గ చైతన్యం కలిగిన ఐరోపా కార్మికులకు ఇప్పుడు ఆసియా కామ్రేడ్స్ కలిశారు. వారి సంఖ్య అపరిమితంగా పెరుగుతుంది." అంటూ ఎంతో విశ్వాసంతో చెప్పటానికి ఆయనకు ఈ సంఘటన ఊతమిచ్చింది.

### సోవియట్ విప్లవమూ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్

1917 నాటి సోవియట్ విప్లవం వరకు జాతీయ విముక్తి ఉద్యమంలో సోషలిస్టు భావాలు చోటు చేసుకోలేదు. "పీడిత దేశాలలోని బూర్జువా విముక్తి ఉద్యమాలకు, పీడక దేశంలోని శ్రామిక వర్గ విముక్తి ఉద్యమాలకు మధ్య వుండగల సంబంధాలు గురించి లెనిన్ 1914 లోనే చెప్పాడు. పీడిత దేశాలలోని ఉద్యమాలు బూర్జువా స్వభావాన్ని కలిగి వుండవచ్చు. అయితే "అక్టోబరు విప్లవ విజయ దుందుభులు" ఈ విభజనను తొలగించాయి. మావోజెడుంగ్ గుర్తించినట్లుగా మార్క్సిజం – లెనినిజం చైనాలోకి రావటమే కాదు, ప్రపంచంలో ప్రధానమైన అన్ని వలసదేశాలలో సోషలిస్టు

" ప్రస్తుత పరిస్థితిలో "ప్రతి జాతీయో ద్యమమూ (వలసదేశాలలో) బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమంగా మాత్రమే వుండ గలదు. ఎందుకంటే వెనుకబడిన దేశాల జనాభాలో అత్యధిక భాగం బూర్జువా పెట్టుబడిదారీ సంబంధాలకు ప్రాతినిధ్యం వహించే రైతులే"నని లెనిన్ గుర్తించాడు. "



1929లో కమ్యూనిస్టులపై బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన మీరట్ కుట్రకేసులో అరెస్టు చేయబడిన స్వాతంత్ర్య యోధులు

భావజాలం వ్యాప్తిచెందటం ప్రారంభమైంది. ఒకసారిగాని ఇది జరిగితే జాతీయోద్యమం పట్ల సానుభూతి గల మౌన ప్రేక్షకురాలిగా సోషలిస్టు ఉద్యమం ఎంతోకాలం వుండలేదు. జాతీయోద్యమంలో ఒక విశిష్ట భాగంగా ఇది మారుతుంది. అంతేగాక ఇప్పటివరకు ఆధిపత్యం వహిస్తున్న "బూర్జువా ప్రజాతంత్ర" విభాగంతో దాని సంబంధం ప్రపంచస్థాయిలో వామపక్ష వ్యూహానికి చెందిన కీలక ప్రశ్నగా మారుతుంది.

నూతనంగా స్థాపించిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొమింటర్న్) రెండవ మహాసభ 1920 జూలైలో జరిగింది. దీనిలో జాతీయ – వలసవాద సమస్య గురించి లెనిన్ సమర్పించిన ప్రాథమిక థీసిస్‌లోనూ, ఆ థీసిస్‌ని సమర్పిస్తూ ఆయన చేసిన ప్రసంగంలోనూ ఈ నూతన దృక్పథం గురించి ప్రస్తావించడం జరిగింది. ప్రస్తుత పరిస్థితిలో "ప్రతి జాతీయోద్యమమూ (వలసదేశాలలో) బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమంగా మాత్రమే వుండ గలదు. ఎందుకంటే వెనుకబడిన దేశాల జనాభాలో అత్యధిక భాగం బూర్జువా పెట్టుబడిదారీ సంబంధాలకు ప్రాతినిధ్యం వహించే రైతులే"నని లెనిన్ గుర్తించాడు. అయితే ఇంకొక వాస్తవం కూడా వుంది. "అనేక సందర్భాలలో – బహుశా అత్యధిక సందర్భాలలో కూడా జాతీయ ఉద్యమాన్ని బలపరుస్తూనే వున్న పీడిత దేశ బూర్జువా వర్గం, మరోవైపున సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో సహకరిస్తూ వుంటుంది. అనగా సమస్త విప్లవోద్యమాలకూ, సమస్త విప్లవ వర్గాలకూ వ్యతిరేకంగా సామ్రాజ్యవాద బూర్జువా వర్గంతో కలిసి పోరాడుతుంది." ఆ రకంగా బూర్జువా ప్రజాతంత్ర ఉద్యమాలలో "విప్లవ" శక్తుల నుండి "సంస్కరణవాద శక్తులను" వేరుగా చూడాలి. కమ్యూనిస్టులు "వలస దేశాల బూర్జువా విముక్తి ఉద్యమాన్ని బలపరిచేది ఎప్పుడంటే అవి నిజంగా విప్లవ కరంగా వున్నప్పుడు మాత్రమే". అయితే "విప్లవకరము" అన్న పదానికి పరిమితమైన రీతిలో అర్థాన్నివ్వడం జరిగింది. ఎక్కడెక్కడైతే బూర్జువా జాతీయవాదులు, "రైతాంగానికీ, పీడిత జన సామాన్యానికి విప్లవతత్వంతో శిక్షణనిచ్చి సమీకరించే మన కృషికి అడ్డం పడరో" అప్పుడు ఈ అర్థం అన్వయిస్తుంది. "మొత్తం వలసల్లోనూ, వెనుకబడిన దేశాలలోనూ స్వతంత్ర కార్యకర్తల (కమ్యూనిస్టు) దళాలను, పార్టీ శాఖలను నెలకొల్పవలసిందిగా" జనాలను సంఘటిత పరచేందుకై ముందుకు వచ్చే వారికి పిలుపు నివ్వడం జరిగింది. అయితే అణగారిన ప్రజలకు కమ్యూనిస్టులు ఎలాంటి భవిష్యత్ చిత్రాన్ని చూపుతున్నారు? తొలుత తన ప్రసంగంలో లెనిన్ పేర్కొన్నట్లుగా అనివార్యమైన పెట్టుబడిదారీ పరిణామాన్ని ప్రజల ముందు వుంచుతారా? లేదు. తద్విరుద్ధంగా పెట్టుబడిదారీ అభివృద్ధి దశలో అడుగు పెట్టకుండానే

**"వాస్తవానికి ఈ విషయాన్ని 1925లోనే స్టాలిన్ ప్రత్యేకించి భారతదేశానికి సూచించారు. "సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో పట్టణ, గ్రామీణ పెటీ బూర్జువాలకు చెందిన అసంఖ్యాక జనాలకు నేతృత్వం వహించేందుకు గాను, రాజీపడే బూర్జువా సెక్షన్లను ఏకాకులుగా చేసిన అనంతరం బూర్జువాలలోని విప్లవ సెక్షన్లతో బహిరంగంగానే పొత్తు పెట్టుకోవలసిందిగా" ఆయన కమ్యూనిస్టు పార్టీకి పిలుపు ఇచ్చారు."**

"సోవియట్ వ్యవస్థ" ద్వారా "కమ్యూనిజంలోకి" ప్రవేశించాలని వెనుకబడిన దేశాలకు ఆయన సూచిస్తారు. మరోవిధంగా చెప్పాలంటే విప్లవవాద జాతీయ బూర్జువాలతో ఒక విధమైన పొత్తు పెట్టుకోవడం ద్వారా మద్దతునిస్తూనే విముక్తి అనంతరం దేశంలో అమలు జరప వలసిన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని కమ్యూని స్టులు చూపగలగాలి.

వాస్తవానికి ఈ విషయాన్ని 1925లోనే స్టాలిన్ ప్రత్యేకించి భారతదేశానికి సూచించారు. "సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో పట్టణ, గ్రామీణ పెటీ బూర్జువా లకు చెందిన అసంఖ్యాక జనాలకు నేతృత్వం వహించేందుకు గాను, రాజీపడే బూర్జువా సెక్షన్లను ఏకాకులుగా చేసిన అనంతరం బూర్జువాలలోని విప్లవ సెక్షన్లతో బహిరంగంగానే పొత్తు పెట్టుకోవలసిందిగా" ఆయన కమ్యూనిస్టు పార్టీకి పిలుపు ఇచ్చారు.

వలస దేశాలలో కమ్యూనిస్టు పార్టీల స్థాపన కోసం ఇచ్చిన పిలుపుతో ప్రేరణ పొందిన ఎం.ఎన్. రాయ్, తాష్కెంట్‌కు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ భారతదేశాన్నుండి వచ్చిన ముస్లిం ప్రవాసులు (మొహాజిర్‌లు) అనేకులు వున్నారు. కమ్యూనిజం వైపుకు రావలసిందిగా వారిలో కొంతమందికి నచ్చచెప్పడం జరిగింది. తత్ఫలితంగా తాష్కెంట్‌లో 1920 అక్టోబర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. దీని ప్రధాన కార్యాలయం రాయ్‌తో పాటు తిరుగుతూ వుండేది. విదేశాలలో శిక్షణ పొందిన కమ్యూనిస్టులను భారత్‌కు పంపడానికి ఆయన నిరంతరం కృషి చేశారు. అయితే దురదృష్టవశాత్తు వీరు ప్రభుత్వానికి చిక్కారు. దారుణమైన శిక్షలకు గురయ్యారు. పెషావరు కుట్ర కేసు (1921 – 23)గా ఇది ఎంతో ప్రసిద్ధి గాంచింది.

ఈ తొలి ప్రయత్నాలు ఫలించక పోయినప్పటికీ భారతదేశంలో వామపక్ష ఉద్యమావిర్భావంలో వాటికి కూడా పాత్ర వున్నది. ఈ మొట్టమొదటి కమ్యూనిస్టు స్వాతంత్ర్య యోధుల పేర్లను (మహమ్మద్ అక్బర్ ఖాన్, ఈయనకు ఏడేళ్ళ కఠిన కారాగార శిక్ష పడింది. అలాగే ఇతరులకు కూడా కఠిన శిక్షలు పడ్డాయి. అయితే తక్కువ సంవత్సరాలు పడ్డాయి). ఈనాటికీ తలచుకోవలసి వుంది. కాగా నిజమైన వామపక్ష ఉద్యమ ఆవిర్భావం దేశం లోపలే జరిగింది.

### భారతదేశంలో సోషలిస్టు – వామపక్ష భావాల ఆవిర్భావం

భారతదేశ స్వాతంత్ర్యం విషయం లోనూ, అదేవిధంగా ఖిలాఫత్ ఉద్యమ (1920 – 22) కాలంలో టర్కిష్ ప్రతిఘటనకు సంఘీభావం తెలుపడంలోనూ భారత జాతీయోద్యమం, సోవియట్ రష్యా ఒకే పక్షాన వున్నాయి. అనేకమంది జాతీయ నాయకుల్లో సోవియట్ పట్ల సానుభూతి పెరగడానికి ఈ ఘటన దోహదం చేసింది. అయితే భారతదేశంలో సోషలిస్టు భావాలకు సంపద్వంతమైన భూమికను ఏర్పాటు చేసిన ముఖ్య కారణం మరోటి వుంది. భారతదేశ దారిద్ర్యం పట్ల జాతీయ నాయకులు ఆందోళన చెందడమే ఆ కారణం.

భారత జాతీయ కాంగ్రెస్ పితామహులు, బ్రిటిష్ పాలనపై తాము చేసిన విమర్శలో భారత ప్రజలనుభవిస్తున్న దారిద్ర్యాన్ని ప్రధాన విషయంగా చూపారు. 1876 నుండి దాదాబాయ్ నౌరోజీ పత్రికల ద్వారా, విజ్ఞాపన పత్రాల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రజల దారిద్ర్య క్లేశాలను గణాంక వివరాలతో సహా తెలియచేస్తూ వచ్చారు. బ్రిటన్‌కు చెల్లిస్తున్న కప్పాలు, స్వేచ్ఛా వాణిజ్యం కారణంగా పరిశ్రమల పతనం, అధిక పన్నులు, బ్రిటిష్ ప్రభుత్వ విధానాల ఫలితంగా కరెన్సీలో జరిగే అవకతవకలు యీ దారిద్ర్యానికి కారణమని ఆయన పేర్కొన్నారు. నౌరోజీ రచనలను ఒక సంకలనంగా లండన్‌కు చెందిన శ్వాన్ సొన్నిచిన్ అండ్ కో 1901లో ప్రచురించింది. విశేషమేమిటంటే ఎంగెల్స్ సంపాదకత్వంలో రూపొందిన కేపిటల్ (మొదటి సంపుటం) ఆంగ్లానువాదాన్ని కూడా 1887లో యీ సంస్థే ప్రచురించింది. 1901లో రమేష్‌చంద్రదత్ కూడా తన ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా అండర్ ఎర్లీ బ్రిటిష్ రూల్ అన్న గ్రంథాన్ని ప్రచురించాడు. రెండేళ్ళ అనంతరం (1903) దీని తరువాత భాగమైన 'ది ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా ఇన్ ది విక్టోరియన్ ఏజ్'ను ప్రచురించాడు. ఈ గ్రంథం వలసల్లో సాగుతున్న ఆర్థిక దోపిడీని వివరించింది. భారతదేశ దారిద్ర్యాన్ని గురించి ఈ శతాబ్దం ప్రారంభం నాటికి జాతీయోద్యమ సాహిత్యం ఏ మేరకు వెలువడిందీ బిపిన్ చంద్ర జరిపిన సమగ్ర అధ్యయనాన్ని బట్టి తెలుసుకోవచ్చు. బ్రిటిష్‌వారి దోపిడీ గురించి సులభశైలిలో వివరించే జాతీయవాదుల రచనలను విరివిగా ప్రచారంలో పెట్టడం జరిగింది. ఇందుకొక మంచి ఉదాహరణ ఏమిటంటే 1909లో గాంధీజీ రచించిన హిందూ స్వరాజ్. జాతీయవాదులు తమ విమర్శలను ప్రధానంగా బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగానే ఎక్కుపెట్టారనడం వాస్తవం. భారతీయుల కర్మాగారాలలోని కార్మికుల కడగండ్ల గురించి అదే విధంగా భూస్వాములు కౌళ్ళు పెంచి రైతులను అణచివేయడం గురించి వీరు చాలావరకు మౌనం పాటించారు. అణచివేతదారుడిని గుర్తించడానికి ప్రజల దారిద్ర్యాన్ని ఒకసారి గీటురాయిగా తీసుకున్న తర్వాత భారతీయ పెట్టుబడిదారులను, భూస్వాములను కూడా దోషులుగా ఎంచడం అనివార్యం.

మొట్టమొదటి రైతు సమీకరణకు 1917–18లో గాంధీజీయే చొరవ చూపారు. ఇందుకోసంభారతీయ భూస్వాములకు ఎలాంటి సంబంధమూ లేని చాంపరాన్, ఖేడాలను జాగ్రత్తగా ఎంపిక చేశారు. అయితే 1918లో సాగిన అహమ్మదాబాద్ జౌళి కార్మికుల ఆందోళన ఆయన స్వంత మద్దతుదారులతో అంటే పత్తి మిల్లు యజమానులతో ఘర్షణ తెచ్చిపెట్టింది. తమ దారిద్ర్యాన్ని తొలగించుకునే దృక్పథంతో జాతీయోద్యమాన్ని సమర్థించే వైఖరిని ప్రజలు చేపట్టివున్నట్లయితే అనేక ఆటంకాలు తొలగిపోయి వుండేవనటం సుస్పష్టం. ఖిలాఫత్, సహాయ నిరాకరణోద్యమాలతో (1920–22) పాటుగానే చెదురు మదురుగానైనప్పటికీ కృతనిశ్చయంతో కూడిన ప్రజా పోరాటాలు జమిందారులకు వ్యతిరేకంగా అంతకుమునుపెన్నడూ జరగని రీతిలో సాగటం యాదృచ్ఛికం కాదు. బీహార్‌లోని దర్భాంగాలో

రైతుల తిరుగుబాటు (1920). ఔధ్‌లో (యు.పి.) తాలూకుదార్‌కు వ్యతిరేకంగా రైతుల ఆందోళన (1921-22) మలబార్‌లోని మోప్లాల తిరుగుబాటు (1921) చెప్పుకో దగినవి. కార్మికవర్గం కూడా తన ఆకాంక్షలను వ్యక్తం చేయసాగింది. 1921లో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి.) ఆవిర్భావం దీనినే వెల్లడిస్తున్నది. ఒక్క గాంధీ మినహా ముఖ్యమైన జాతీయ నాయకులందరూ దీని ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

జాతీయోద్యమంలోకి కార్మిక కర్షకులను తీసుకురావలసిన ఆవశ్యకతపై పెరుగుతున్న నూతన జాగృతి గయా కాంగ్రెస్ సమావేశాల్లో (1922) సి.ఆర్. దాస్ ఇచ్చిన అధ్యక్షోప న్యాసంలోనూ, అదే ఏడాది ఎ.ఐ.టి.యు.సి. సమావేశంలో చేసిన ప్రసంగంలోనూ వ్యక్తమైంది. "98 శాతం ప్రజలకు" స్వరాజ్యం కావాలని ఆయన యీ ప్రసంగంలోనే పేర్కొన్నారు. 1924లో జైలు నుంచి విడుదలైన గాంధీజీ సంపూర్ణ సమానత్వ వాదాన్ని ప్రభోదిస్తూ ఐచ్ఛిక సార్వజనీన ఓటు హక్కును డిమాండ్ చేశారు. తనకు తాను "సోషలిస్టు"గా అభివర్ణించుకొని యంత్ర పరిశ్రమలపై ప్రభుత్వ యాజమాన్యం వుండాలని పేర్కొన్నాడు. అయితే ఇది ఆయన స్వప్నమైన ఆదర్శ రాజ్యాంలోనే నెరవేరుతుంది. తాను నడుపుతున్న యంగ్ ఇండియా పత్రికలో ఎం.ఎన్.రాయ్ వ్యాసాన్ని ప్రచురించాడు (1925). బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహాన్ని ఆయన పట్టించుకోలేదు. గాంధీజీ వ్యతిరేకత తెల్పినప్పటికీ లెనిన్ మృతికి సంతాపాన్ని తెలిపే తీర్మానం ఎ.ఐ.సి.సి.లో 63-54 ఓట్లతో గెలిచింది.

సోషలిజం, సోవియట్ రష్యాల పట్ల జాతీయోద్యమంలోని సమరశీల శక్తులలో పెరుగుతున్న సానుభూతిని ఈ ఓటింగ్ సరళి సూచిస్తున్నది. స్వరాజ్యం లేదా హోంరూల్ అన్న అస్పష్ట భావన స్థానంలో "స్వాతంత్ర్యం" అన్న భావనను 1923 నుంచి జవహర్‌లాల్ నెహ్రూ స్వీకరించడంతో ఆయన కమ్యూనిస్టులకు చేరువయ్యారు. 1927లో బ్రస్సెల్స్‌లో కమ్యూనిస్టుల నేతృత్వాన జరిగిన అణగారిన జాతుల మహాసభకు ఆయన హాజరయ్యారు. దానితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నూతనంగా ఆవిర్భవించిన లీగ్‌లో భాగస్వామ్యానికి ఆయన అంగీకరించినట్లయింది. సోవియట్ రష్యాను కూడా ఆయన సందర్శించారు. ఆ ఏడాది చివరిలోనే ఆయన సుభాష్‌చంద్రబోస్‌తో కలిసి మద్రాస్ కాంగ్రెస్ మహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్యం అన్న తీర్మానాన్ని నెగ్గించుకోగలిగాడు. 1928లో భారత స్వాతంత్ర్య లీగ్ స్థాపనకు వీరిరువురూ తోడ్పడ్డారు. 1934-35లో సోషలిజం, కమ్యూనిజంల వైపుకు సుదీర్ఘ ప్రయాణం అన్న వ్యాసాన్ని రాస్తూ "నా హృదయంలోని చీకట్లను మార్క్సిజం అనే వెలుగు పారద్రోలింది" అని చెప్పుకున్నాడు. 1920 చివరి నాటి తన అనుభవాల గురించి నెహ్రూ సుస్పష్టంగా చెప్పుకున్నాడు. సోషలిజం వైపు ఈ రకమైన మొగ్గదలే "విప్లవకారులలో" కూడా కనిపిస్తుంది. అప్పటికే అంటే 1926లో నౌ జవాన్ భారత సభను స్థాపించినప్పుడే సోషలిజం పట్ల భగత్‌సింగ్ కున్న విశ్వాసం వెల్లడైంది. 1928లో చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్‌ల నేతృత్వంలో దేశంలోని విప్లవ బృందాలన్నీ ఢిల్లీలో సమావేశమైనప్పుడు తమ సంస్థ పేరును హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ సమాఖ్యగా మార్చుచేశారు.

> **"సోషలిజం, సోవియట్ రష్యాల పట్ల జాతీయోద్యమంలోని సమరశీల శక్తులలో పెరుగుతున్న సానుభూతిని ఈ ఓటింగ్ సరళి సూచిస్తున్నది. స్వరాజ్యం లేదా హోంరూల్ అన్న అస్పష్ట భావన స్థానంలో "స్వాతంత్ర్యం" అన్న భావనను 1923 నుంచి జవహర్‌లాల్ నెహ్రూ స్వీకరించడంతో ఆయన కమ్యూనిస్టులకు చేరువయ్యారు."**

నిజమైన సోషలిస్టు భావజాలాన్ని కలిగి వున్నట్లుగానే ఈ ధోరణులను భావించవలసి వుంటుంది. ఈ కాలంలోనే ఎం.ఎన్. రాయ్ అనేక విమర్శలు చేశాడు. వీటిల్లో కొన్ని తీవ్రమైనవి. లెనిన్ నిర్వచించినట్లుగా మౌలికంగా బూర్జువా ప్రజాతంత్రవాదులైన వారి నుంచి అతిగా ఆశించడం నుండి ఈ విమర్శలు పుట్టాయని గ్రహించవలసి వుంటుంది. ఏది ఏమైనప్పటికీ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు వీరినుండే పుట్టుకొచ్చారు.

### కమ్యూనిస్టులు - జాతీయోద్యమము : 1922-29

1922 నాటికి కలకత్తాలో ముజఫర్ అహ్మద్, బొంబాయిలో ఎస్.ఎ. డాంగే, మద్రాసులో ఎం. సింగారవేలు చెట్టియార్, లాహోర్‌లో గులాంహుసేన్‌లు వివిధ స్థాయిల్లో కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రచారం చేయడం సాగించారు. స్వరాజ్ పార్టీ ఏర్పాటు జాతీయోద్యమంలో వామపక్ష పార్టీ ఏర్పాటు భావనను పురికొల్పిందనడం నిస్సందేహం. భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందిన భారతీయ సోషలిస్టు లేబర్‌పార్టీ అన్న అభిప్రాయాన్ని 1922లో డాంగే ముందుకు తెచ్చాడు. ఆ మరుసటి ఏడాది హిందూస్థాన్ లేబర్-కిసాన్ పార్టీ ప్రణాళికను చెట్టియార్ ప్రచురించాడు. భారతీయ కార్మిక కర్షక పార్టీని ఏర్పాటు చేసేందుకై లక్నోలో సదస్సు జరపాలని లాహోర్ నుంచి వెలువడే ఇంక్విలాబ్ పత్రిక సంపాదకుడు గులాం హుసేన్ 1923 ఏప్రిల్‌లో ప్రతిపాదించాడు. అయితే ఈ ప్రయత్నాలు ఫలించడానికి ముందే బ్రిటిష్ ప్రభుత్వం, ముఖ్యమైన కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేసి కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసును బనాయించింది. 1924 మేలో ముజఫర్ అహ్మద్, షౌకత్ ఉస్మాని, డాంగే, నళినీగుప్తాలకు నాలుగేళ్ళ కఠిన కారాగారవాస శిక్ష పడింది. అనారోగ్యంతో బాధపడుతున్న చెట్టియార్‌ను ఈ కేసు నుండి మినహాయించారు. ఈ కఠిన శిక్షలకు గానీ, పెషావర్ కేసుల్లో పడిన శిక్షలకు గానీ జాతీయోద్యమ నాయకులెవ్వరూ తగిన రీతిలో నిరసన తెలుపలేదు. జాతీయ స్వాతంత్ర్యాన్ని కానప్పటికీ పౌర స్వేచ్ఛను అలక్ష్యం చేసే ఆశ్చర్యకరమైన వైఖరి ఇది. ఈనాటి కమ్యూనిస్టు వ్యతిరేకులు విస్మరించిన అనేక సత్యాలలో ఇదొకటి.

కాన్పూర్ కుట్ర కేసు వున్నప్పటికీ వామపక్ష శక్తులను చెప్పుకోదగిన విధంగా బలోపేతం చేసే రెండు పరిణామాలు సంభవించాయి. మొదటిదేమిటంటే కాన్పూర్‌లోనే భారతీయ కమ్యూనిస్టుల సదస్సును నిర్వహించ డం, స్థానిక 'జాతీయ' కమ్యూనిస్టు సత్య భక్త ఆహ్వానం మేరకు 1925 డిసెంబర్‌లో ఈ సదస్సు బహిరంగంగా జరిగింది. ఈ సదస్సులో అధ్యక్షునిగా సింగారవేలు, ఎ.ఐ.సి.సి. సభ్యుడైన జనక ప్రసాద్ బగిర్హత్త ప్రధాన కార్యదర్శిగానూ, ముజఫర్ అహ్మద్ (అనారోగ్యం కారణంగా జైలు నుండి విడుదలయ్యారు). ఎస్.వి. ఘాటే తదితరులు కార్యనిర్వాహక వర్గ సభ్యులుగానూ

“భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని, దాని నాయకులను నాలుగేళ్ళకు పైగా (1929-33) అణచివేయడానికి మీరట్ కుట్ర కేసు ఉపయోగపడిం ది. 1930 డిసెంబర్‌లో లాహోర్ సమావేశాలు ముగిసిన వెనువెంటనే కాంగ్రెస్ చేపట్టిన శాసనో ల్లంఘనోద్యమం తరుణంలో ఇది సంభవించింది.”

ఎన్నికయ్యారు. అత్యంత సాహసంతో కూడుకొన్న ఈ సదస్సు నిర్వహణకు తగినట్లే పెషావర్, కాన్పూర్ కుట్ర కేసుల్లో చిక్కుకొన్న పదముగ్గురు కమ్యూనిస్టులకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఒక తీర్మానాన్ని సదస్సులో ఆమోదించారు. ఏ రకమైన అరమ రికలు లేకుండా పార్టీ లక్ష్యాన్ని నిబంధనావళిలో పేర్కొనడం జరిగింది.

**బ్రిటన్ సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి భారతదేశానికి విముక్తి కల్పించి, తద్వారా ఉత్పత్తి సాధనాలను, పంపిణీ వ్యవస్థను సామాజికీకరించే ప్రాతిపదికపై కార్మిక కర్షక రిపబ్లిక్‌ను ఏర్పాటు చేయడం.**

ఈ విశిష్ట ప్రకటనకు యీ క్రింది భాగాన్ని కూడా జతచేయడం జరిగింది.

**ఏ మత సంస్థలోనైనా సభ్యుడుగా వుంటే వారికి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం లభించదు.**

మత సంస్థలతో సంబంధమున్న వ్యక్తులను మినహాయించడం ద్వారా విశిష్టతను చాటుకొన్న మొట్టమొదటి రాజకీయ పార్టీ కమ్యూనిస్టు పార్టీయే కావచ్చు.

మరో ముఖ్యమైన రెండవ పరిణామమేమిటంటే కాన్పూర్ కమ్యూనిస్టు సదస్సుకు కాస్త ముందుగా అంటే 1925 నవంబర్‌లో విస్తృత ప్రాతిపదికపై వామపక్ష భావాలు కలిగిన పార్టీని బెంగాల్‌లో ఏర్పాటు చేయడం. భారత జాతీయ కాంగ్రెస్ యొక్క లేబర్ స్వరాజ్ పార్టీ యిది. 1926లో దాని పేరు మార్చి పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ ఆఫ్ బెంగాల్ అని పిలవసాగారు. స్వరాజ్ పార్టీలో వున్న హేమంత కుమార్ సర్కార్ వంటి వామపక్షవాదులు, విప్లవకవి నజ్రుల్ ఇస్లాం వంటి వారి స్ఫూర్తి దీనికి వున్నది. దాని అధికారిక పత్రికయైన లంగల్‌కు ముజఫర్ అహ్మద్ సంపాదకునిగా పనిచేశారు. “సామాజికార్థిక విముక్తిపై ఆధారపడిన సంపూర్ణ స్వాతంత్ర్యం” కావాలని ఈ పార్టీ పిలుపునిచ్చింది. లంగల్ పత్రిక కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేస్తూనే అదే సమయంలో 1924 నుండి మాండలే జైలులో వున్న సుభాష్ చంద్రబోస్‌కు సంఘీభావాన్ని ప్రకటించింది. రైతుల హక్కులను ఎలుగెత్తి చాటుతూ కార్మికులను సంఘటితం చేయసాగింది. కాగా ఈ పార్టీ తరహాలోనే 1927 జనవరిలో బొంబే వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ ఉనికిలోకి వచ్చింది. యు.పి., పంజాబ్‌లలో కూడా ఇలాంటి పార్టీలు ఆవిర్భవించాయి. 1928 డిసెంబర్‌లో ఆల్ ఇండియా వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ ఏర్పడింది. ఈ పార్టీలన్నిటిలోనూ వున్న ఉమ్మడి లక్షణమేమంటే కమ్యూనిస్టులతో పాటు వివిధ స్థాయిలకు చెందిన కాంగ్రెస్‌వాదులు పాల్గొనటం. ఈ కొత్త పార్టీ శక్తి ఏమిటో 1928 డిసెంబర్ 30న వెల్లడైంది. కలకత్తాలో జరుగుతున్న కాంగ్రెస్ మహాసభ వేదిక వద్దకు దాదాపు 20వేల మంది పారిశ్రామిక కార్మికులు ప్రదర్శనగా వచ్చి సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆమోదించాలని, మోతీలాల్ నెహ్రూ నివేదికలో ఆమోదించిన అధినివేశ ప్రతిపత్తి కోర్కెను విడనాడాలని డిమాండ్ చేశారు. వారి రాకపట్ల హర్షాన్ని తెలియజేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ వారినుద్దేశించి ప్రసంగించారు. డిసెంబర్ 27న జరిగిన సోషలిస్టు యువజన కాంగ్రెస్‌కి కూడా నెహ్రూ అధ్యక్షత వహించారు. కమ్యూనిజం “ఒక్కటే మార్గమని” యీ కాంగ్రెస్‌లోనే నెహ్రూ ప్రకటించారు.

### మీరట్ కుట్ర కేసు : శాసనోల్లంఘనం – 1929–34

సమరశీల జాతీయవాదులకు, కమ్యూనిస్టులకు మధ్య సహకారానికి యీ రకంగా భూమిక ఏర్పడింది. క్రమక్రమంగా పెరుగుతున్న యీ సాహచర్యాన్ని బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళనతో గమనించసాగింది. అప్పటికే, పబ్లిక్ సేఫ్టీ బిల్లుకు జాతీయ నాయకులు తీవ్ర వ్యతిరేకత తెల్పడంతో ప్రభుత్వం యిబ్బందులలో చిక్కుకుని వున్నది. 1929 మార్చి 20న ప్రముఖ కమ్యూనిస్టు, వామపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులను 31 మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో అరెస్టు చేసిన వీరిని మీరట్‌కు తీసుకువచ్చారు. “బ్రిటిష్ ఇండియా సర్వాధికారి అయిన రాజును (ఇంగ్లండ్) తొలగించడానికి కుట్ర పన్నారనే” ఆరోపణపై వీరి మీద విచారణ మొదలైంది. మరో ఇరువురిని కూడా అరెస్టు చేసి కేసులో ఇరికించారు. మీరట్ కేసు నిందితుల్లో బెన్‌బ్రాడ్లీతో సహా ముగ్గురు బ్రిటిష్ కమ్యూనిస్టులున్నారు. 1933 జనవరి వరకు ఈ విచారణ కొనసాగింది. కఠినమైన శిక్షలే పడ్డాయి. ముజఫర్ అహ్మద్‌కు జీవితకాల ద్వీపాంతరవాస శిక్ష పడింది. డాంగే, స్ప్రాట్‌లతో సహా అయిదుగురుకు పన్నెండేళ్ళు ఖైదు పడింది. బ్రాడ్లీ, మిరాజ్‌కర్, ఉస్మానీలకు పదేళ్ళ చొప్పున, మిగిలిన 17 మందికి 4 నుండి 7 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఆగస్టులో తిరిగి అప్పీలు చేసుకోవడంతో యీ కఠిన శిక్షలు కాస్త తగ్గాయి. కానీ అహ్మద్, డాంగే, స్ప్రాట్, స్మాన్‌లు 1933 చివరి వరకు జైలులోనే వున్నారు. కాగా కమ్యూనిస్టు పార్టీ దాని అనుబంధ సంస్థలు “చట్ట విరుద్ధమైనవని” వాటిల్లో సభ్యత్వాన్ని కలిగి వుండటం నేరమని 1934 జులై 23న బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది.

భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని, దాని నాయకులను నాలుగేళ్ళకు పైగా (1929–33) అణచివేయడానికి మీరట్ కుట్ర కేసు ఉపయోగపడింది. 1930 డిసెంబర్‌లో లాహోర్ సమావేశాలు ముగిసిన వెనువెంటనే కాంగ్రెస్ చేపట్టిన శాసనోల్లంఘనోద్యమం తరుణంలో ఇది సంభవించింది. నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో సోషలిజాన్ని బహిరంగంగా సమర్థించడంలో యీ మహాసభలు మరింత ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. ఒకవైపున మీరట్ కేసు ద్వారా కమ్యూనిస్టులను తటస్థం చేయడంలోనూ, కమ్యూనిస్టుల నేతృత్వంలోని వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీని చిన్నాభిన్నం చేయడంలోను బ్రిటిష్ ప్రభుత్వం జయప్రదమైనప్పటికీ మరోవైపున ప్రజా ఉద్యమం ద్వారా సమరశీల జాతీయ శక్తులు కాంగ్రెస్ నాయకత్వాన్ని చేజిక్కించుకొన్నాయి. నిరంతర అణచివేత కొనసాగుతుండటంతో కమ్యూనిస్టులు, కేంద్రీకృత నాయకత్వాన్ని పునరుద్ధరించలేకపోయారు. బొంబాయి, కలకత్తా కమ్యూనిస్టులు వేర్వేరుగా

**“ 1934-35లో “సనాతన కమ్యూనిస్టుల” వైఖరి తనకెలా కనిపించిందీ నెహ్రూ ఆత్మకథలో వివరించారు. పెట్టుబడిదారులు, భూస్వాములతో పీటముడి వేసుకున్న కాంగ్రెస్ నాయకులు “బ్రిటిష్ వారు వెళ్ళిపోవడాన్ని కోరుకోవడం లేదన్న కమ్యూనిస్టుల విశ్వాసాన్ని ఒక కట్టుకథ క్రింద ఆయన తీసిపారేస్తారని ఎవరైనా వూహించి వుండ వచ్చు. కానీ “చాలావరకు వారి (కమ్యూనిస్టుల) సైద్ధాంతిక విమర్శలు శక్తిమంత మైనవని తదనంతర ఘటనలు వాటిని పాక్షికంగా రుజువు చేశాయి అని ఆయన అంగీకరించారు. ”**

పనిచేయసాగారు. చివరికి 1932లో బొంబాయి కమ్యూనిస్టులలో చీలిక కూడా వచ్చింది. దానికితోడు 1930 చివరిలో దేశానికి తిరిగి వచ్చిన ఎం.ఎన్. రాయ్ పోటీ కమ్యూనిస్టు పార్టీని స్థాపించడానికి ప్రయత్నించడంతో కమ్యూనిస్టులలో మరింత అస్థిరత చోటు చేసుకున్నది. 1929లో అరెస్టులు జరిగిన వెంటనే మీరట్ కేసు నిందితుల రక్షణ కోసం మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటయింది. జవహర్‌లాల్ నెహ్రూ కూడా దానిలో వున్నారు. అయితే ఈ ఉత్సాహం కొద్దిరోజుల్లోనే నీరుకారిపోయింది. ముఖ్యంగా లార్డ్ ఇర్విన్‌ను కీర్తిస్తూ 1929 నవంబర్ 2న ఢిల్లీ ప్రకటన వెలువడిన అనంతరం ఈ మార్పు కనిపించింది. దానిపై గాంధీ, మోతీలాల్, జవహర్‌లాల్ తదితర కాంగ్రెస్ ప్రముఖులు సంతకాలు చేశారు. 1930 నాటి శాసనోల్లంఘనానికి ప్రాతిపదికగా గాంధీజీ ప్రకటించిన పదకొండు పాయింట్లలో భగత్‌సింగ్ ఆయన సహచరుల విషయం గానీ (అప్పటికే వారికి మరణశిక్ష విధించడం జరిగింది). మీరట్ నిందితుల విషయం గానీ చోటు చేసుకోలేదు. అంతేకాక 1931 మార్చి 4న కుదిరిన గాంధీ – ఇర్విన్ ఒడంబడికలో సైతం వీరి ప్రస్తావన రాలేదు.

ఈ రకమైన పరిస్థితులలో ఆగ్రహంతో వున్న భారత కమ్యూనిస్టులు కొమింటరన్ కొత్త వైఖరి పట్ల వెనువెంటనే తమ స్పందనను తెలియజేశారు. 1928 సెప్టెంబర్ 1న మాస్కోలో ముగిసిన ఆరవ మహాసభ అనంతరం ఈ వైఖరి వెల్లడైంది. మొత్తం మీద ఈ వైఖరిలో కొన్ని ఒంటెత్తువాద అంచనాలున్నప్పటికీ, భారత “బూర్జువా జాతీయవాదం, ఇప్పటికే వ్యవసాయ విప్లవానికి తూట్లు పొడిచిందని”, భవిష్యత్‌లో ఇది “ప్రతీఘాత విప్లవ పాత్ర నిర్వహించగలదని” కొమింటర్న్ అంచనా వేసింది. కనుక భారత కమ్యూనిస్టుల “ప్రథమ కర్తవ్యం” ఏమిటంటే బలమైన కమ్యూనిస్టు పార్టీని స్థాపించడం, “రెండవది” ఏమిటంటే “దాని నాయకత్వంలో వ్యవసాయ విప్లవాన్ని తేవడం” ఆ రకంగా “సామ్రాజ్య వాదులతోనూ, భూస్వాములతోనూ రాజీపడే బూర్జువాలతోనూ తెగతెంపులు చేసుకోవడం.” దీనిననుసరించి కాంగ్రెస్‌తో ఏ రకమైన రాజకీయ పొత్తు గురించి ఆలోచించలేదు. మీరట్ కేసు కారణంగా కమ్యూనిస్టు నాయకులు జైలు పాలు కావడంతో వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ మనుగడను కోల్పోయింది.



స్వాతంత్ర్యోద్యమంలోనే కమ్యూనిస్టులు నాటి హిందూ మహాసభ మతోన్మాదినకి వ్యతిరేకంగా పోరాడారు. మతతత్వానికి లాహోర్‌లో కమ్యూనిస్టులు నిర్వహించిన ప్రదర్శన

ఇర్విన్‌తో తాను కుదుర్చుకున్న ఒడంబ డిక గురించి వివరించేటందుకై బొంబాయిలోని పార్లేలో ఒక “కార్మిక సభ” నుద్దేశించి 1931 మార్చి 16న గాంధీజీ ప్రసంగించారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టులు అడ్డు తగిలి మీరట్ కుట్ర కేసు నిందితులను, తన పదకొండు సూత్రాలనూ, “స్వాతంత్ర్య సారాంశాన్ని” విస్మరించినందుకు గాంధీజీని విమర్శించారు. ఆ తరువాత 1931 చివరిలో లండన్‌లో జరిగిన రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నందుకు గాను గాంధీజీని మీరట్ కేసులోని నిందితులు కోర్టులో చేసిన తమ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ఈ అసంతృప్తి ఎంత దూరం పోయిందంటే గాంధేయవాద వ్యతిరేక లీగు ను స్థాపించడానికి 1934లో కలకత్తాలోని కమ్యూనిస్టులు తోడ్పడ్డారు.

1934–35లో “సనాతన కమ్యూనిస్టుల” వైఖరి తనకెలా కనిపించిందీ వివరించడానికి గాను తన ఆత్మకథలో నెహ్రూ కొన్ని పుటలను కేటాయించారు. పెట్టుబడిదారులతోనూ, భూస్వాములతోనూ పీటముడి వేసుకున్న కాంగ్రెస్ నాయకులు “బ్రిటిష్ వారు వెళ్ళిపోవడాన్ని కోరుకోవడం లేదన్న కమ్యూనిస్టుల విశ్వాసాన్ని ఒక కట్టుకథ క్రింద ఆయన తీసిపారేస్తారని ఎవరైనా వూహించి వుండవచ్చు. కానీ “చాలావరకు వారి (కమ్యూనిస్టుల) సైద్ధాంతిక విమర్శలు శక్తిమంతమైనవని తదనంతర ఘటనలు వాటిని పాక్షికంగా రుజువు చేశాయి అని ఆయన అంగీకరించారు.

### కాంగ్రెస్‌లో సోషలిస్టు – వామపక్ష శక్తులు 1930–34

జాతీయోద్యమంలోకి అపార ప్రజారాసులను మొట్టమొదటిసారిగా శాసనోల్లంఘనోద్యమం తీసుకువచ్చింది. కాంగ్రెస్‌లో సోషలిస్టు, వామపక్ష భావాలు కూడా త్వరితగతిన పెంపొందాయి. అదే సమయంలో రాయితీలు, రాజీలు కూడా చోటు చేసుకున్నాయి. 1934–35 పరిస్థితి గురించి నెహ్రూ సరిగ్గానే రాశాడు. “కాంగ్రెస్‌లో కొంతమంది – నిజానికి వారి సంఖ్య పెరుగుతున్నది కూడా. భూ వ్యవస్థలోను, పెట్టుబడిదారి విధానంలోనూ మార్పు రావాలని కోరుతున్నారు.” అయితే “వారు కాంగ్రెస్ పేరుతో మాట్లాడటం లేదు.” ఇవి ఆధారరహితమైన వ్యాఖ్యలు కావు. సోషలిస్టు భావాల పరివ్యాప్తికి నెహ్రూ స్వయంగా దోహదం చేశాడు. ప్రాథమిక హక్కుల గురించి ఆయన రూపొందించిన తీర్మానాన్ని 1931 మార్చిలో జరిగిన కరాచీ కాంగ్రెస్‌లో గాంధీజీ ప్రవేశపెట్టారు. దానిలో బూర్జువా ప్రజాతంత్ర హక్కులైన సార్వత్రిక ఓటు హక్కు, స్త్రీలకు సమానత్వమూ, కుల నియంత్రణ తొలగింపు వంటి వాటితో పాటు చెప్పదగిన రీతిన కౌలు, రుణాల తగ్గింపు, కీలక పరిశ్రమల పైన ప్రభుత్వ అజమాయిషీ,

> " 1931 జులైలో సోషలిస్టు పార్టీ స్థాపనకు జయప్రకాష్ నారాయణ తోడ్పడ్డారు. ఆ తరువాత కొద్ది సంవత్సరాలలో ముఖ్యంగా కాంగ్రెస్‌వాదులు ఇతర ప్రాంతాలలో కూడా పార్టీని స్థాపించారు. ఈ బృందాలన్నీ కలిసి అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీగా రూపొందాయి. "

ఖనిజ వనరులపైన యాజమాన్యం వంటి వాటిని కూడా వాగ్దానం చేయడం జరిగింది. 1931 ఆగస్టులో ఎ.ఐ.సి.సి. సమావేశం దానిని మరింత విస్తృతపరచి పూర్తి స్థాయి కార్యక్రమంగా రూపొందించింది. మొత్తం మీద ఇది వామపక్షాలకు 'కనీస' కార్యక్రమంగానూ అలాగే గాంధీజీ అనుయాయులకు ఆమోదయోగ్యంగానూ కనిపించింది.

1931 జులైలో సోషలిస్టు పార్టీ స్థాపనకు జయప్రకాష్ నారాయణ తోడ్పడ్డారు. ఆ తరువాత కొద్ది సంవత్సరాలలో ముఖ్యంగా కాంగ్రెస్‌వాదులు ఇతర ప్రాంతాలలో కూడా పార్టీని స్థాపించారు. ఈ బృందాలన్నీ కలిసి అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీగా రూపొందాయి. మార్క్సిస్టులమని బహిరంగంగా చెప్పుకునే నారాయణ్, నరేంద్రదేవ్‌ల నుండి, బ్రిటన్ లేబర్ పార్టీని బలపరిచే మినూ మసానీ వరకు దానిలో సభ్యులుగా వున్నారు. కొమింటర్న్ నుండి బహిష్కృతుడైన అనంతరం ప్రవాసం నుండి తిరిగి వచ్చిన ఎం.ఎన్. రాయ్ వైపు వారు తొలుత ఆకర్షితులయ్యారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌లోనే వుంటూ, అలా చేయడం ద్వారా నాయకత్వంలో మార్పు తీసుకురావాలని వారు వాదించారు. కాంగ్రెస్‌లోను సి.ఎస్.పి. ప్రభావం చెప్పుకోదగిన విధంగా పెరగటం, సోషలిస్టు భావాల పరివ్యాప్తికి తగిన వాతావరణమున్నదనడానికి చిహ్నము. అయితే కాంగ్రెస్ పట్ల కమ్యూనిస్టుల వైఖరిలో మార్పు రావడానికి ఇదేమీ తోడ్పడలేదు.

### "జాతీయ సంఘటన" దిశలో

1929 నాటి నుండి అంటే మీరట్ అరెస్టుల నాటి నుండి కమ్యూనిస్టులు అనేక చిత్రహింసలకు గురయ్యారు. 1933 వరకు అవి ఆగలేదు. పేరు పెట్టి చెప్పనప్పటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కావడమే ''శాసనోల్లంఘన''గా వుండేది. గాంధీ నేతృత్వంలోని శాసనోల్లంఘనం కూడా పరిమితమూ, సాత్వికమూ అని చెప్తూ, దానితో తనకు సంబంధం లేదని వారు చెప్పనప్పటికీ ఎస్.జి. సర్దేశాయ్ వంటి అనేకమంది కమ్యూనిస్టులు సత్యాగ్రహులుగా జైళ్ళకెళ్ళారు. బంకింముఖర్జీ, అబ్దుల్ రజాక్, మోనిసింగ్ వంటి అనేకమంది కమ్యూనిస్టులు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకుగాను కఠిన శిక్షల పాలయ్యారు. ట్రేడ్ యూనియన్లలో కమ్యూనిస్టులు బలహీనంగా వున్నారు. దీనికి అణచివేత ఒక్కటే కారణం కాదు. ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం కూడా ఇందుకు కారణమని చెప్పాలి. ఈ పరిస్థితుల్లో సమ్మె పిలుపుకు కార్మికవర్గ ప్రతిస్పందన అంతకంతకూ సన్నగిల్లింది. కాగా 1929లో ఎ.ఐ.టి.యు.సి. నుండి మధ్యేవాదులు చీలి వెళ్ళిపోయారు. (కమ్యూనిస్టుల వైఖరిని నెహ్రూ సమర్థించాడు). 1931లో ఎ.ఐ.టి.యు.సి. మరోసారి చీలిపోయింది. కమ్యూనిస్టులు విడిగా "రెడ్ టి.యు.సి."ని స్థాపించారు.

ఇలాంటి పరిస్థితుల్లో 1932 నాటి మూడు పార్టీల లేఖ (చైనా, బ్రిటిష్, జర్మన్), ఆ తరువాత 1933 నాటి చైనా పార్టీ లేఖ అందాయి. భారత కమ్యూనిస్టులను ప్రోత్సహిస్తూ వారు తమ స్వంత పార్టీని నిర్మించుకోవాలని స్వంత శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో స్వతంత్రంగా నాయకత్వ పాత్ర వహించాలని ఈ లేఖల్లో పేర్కొనడం జరిగింది. అయితే ఇది అవాస్తవికమైన సలహా, సమైక్య సంఘటన వ్యూహాన్ని, ట్రేడ్ యూనియన్‌ల పునరైక్యతను ఈ లేఖలు నొక్కి చెప్పాయి. కమ్యూనిస్టు పార్టీ పాక్షికంగా కోలుకోవడానికి ఈ మేరకు అవి దోహదపడ్డాయనే చెప్పవలసి వుంటుంది.

అప్పీల్ కారణంగా శిక్షలు తగ్గి, మీరట్ ఖైదీలు ఎక్కువ మంది విడుదల కావడంతో 1933లో పరిస్థితిలో మార్పు వచ్చింది. చెల్లాచెదురుగా వున్న గ్రూపులు తిరిగి ఐక్యమయ్యాయి. కమ్యూనిస్టు పార్టీ ప్రొవిజినల్ కేంద్ర కమిటీ ఏర్పాటయింది. 1934 చివరి నాటికి పరిస్థితి బాగా మెరుగుపడింది. ట్రేడ్ యూనియన్లలో పార్టీ పని పెరిగింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడ్డాయి. దానిలోనే కొంతమంది కమ్యూనిస్టులు (అజయ్‌ఘోష్, పి.సుందరయ్య వంటి వారు) చేరి పనిచేయడం ప్రారంభించారు. ఎం.ఎన్. రాయ్ (కాన్పూర్ కుట్ర కేసులో ఈయనకు కూడా కఠిన శిక్ష పడింది. 1936 వరకు ఆయన జైలులోనే వున్నారు). అనుయాయులతో వున్న వివాదాలు ట్రేడ్ యూనియన్ రంగంలో ఉమ్మడి కార్యాచరణకు ఆటంకం కాలేదు. 1935లో కమ్యూనిస్టులు ఏ.ఐ.టి.యు.సి.లో చేరారు. 1934 జులైలో కమ్యూనిస్టు పార్టీపైనా, దాని సంస్థలపైనా ప్రభుత్వం విధించిన నిషేధాన్నీ, కమ్యూనిస్టులను బలిపశువులుగా మార్చి నిరంతర జైలు శిక్షలను విధించడాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇవన్నీ కూడా గణనీయమైన విజయాలేనని చెప్పవచ్చు.

ఈ పునరుజ్జీవన కాలంలోనే 1935 ఆగస్టులో కొమింటరన్ ఏడవ మహాసభ మాస్కోలో జరిగింది. ప్రత్యేకించి 1933లో జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచవ్యాప్తంగా ఫాసిస్టు ప్రమాదం తలెత్తిందని మహాసభ గుర్తించింది. ఈ మహాసభకు జార్జి డిమిట్రోవ్ తన నివేదికను ఇచ్చారు. సోషల్ డెమొక్రాట్లు, ఇతర ఫాసిస్టు వ్యతిరేక శక్తులతో సహా విస్తృతమైన "ప్రజా సమైక్య సంఘటన" ఏర్పడాలని పిలుపు ఇచ్చారు. దానికి తోడుగా వలస దేశాలపై వాంగ్ మింగ్ ఒక నివేదిక ఇచ్చారు. "జాతీయ కాంగ్రెస్‌లో వుంటూ పని చేయడాన్ని నిర్లక్ష్యం చేయవద్దని" భారత కమ్యూనిస్టులకు చెబుతూ సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటనలో కాంగ్రెస్‌ను నిజమైన భాగస్వామిగా గుర్తించాలని అన్నారు. రజనీ పామీదత్, బెన్‌బ్రాడ్లీలు కలిసి రచించిన ఒక ముఖ్యమైన వ్యాసంలో (భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాసంఘటన) దానికి సంబంధించిన సూచనలు చేశారు. ఈ వ్యాసాన్నే తదుపరి కాలంలో (1936 ఫిబ్రవరి) దత్ – బ్రాడ్లీ థీసెస్ అని పిలిచారు.

ఈ థీసెస్‌లోని ప్రధానమైన అంశాలు ఈ దిగువ విధంగా వున్నాయి.

1 (అ)సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నికరమైన పోరాట పంథా, (ఆ) అణగారిన ప్రజల నిత్యావసరాల కోసం పోరాటం – అన్న ప్రాతిపదికపై అత్యంత విస్తృతమైన సమైక్యత వాంఛనీయం.

2. కాంగ్రెస్ అనేది "జాతీయ విముక్తిని కోరే విభిన్న శక్తులతో కూడిన అతి కీలకమైన ప్రజాసంస్థ."

3. గతంలో కాంగ్రెస్ నాయకత్వం చేపట్టిన అనేక చర్యలు "వినాశనకరమైనవి". అంతేగాక ''సామ్రాజ్యవాదానికి లొంగిపోవడంతో సమానమైనవి."

4. కనుక కాంగ్రెస్‌ను విమర్శించాల్సిన అవసరం వున్నది. అయితే ఈ విమర్శ ఇప్పటికే కాంగ్రెస్‌లో వున్న శక్తుల ఐక్యతను బలహీనపరిచేదిగా కాక కాంగ్రెస్ తనవంతు పాత్రను సరిగ్గా పోషించడానికి దోహదపడేలా ఉండాలి.

5. ''సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాసంఘటనగా మారేందుకు గాను'' కాంగ్రెస్‌కు "తన వ్యవస్థాగత నిర్మాణాన్ని, కార్యక్రమాన్ని మరింత మెరుగుపరుచుకొనేందుకు శక్తి ఉన్నది.

6. "కార్మిక - కర్షక ప్రజాసంఘాలను" యువజన సంఘాల వంటి వాటిని అభివృద్ధి చేసి కాంగ్రెస్‌కు అనుబంధించాలి.

7. కాంగ్రెస్‌ను ప్రజాతంత్రీకరించాలని (ఉదా - వర్కింగ్ కమిటీని ఎన్నుకోవడం వంటివి) డిమాండ్ చేయాలి.

8. "సంపూర్ణ స్వాతంత్ర్యము," పౌర స్వేచ్ఛ (సమ్మె హక్కుతో సహా), అణచివేత చట్టాల రద్దు, రాజకీయ ఖైదీల విడుదల, కార్మికుల హక్కుల పరిరక్షణ (ఎనిమిది గంటల పని దినంతో సహా), రైతులకు 50 శాతం కౌలు తగ్గింపు, వారి భూములను భూస్వాములు, వడ్డీ వ్యాపారులు స్వాధీనం చేసుకోకుండా రక్షణ వంటి అంశాల ప్రాతిపదికపై కాంగ్రెస్ ముందు కనీస కార్యక్రమాన్ని ఉంచడం.

9. కాంగ్రెస్‌లో "అహింస" తప్పనిసరి సూత్రమా అన్న ప్రశ్నను లేవనెత్తాలి. అయితే ఈ విషయంపై ''జాతీయ సంఘటన చీలిపోయేలా" వ్యవహరించరాదు.

10. ''కాంగ్రెస్ సోషలిస్టులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, కమ్యూనిస్టులు, వామపక్ష భావాలు కలిగిన కాంగ్రెస్‌వారు" కలిసిన వామపక్షాన్ని బలోపేతం చేయాలి. ఈ విషయంలో "కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ" ప్రధాన పాత్ర వహించాలి.

11. రానున్న ఎన్నికల్లో (1935 చట్టాన్ని అనుసరించాలి) తన అభ్యర్థులను ఎక్కువగా నిలబెట్టడానికి వామపక్షం ప్రయత్నించాలి. అదే సమయంలో "ఎన్నికలలో జాతీయ సంఘటన (ఓట్లు) చీలిపోకుండా చూడాలి."

12. స్వేచ్ఛా భారత స్వీయ రాజ్యాంగాన్ని రూపొందించే రాజ్యాంగసభ అన్న నినాదం కీలక నినాదంగా వుండాలి.

**❝ 1936 ఏప్రిల్‌లో కాంగ్రెస్ సాధారణ సమావేశాలు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన లక్నోలో జరిగినప్పుడు చెప్పుకోదగిన విధంగా వామపక్షవాదులు తమ ఉనికిని చాటిచెప్పారు. ఈ సమావేశాల్లో సోషలిజం గురించీ, "పరిమితార్థంలో స్వంత ఆస్తి రద్దు గురించి", సోవియట్ యూనియన్ ప్రాతినిధ్యం వహించే "నూతన నాగరికత" గురించి నెహ్రూ ప్రస్తావించారు. ❞**


దత్ - బ్రాడ్లీ థీసిస్‌ను భారత కమ్యూనిస్టులు వెనువెంటనే ఆమోదించారు. దాని ఫలితాన్ని కూడా అందుకోసాగారు. అప్పటికే కొమింటర్న్ ఏడవ మహాసభచే ప్రభావితమైన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ జాతీయ కార్యనిర్వాహక వర్గం 1936 జనవరిలో మీరట్‌లో సమావేశమైనపుడు, పార్టీలోకి కమ్యూనిస్టుల ప్రవేశంపై అంతకుముందు విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని నిర్ణయించింది. వాస్తవానికి 1934లో ఈ నిషేధాన్ని అమలు చేసింది. వ్యక్తిగత ప్రాతిపదికపై కమ్యూనిస్టుల ప్రవేశాన్ని అనుమతించింది. దానితో 1936 ఏప్రిల్ నుంచి కాంగ్రెస్ సోషలిస్ట పార్టీలో కమ్యూనిస్టులు చేరసాగారు. తాత్కాలికంగా కాంగ్రెస్‌లోకి ప్రవేశం కూడా సులభమైంది.

1936 ఏప్రిల్‌లో కాంగ్రెస్ సాధారణ సమావేశాలు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన లక్నోలో జరిగినప్పుడు చెప్పుకోదగిన విధంగా వామపక్షవాదులు తమ ఉనికిని చాటిచెప్పారు. ఈ సమావేశాల్లో సోషలిజం గురించీ, "పరిమితార్థంలో స్వంత ఆస్తి రద్దు గురించి", సోవియట్ యూనియన్ ప్రాతినిధ్యం వహించే "నూతన నాగరికత" గురించి నెహ్రూ ప్రస్తావించారు. కాగా ప్రజాసంఘాలను అనుబంధం చేయడం, 1935 చట్టాన్ని అనుసరించి జరిగే ఎన్నికల అనంతరం మంత్రి పదవులను తిరస్కరించడం, వర్కింగ్ కమిటీకి దామాషా పద్ధతిలో ఎన్నిక వంటి వాటితో కూడిన వామపక్ష తీర్మానాలు వీగిపోయాయి. అయితే వీటికి అనుకూలంగా వచ్చిన ఓట్లు చెప్పుకోదగిన సంఖ్యలో వున్నాయి. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చెందిన ముగ్గురు నాయకులను (జయప్రకాష్ నారాయణ్‌తో సహా) మొట్టమొదటిసారిగా నెహ్రూ వర్కింగ్ కమిటీలో చేర్చుకున్నారు. ఇదే సమయంలో ఆలిండియా కిసాన్ కాంగ్రెస్ (తరువాత సభగా మారింది). అభ్యుదయ రచయితల సంఘం లక్నో సమావేశాల్లో ఉనికిలోకి వచ్చాయి. ఈ రెండింటిలోనూ కమ్యూనిస్టులు ప్రధాన శక్తిగా వున్నారు. రైతులను, రచయితలను జాతీయోద్యమం వైపుకు ఆకర్షించి, అదే సమయంలో తమ భావజాలాన్ని వ్యాప్తి చేయగలిగారు. మితవాద జాతీయ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌తో రాజీని ఎ.ఐ.టి.యు.సి.లోని కమ్యూనిస్టులు, రాయిస్టులు సాధించగలిగారు. అయితే ముందుగా ఊహించినట్లుగా 1936 ఆగస్టులో నాగ్‌పూర్‌లో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశాలలో ఈ విలీనం చోటు చేసుకోలేదు.

ఆలిండియా కిసాన్ సభ సభ్యత్వ పెరుగుదల, సమ్మె పోరాటాల ఉధృతి వామపక్షాలకు ప్రజల్లో పలుకుబడిని విశదం చేశాయి. 1938 మేలో జరిగిన ఆలిండియా కిసాన్ సభ కమిల్లా (బెంగాల్) మహాసభ నాటికి దాని సభ్యత్వం అయిదు లక్షలకు దాటిపోయింది. 1939 ఏప్రిల్ నాటి గయ మహాసభ నాటికి 8 లక్షలకు చేరుకున్నది. 1938లోనే కిసాన్ సభ తన జెండాగా అరుణ పతాకాన్ని స్వీకరించింది. సమరశీల ట్రేడ్ యూనియన్ బలాన్ని ప్రతిబింబించే మరో అంశాన్ని కూడా చూడవచ్చు. పారిశ్రామిక వివాదాల కారణంగా నష్టపడిన పని దినాలు 1935లో 10 లక్షలకు లోపు వుంటాయి. 1936 నాటికి 24 లక్షలుగాను, 1937 నాటికి 90 లక్షలు గాను, 1938 నాటికి అంతకుమించి ఈ సంఖ్య పెరిగింది. 1937లో పదకొండు ప్రావిన్స్‌లకు గాను ఎనిమిదింటిలో కాంగ్రెస్ మంత్రివర్గాలు ప్రమాణస్వీకారం చేయడంతో కమ్యూనిస్టులపై నిషేధం అనేది అమలు జరగలేదు. కమ్యూనిస్టులు తమ పలుకుబడిని పెంచుకోవడానికి ఈ అవకాశం ఉపయోగపడింది.

**(మిగతా 33వ పేజీలో)**

# రూపాయి పతనం ఎందుకు కలవరపెడుతోంది?



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త. జెఎన్‌యులో సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్ విభాగంలో ప్రొఫెసర్

సిపి చంద్రశేఖర్

భారతదేశం యొక్క బాహ్య ఆర్థిక రంగం అంత నిమ్మళంగా లేదు. డాలర్‌తో పోలిస్తే (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేటు ప్రకారం) ఏప్రిల్ ప్రారంభంలో రూ. 76.4 నుండి జూలై ప్రారంభంలో రూ. 79.1కి పడిపోవడంతో రూపాయి వేగంగా క్షీణించే మార్గంలో ఉన్నట్లు కనిపిస్తోంది.

ఇందుకు అనేక రకాల కారణాలు ఉన్నాయి. మొట్టమొదటగా భారతదేశ ఎగుమతుల వృద్ధి మందగించడంతో పాటు దిగుమతులలో తీవ్ర పెరుగుదల ఉండడంతో ఇటీవలి నెలల్లో వాణిజ్య లోటు బాగా పెరిగింది. జూన్‌లో 38 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 63.6 బిలియన్ డాలర్ల దిగుమతులతో వాణిజ్య లోటు 25.6 బిలియన్ డాలర్లతో గరిష్ట స్థాయికి పెరిగింది. 2021 సంవత్సరంతో పోలిస్తే 2022 ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో ఎగుమతులు 22 శాతం పెరిగాయి, దిగుమతులు 47 శాతం పెరిగాయి. ఫలితంగా సంబంధిత త్రైమాసికాల్లో 2021లో వాణిజ్య లోటు 31.4 బిలియన్ డాలర్ల నుండి 2022 లో 70.3 బిలియన్ డాలర్లకు పెరిగింది.

విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు భారతీయ ఈక్విటీ మరియు రుణ మార్కెట్‌ల నుండి వైదొలగడం, విదేశీ మారకద్రవ్యం యొక్క ఈ "నష్టం" యొక్క ప్రభావాలన్నీ కలుపుకుని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ 2022 సంవత్సర మొదటి అర్ధ భాగంలో (జనవరి–జూన్) నికరంగా బయటకుపోయిన మొత్తం 29.73 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఆ ప్రవాహంలో సగం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో పోయాయి. దాదాపు ఏడాదిన్నరగా విదేశీ ఇన్వెస్టర్ల నిష్క్రమణ జరుగుతోంది. గత ఏడాది అక్టోబర్ నుండి రికార్డు స్థాయిలో 33 బిలియన్ డాలర్ల విలువ కలిగిన భారతీయ షేర్లను విదేశీ పెట్టుబడిదారులు డంప్ చేశారని గోల్డ్‌మ్యాన్ సాచ్స్‌ను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ (జూలై 5) తెలిపింది. ప్రపంచ అనిశ్చితి మరియు అమెరికా ఫెడరల్ రిజర్వ్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకుల వడ్డీ రేట్లలో గణనీయమైన పెరుగుదల కారణంగా భారతీయ మార్కెట్లలో రెండు సంవత్సరాల బూమ్‌లో వచ్చిన లాభాలను తీసుకుని విదేశీ పెట్టుబడిదారులు దేశం నుండి నిష్క్రమిస్తున్నారు.

చివరగా 2022 మార్చి ముగింపు మరియు జూన్ 24 మధ్య ఆర్‌బిఐ వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల పరిమాణం 14 బిలియన్ డాలర్లు తగ్గాయి. వాల్యుయేషన్ మార్పులు –యూరో, యెన్ వంటి హార్డ్ కరెన్సీలని డాలర్‌తో పోల్చి నందువల్లనే ఈ క్షీణతలో కొంత భాగం వచ్చింది. ఇంకా విస్తరిస్తున్న వాణిజ్య లోటు అలానే బయటకి వెళ్ళిపోతున్న పోర్ట్‌ఫోలియో మూలధనం ఈ క్షీణతకు ముఖ్యమైన కారణాలు.

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణించడం అనుకున్నంత ఇబ్బందికరం కాదని ప్రభుత్వం, ఇంకా సెంట్రల్ బ్యాంక్ అధికార ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణత అనేది దీర్ఘకాలిక పరిణామమని, రూపాయి బలహీనపడటం మాత్రమే కాదని, అన్ని కరెన్సీ ల మీద డాలర్ బలపడడం వంటి "బాహ్య" కారణాలను సూచిస్తోందని అంటున్నారు. అంతేకాకుండా ఇటీవలి తరుగుదల స్వల్పకాలిక కారణాల వల్ల జరిగిందని వాదించారు. ఉక్రెయిన్ దాడి తరువాత చమురు ధరలు పెరగడం, దిగుమతి బిల్లును పెంచడం ఇంకా ఎగుమతులపై ఆంక్షలు, ఉదాహరణకు గోధుమలు గ్లోబల్ ధరల మార్పులు ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. ఇది దేశీయంగా ధరలు పెరగడానికి, ప్రభుత్వ స్టాక్‌లు పడిపోవడానికి దారితీసింది. ఈ స్వల్పకాలిక ప్రభావాలు పోయే అవకాశాలు ఉన్నాయి. విదేశీ నిల్వలు ఇప్పటికీ సౌకర్యవంతమైన స్థాయిలో ఉన్నందున, దేశీయ కరెన్సీ విలువలో ఎటువంటి తరుగుదలను అయినా ఎదుర్కోవడానికి ఆ నిల్వలలో కొంత భాగాన్ని మోహరించడానికి పెద్దగా ఇబ్బంది లేదని సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది.

వాస్తవానికి ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఇటీవల బిజినెస్ స్టాండర్డ్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, "డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణించినప్పటికీ, వాస్తవానికి యూరో, యెన్ వంటి ఇతర హార్డ్ కరెన్సీలతో పోలిస్తే ఇది బలపడింది", జోక్యానికి బదులు జోక్యంచేసుకోకుండా ఉండటానికి ఆర్‌బిఐ మొగ్గు చూపాలి, రూపాయి క్రమంగా క్షీణించడానికి అనుమతించాలి" అన్నారు. వడ్డీ రేట్ల పెంపు భయంతో విదేశీ పెట్టుబడిదారులు నిష్క్రమించడంతో రూపాయి విలువ క్షీణించిన 2013 నాటి పరిస్థితితో ఈనాటి పరిస్థితిని పోల్చి చూస్తే, ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉందని, "ఆర్థిక రంగంలో మరింత విశ్వసనీయత" ఉందన్నారు. ఊహించిన 3శాతం కరెంట్ ఖాతా లోటు పెరుగుదల ఈ సంవత్సరం "ఒక్కసారి మాత్రమే" జరిగేవి కావచ్చు అన్నారు. అదనంగా " 600 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు" 2013లో లేవు, ఇదే ప్రస్తుత విశ్వాసానికి కారణమనే సెంటిమెంట్‌ను ఆయన ప్రతిధ్వనించారు.

### బొగ్గు సంక్షోభం

అయితే అలాంటి విశ్వాసం మంచిది కాదు. మొట్టమొదటగా అధిక దిగుమతి బిల్లుకు కారణం కేవలం అధిక చమురు ధరలు కాదు, బంగారం మొదలుకుని బొగ్గు వరకు వివిధ వస్తువుల దిగుమతులు పెరగడం వల్ల కూడా ఈ విధంగా జరిగింది. బొగ్గు దిగుమతులు అనివార్యమని నిరూపించబడ్డాయి, ఎందుకంటే థర్మల్ పవర్ ప్లాంట్‌లలో నిల్వలు కనిష్ట స్థాయిలను తాకాయి, విద్యుత్

అంతరాయం గురించి పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. అధిక ధరలు ఉన్నప్పటికీ బొగ్గు దిగుమతుల కోసం ఎక్కువ ఒత్తిడి ఉన్నప్పుడు, ప్రభుత్వం దీనిని స్వల్పకాలిక సమస్య అంటున్నది. అది అకాల వర్షాల వల్ల మైనింగ్, రవాణాల పై కలిగిన ప్రభావమే అని పేర్కొం ది. కానీ బొగ్గు సంక్షోభానికి కారణం బొగ్గు ఉత్పత్తిలో ప్రభుత్వరంగ పాత్రను నిరోధించడమే కాకుండా ప్రైవేట్ రంగాన్ని తీసుకురావటం లక్ష్యంగా పెట్టుకున్న విధానాల వైఫల్యం ఇప్పుడు అగుపడుతోంది. ప్రభుత్వరంగ వృద్ధిని అరికట్టా లనే లక్ష్యం నెరవేరినప్పటికీ, ప్రైవేట్‌రంగంతో ఆ లోటును పూడ్చడంలో ప్రభుత్వం విఫలమైంది. దీని ఫలితం దిగుమతి చేసుకున్న బొగ్గుపై భారత విద్యుత్ రంగం ఆధారపడటం పెరిగింది. నిజానికి బొగ్గు ధరలు అధికంగా ఉన్నప్పటికీ దిగుమతి చేసుకున్న బొగ్గునే ఉపయోగించాలని ప్రభుత్వం అన్ని విద్యుత్ ప్లాంట్లను ఒత్తిడి చేస్తోంది. ఈ విధమైన కారణాల వల్ల మధ్యంతరానికి ఖరీదైన, పెద్ద దిగుమతులు అవసరం అవటంతో దిగుమతుల బిల్లు, వాణిజ్య లోటు ఎక్కువగా అయి రూపాయిపై ఒత్తిడి పెరుగుతుంది.

కానీ మరింత సవాలుగా మారిన విషయమే మిటంటే మూలధన ప్రవాహాలు పూర్తిగా తగ్గిపోయి వాణిజ్య రంగం నుండి వచ్చే ఒత్తిళ్ళు తీవ్రతరం అవటం. ఇటీవలి సంవత్సరాలలో భారతదేశంలోకి వచ్చిన నికర మూలధన ప్రవాహాలు కరెంట్ ఖాతాలోని ఆర్థిక లోటు కు సరిపోయే దానికంటే ఎక్కువగా ఉన్నాయి. చాలా సంవత్సరాలగా ఉన్న "మిగులు" దేశంలోని విదేశీ నిల్వల పెరుగుదలను ఒక సౌకర్యవంతమైన స్థాయిలో ఉంచటానికి దోహదపడింది. కానీ ఈ నిల్వలు విదేశీ మారక భారాలతో నిర్మించబడినవని, ఈ రకమైన ప్రవాహాలు అతి తక్కువ కాలంలో నిష్క్రమించే అవకాశం ఉన్నవని సూచిస్తున్నాయి. ఆ అదనపు ప్రవాహాలకు ప్రధాన కారణం అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థలో చౌక ద్రవ్యలభ్యత యొక్క భారీ పెరుగుదల. ఇది ప్రపంచ ఆర్థిక సంక్షోభం, ఆ తర్వాత ఏర్పడిన మహా మాంద్యంల కారణంగా అభివృద్ధి చెందిన దేశాల కేంద్ర బ్యాంకులు అవలంబించిన ఈజీ మనీ విధా నాలు వల్ల సంభవించింది.

చౌక రుణంతో ప్రపంచ ఆర్థిక ఊహలకు బలం చేకూరుస్తున్న ఈ "సాంప్రదాయేతర ద్రవ్య విధానాలు" విస్మరించబడాలని ఇటీవలి

> **❝ ఇటీవలి సంవత్సరాలలోని రూపాయి మూడు సందర్భాలలో తీవ్రంగా క్షీణించింది: ఆగస్ట్ 2019, మార్చి 2020, మే-జూన్ 2022 లలో. ఈ మూడు సందర్భాల్లో మూలధనం యొక్క ప్రవాహమే తరుగుదలకి సాధారణ మరియు ముఖ్యమైన ప్రేరణ. ❞**



సంవత్సరాలలో స్పష్టమవుతోంది. అవి ఉన్నప్పుడు మూలధన ప్రవాహాలు వెనక్కి వెళ్ళటం కూడా సంభవించవచ్చు. అప్పుడు ఆ విధానాల ద్వారా వచ్చిన మూలధన ప్రవాహాలతో నిర్మించబడిన భారతదేశ నిల్వలు కుంచించుకుపోవడం ప్రారంభమవుతుంది. అది రూపాయిపై ఒత్తిడిని చూపిస్తుంది.

ఇటీవలి సంవత్సరాలలోని రూపాయి మూడు సందర్భాలలో తీవ్రంగా క్షీణించింది: ఆగస్ట్ 2019, మార్చి 2020, మే-జూన్ 2022 లలో. ఈ మూడు సందర్భాల్లో మూలధనం యొక్క ప్రవాహమే తరుగుదలకి సాధారణ మరియు ముఖ్యమైన ప్రేరణ. అదృష్టవశాత్తూ భారతదేశానికి కోవిడ్-19 మహమ్మారి ప్రారంభమైన వెంటనే, ప్రపంచ అనిశ్చితి కారణంగా ఏర్పడిన మూలధనం యొక్క నికర నిష్క్రమణ తారుమారు అయింది, ఎందుకంటే కోవిడ్ -19 ప్రేరిత మాంద్యం తీవ్రతరం అవుతుందనే భయంతో సెంట్రల్ బ్యాంక్‌లు తమ చౌక ద్రవ్య విధానాల నుండి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయి. కానీ ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలలో ద్రవ్యోల్బణం-ఇది తాత్కాలికమైనదనే అంచనాలు తప్పుని నిరూపించింది, ఇంకా ఉక్రెయిన్ దండయాత్ర దీనిని తీవ్రతరం చేసింది-పాలసీ తిరోగమనాకి దోహదం చేస్తోంది: వడ్డీ రేట్లు పెంచబడుతున్నాయి, ద్రవ్యలభ్యతను పెంచటానికి బాండ్ల కొనుగోలు నిలిపి వేయబడింది. ఇంతకుముందు ఉదహరించిన గణాంకాలు సూచించిన విధంగా భారతదేశా నికి మూలధన ప్రవాహంపై తక్షణ ప్రభావమే ఉంది.


పోర్ట్‌ఫోలియో మూలధనం యొక్క ఈ ప్రవాహం రూపాయి బలానికి సంబంధించిన రెండు సూచనలు చేస్తోంది. మొదటిది, దీర్ఘకాలిక వాణిజ్యం మరియు కరెంట్ ఖాతా లోటువల్ల తగ్గిన రూపాయి విలువ పై ఒత్తిడిని తగ్గించి, దేశీయ మార్కెట్‌లోకి అదనపు డాలర్ల ప్రవాహాన్ని తగ్గించింది. రెండవది, ఇది సెంట్రల్ బ్యాంక్ యొక్క విదేశీ మారక నిల్వల స్థాయిని తగ్గిస్తుంది, ఇంకా రూపాయిని దృఢం చేయడానికి డాలర్లను అమ్మడం ద్వారా మార్కెట్‌లో జోక్యం చేసుకోటాన్ని అడ్డుకుంటుంది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ఆర్‌బీఐ మార్కెట్‌లో జోక్యం చేసుకోవటానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదనిపిస్తోంది. నిజానికి మూలధనం ప్రవాహాలున్నప్పటికీ, సెంట్రల్ బ్యాంక్‌తో ఉన్న విదేశీ రిజర్వ్ ఆస్తులు 2019 చివరి నుండి చాలా నెలల్లో పడిపోయే బదులు పెరిగాయి. మార్చి 2022లో మాత్రమే ఆర్‌బిఐ డాలర్‌ల "నికర అమ్మకందారు"గా ఉంది. ఆర్‌బీఐ ఇలా ఉండటానికి కారణం రిజర్వ్‌లలో పతనం రూపాయి యొక్క రక్షణను కొనసాగించలేమనే సంకేతాన్ని పంపుతుందనే భయం కావచ్చు. ఈ పతనాన్ని వేగవంతం చేస్తూ రూపాయి పతనం పై స్పెక్యులేటర్‌లు పందాలు వేయటాన్ని ప్రోత్సహిస్తున్నాయి

ఈ కోణంలో చూస్తే డాలర్‌తో రూపాయిని పోల్చితే రూపాయి ఇటీవల కాలంలో వేగంగా క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. తరుగుదల యొక్క కారకాలు అన్నీ స్వల్పకాలికమైనవి కావు. వాణిజ్య లోటు కొంత కాలం పాటు ఎక్కువగానే ఉండే ప్రమాదం ఉంది. మరియు లోటులు పెరిగినప్పుడు కూడా రూపాయికి ఆసరాగా నిలిచిన మూలధనం యొక్క అదనపు ప్రవాహం అంతా ఎండిపోయింది. ఈ పరిస్థితులలో కరెన్సీ క్షీణతను వేగవంతం చేసే చర్యలను ఆశ్రయించే స్పెక్యులేటర్ల దృష్టిని ఆకర్షిస్తూ తరుగుదల కొనసాగవచ్చు. ఈసారి కథ వేరేగా ఉండొచ్చు.

**(అనువాదం- కె.పుష్పవల్లి)**

# విజ్ఞానంపై దాడి అజ్ఞాన ప్రచారం

బి.వి.రాఘవులు



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

*(గత నెల తరువాయి)*

**అజ్ఞానమే విజ్ఞాన శాస్త్రంగా**

విజ్ఞానమంతా మన శాస్త్రాల్లోనే, ప్రత్యేకించి వేదాల్లోనే ఉందని ఆరెస్సెస్ విశ్వసిస్తుంది. ముస్లింల, ఇంకా ఇతర విదేశీయుల దండయాత్రలకు ముందరి ప్రాచీన భారతదేశంలోనే అన్ని శాస్త్ర పరిశోధనలకు మూలాలు ఉన్నాయి. అసలు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అంతటిని సృష్టించింది హిందువులు, హిందూయిజమే. ప్రాచీన భారతదేశపు ఔన్నత్యం పట్ల వారి విపరీతమైన నమ్మకం వారిని ఎక్కడి దాకా తీసుకువెళుతుందంటే, ఇప్పుడు మనముందున్న శాస్త్ర విజ్ఞానం అంతా ప్రాచీన భారతదేశంలోని రుషులకు ఆనాడే తెలుసునని, మనం ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలన్నీ ఇతర అన్ని నాగరికతలన్నింటికన్నా ముందుగానే మన ప్రాచీనులు ఉపయోగించారని చెబుతారు. ప్రాచీన రుషులకు దివ్య దృష్టి, దివ్య జ్ఞానం ఉండేవని వారు నమ్ముతారు. 'సమాధానాలన్నీ మనకు అప్పుడే తెలుసు' అని నిరంతరం డబ్బా కొట్టుకోవడం, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని వినియోగించుకొని హిందూ ఆధిక్యతను ఉద్ఘాటించడానికే.

హిందూ నాగరికత ఆధిపత్యాన్ని నిరూపించే ఆరాటంలో వారు పురాణాలకు, శాస్త్ర విజ్ఞానానికి మధ్య ఉన్న తేడాను తుడిచివేశారు. గతంలోని శాస్త్ర పురోగతిని కల్పితాలతోను, మూఢాచారాలతోను కలగలిపారు. ఆ తర్వాత ప్రాచీన పౌరాణిక కల్పితాలను, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని తప్పుడు పద్ధతిలో సమానం చేశారు. మానవ వనరుల శాఖా మంత్రి డా. సత్యపాల్ సింగ్ డార్విన్ సిద్ధాంతం తప్పు అని చెప్పాడు. దాన్ని ఆరెస్సెస్ సిద్ధాంతవేత్త రాం మాధవ్ సమర్థించాడు. అంతేకాదు, విమానాన్ని మొదట కనిపెట్టింది రైట్ సోదరులు కాదు, శంకర్ బాపూజీ తర్పద్ అనే భారతీయుడు అని కూడ చెప్పాడు. కౌరవులు టెస్ట్ ట్యూబ్ పరిజ్ఞానంతో పుట్టారని, కర్ణుడు కుంతి చెవి నుండి పుట్టాడని, భారతంలో వర్ణించిన ఆయుధాలన్నీ అణుపరిజ్ఞానంతో రూపొందించబడినవని, ఇనుప యుగంలోనే భారతదేశంలో స్టెమ్‌సెల్ పరిశోధన జరిగిందని చెప్పాడు.

ప్లాస్టిక్ సర్జరీ, క్లోనింగ్, టెస్ట్‌ట్యూబ్ బేబీలు–లాంటి ఆధునిక వైద్య పద్ధతులన్నీ ప్రాచీన భారత దేశంలోనే ఉన్నాయని, ఇప్పటి ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ పరిజ్ఞానం పురాతన కాలంలోనే ఉండేదనటానికి వినాయకునికి ఏనుగు తల అతికించడం నిదర్శనమని, మహాభారతంలో కుంతి గర్భం దాల్చడం టెస్ట్ ట్యూబ్ పరిజ్ఞానానికి నిదర్శనమని ప్రధానమంత్రి మోడీయే 2014లో బొంబాయిలో చెప్పాడు. రెండు నిముషాల పాటు శంఖాన్ని వూదితే ఆ శబ్దం అనేక మానవ రుగ్మతలను నయం చేస్తుందని 2015లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఒక వక్త చెప్పాడు. మరొక వక్త "శివుడు ప్రపంచంలోనే అతి గొప్ప పర్యావరణవాది" అని, నేటి అత్యాధునిక గాలిలో ఎగిరే యంత్రాలన్నీ వేదకాలంలోనే ఉండేవని చెప్పాడు. అయస్కాంత క్షేత్ర పరిజ్ఞానం న్యూటన్ కన్నా 1500 సంవత్సరాల ముందే మన శాస్త్రాల్లో ఉందని, ఆర్యభట్ట సమీకరణ ఒకటి చాంద్రాయణం కోసం వినియోగించబడిందని చెప్పాడు. ఆ సైన్స్ కాంగ్రెస్ ఇలా జరిగింది కాబట్టే 2009 కెమిస్ట్రీ నోబెల్ బహుమతి గ్రహీత వి. రామకృష్ణన్ ఆ సభను ఒక సర్కస్‌గా అభివర్ణించాడు, తాను మరెప్పుడూ అలాంటి సభలకు హాజరు కాబబోనని చెప్పి వెళ్ళాడు.

సంతానాభివృద్ధి గురించిన ఆరెస్సెస్ జాత్యహంకార విశ్వాసాలను గర్భ శాస్త్ర / గృహ శంకర 'సైన్సు'గా ప్రచారం చేస్తున్నారు. తల్లి గర్భిణిగా ఉన్నపుడు మత గ్రంథపఠనాలను, భక్తి గీతాలను విన్నప్పుడు, మాంసాహారం ముట్టనప్పుడు తెల్లటి రంగుతో, తెలివైన పిల్లలు పుడతారని వీరు చెబుతారు.

ప్రధాని నరేంద్ర మోడి, ఆయన ప్రియ గురువులు రాందేవ్ బాబా, రవి శంకర్‌లు యోగాను ప్రాచీన భారతదేశం అందించిన అతి పెద్ద వరంగా ప్రచారం చేస్తారు. యోగా ద్వారా మానవజాతి రుగ్మతలు తొలగిపోతాయని, పర్యావరణ మార్పు ప్రతికూలతలను తగ్గిస్తుందని చెప్పుకుంటారు. కాని యోగాతో సమానంగా, లేదా అంతకంటె మిన్నగా ప్రయోజనాలను చేకూర్చే నడక, సైక్లింగ్, పరుగు, బరువులు ఎత్తడం లాంటి ఇతర శారీరక వ్యాయామాల వంటిదే యోగా కూడ అనే విషయాన్ని వారు గుర్తించకపోవడం అహేతుకతకు తారాస్థాయి.

మతం అనేది సైన్సు కన్నా అధికమైనదని ఆరెస్సెస్ ప్రకటిస్తుంది. 2017 ఫిబ్రవరిలో ఏర్పాటయిన జాతీయ గో కమిషన్ (రాష్ట్రీయ కామధేను ఆయోగ్) ఛైర్మన్ సైన్సును, ఆధ్యాత్మికతను కలగలిపితే, "సామాజిక పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు" గోవు ఒక అవసరమైన సాధనమవుతుంది అని చెప్పడం వెనక అదే భావన ఉంది. 1966లో గోల్వాల్కర్ ఇలా చెప్పాడు,"నేటి యుగం సైన్సు యుగం అని జనం పదే పదే చెబుతుంటారు. అందుచేత ఈ సైన్సు యుగానికి అనుగుణంగా మతంలో మార్పులు చేయాలని వారు తరచు వాదిస్తుంటారు. కాని నేను కచ్చితంగా దానికి విరుద్ధమైన విషయాన్ని చెబుతాను... సైన్సులో వచ్చే ప్రతి పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్చుకుంటూ పోతే, మతమనేది మిగలదు... అప్పుడు మానవజాతి అంతా నిస్పృహకు గురవుతుంది. అందుచేత ప్రతి సైన్సు పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్పు చేసుకుంటూ పోవడం సరైందని కాదని నా అభిప్రాయం." ఆధునికతను ఇస్లామీకరణ

చేయాలని ఇస్లామిస్టులు చెప్పిన మాదిరిగా గోల్వాల్కర్ అభిప్రాయం ఉంటుంది. ఆధునికతను కాషాయీకరణ చేయాలని ఆరెస్సెస్ చెబుతుంది.

సైన్సు హేతువుకు వాహకంగా పనిచేస్తుంది, వివేకాన్ని వ్యక్తీకరిస్తుంది. అలాంటి సైన్సును హిందూత్వ బలంగా వ్యతిరేకిస్తుంది. ఒకవైపున తన పురాణాలకు చట్టబద్ధతకోసం సైన్సును ఆశ్రయిస్తూనే ఇలా చేస్తుంది. నేడు మన దేశాన్ని పాలిస్తున్న హిందూ జాతీయ వాదులు శాస్త్ర పద్ధతులను నిరంతరం అణచివేస్తూనే, సాంకేతిక పరిజ్ఞానాన్ని కీర్తించడాన్ని పై ధోరణి వివరిస్తుంది. ఆధునిక ప్రపంచ దృక్పథంలో కీలకాంశాలు, హేతుబద్ధత, విమర్శనాదృష్టి. ఈ రెండింటినీ హిందూత్వ విస్మరిస్తుంది, తిరస్కరిస్తుంది. సనాతన ధర్మం పట్ల గుడ్డి విశ్వాసాన్ని నెలకొల్పడానికి, వైదిక గతాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తుంది. శాస్త్ర వికాస ఫలితాలైన సాంకేతిక ఉత్పత్తులను సముపార్జించుకునేందుకు ఆరాటపడుతుంది, అదే సమయంలో ప్రతి భావనను, ప్రతి విశ్వాసాన్ని విమర్శనా యుతంగా ప్రశ్నించే అవకాశాన్ని పూర్తిగా మూసివేస్తుంది.

వైదిక ప్రపంచ దృక్పథానికి, ఆధునిక సైన్సుకు మధ్య సజీవ ఐక్యత ఉంది అని చెప్పడం మొదటి నుండీ హిందూ జాతీయ వాదుల ఎజెండాగా ఉంది. సైన్సును వెనక్కి తీసుకెళ్లి వేదాలలో ఇమిడ్చే వ్యూహం వేదాలకు సైన్సు చాయను సమకూర్చుతుంది. అయినప్పటికీ 'వేదాలు సైన్సుకు మాతృకలు' అనేది చివరికి, మూతబడిన దారివద్దకు చేరుస్తుంది. ఎందువల్లనంటే నూతన ప్రశ్నలు అడగటానికి కాని, రుషులు కాని వారు తమకు అందుబాటులో ఉన్న పద్ధతులతో ప్రశ్నలు వేసినపుడు వాటికి సమాధానాలు చూపకలిగిన శక్తి కాని దానికి ఉండదు.

క్వాంటం ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, జెనెటిక్స్, న్యూరో సైన్స్ మొదలైన ఆధునిక సైన్స్‌లోని విభాగాలన్నీ ప్రాచీన కాలంలో మన రుషులు, తత్వవేత్తలు ఏనాడో వూహించారని చెబుతారు. వక్రీకరణల ఆధారంగా 'వేదిక్ సైన్స్' అనే దాన్ని నిర్మించారు. పాశ్చాత్య ఆధునిక మేథమేటిక్స్ కన్నా మెరుగైనది అంటూ పాఠశాల స్థాయిలో 'వేదిక్ మేథమేటిక్స్' ను సృష్టించడానికి కసరత్తు చేశారు. విదేశీ సైన్సును, టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నామన్న విషయాన్ని కప్పిపుచ్చి, మన విజయాల

"వైదిక ప్రపంచ దృక్పథానికి, ఆధునిక సైన్సుకు మధ్య సజీవ ఐక్యత ఉంది అని చెప్పడం మొదటి నుండీ హిందూ జాతీయ వాదుల ఎజెండాగా ఉంది. సైన్సును వెనక్కి తీసుకెళ్లి వేదాలలో ఇమిడ్చే వ్యూహం వేదాలకు సైన్సు చాయను సమకూర్చుతుంది. అయినప్పటికీ 'వేదాలు సైన్సుకు మాతృకలు' అనేది చివరికి, మూత బడిన దారివద్దకు చేరుస్తుంది."

పట్ల ఒక తప్పుడు గర్వాన్ని సృష్టించడం వేదిక్ సైన్స్‌ను ముందుకు తీసుకు రావడానికి కారణం.

హేతుబద్ధత పైన, శాస్త్ర జిజ్ఞాస పైన సంఘ పరివార్ చేస్తున్న దాడిని బిజెపి ప్రభుత్వం వ్యవస్థీకృతం చేస్తున్నది. ఎప్పుడైతే శాస్త్ర విజ్ఞానాభివృద్ధి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉంటుందో ఎలాంటి బెరుకు లేకుండా ఆ పరిశోధనను అది అణచివేస్తుంది. హేతుబద్ధులైన శాస్త్రవేత్తలను పాశ్చాత్య దేశాల ఏజంట్లని, ప్రాచీన భారత మహోన్నతమైన గతాన్ని కించపరిచే వారని ముద్రవేసే వాతావరణం పరిశోధనా సంస్థల్లో నెలకొంటున్నది.

నూతన తరాల పిల్లల మనస్సుల్లో అశాస్త్రీయమైన, అహేతుకమైన, చారిత్రకంగా తప్పుడు విజ్ఞానాన్ని నింపేందుకు పాఠ్య పుస్తకాలను తిరగరాయడం, శాస్త్ర విజ్ఞానసంస్థలు, విద్యాసంస్థల్లో కీలక స్థానాలలో కాషాయీకరణ చెందిన వ్యక్తులను నియమించడం చేస్తున్నారు. విశ్వ విద్యాలయాలలో జ్యోతిష్యం, పౌరోహిత్యం లాంటి కోర్సులను ప్రవేశపెట్టడం గతంలో మనం సాధించిన ప్రతిభను, సమీప భవిష్యత్తులో ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న మన ఆకాంక్షను ధ్వంసం చేస్తుంది.

బిజెపి ప్రభుత్వ హయాంలో శాస్త్ర పరిశోధన, అభివృద్ధి తిరోగామి దిశలోకి మళ్ళాయి. పూర్తిగా హిందూత్వ వూహలపై ఆధారపడిన అంశాలపై పరిశోధనను అది ప్రోత్సహిస్తున్నది, అలాంటి వాటికే నిధులు అందజేస్తున్నది. పాంచజన్య, రామసేతు, రామాయణ, మహాభారతాల చారిత్రకత లాంటి అంశాలపై పరిశోధనకు భారీగా నిధులు సమకూర్చబడినాయి.

ప్రాచీన భారతదేశంలో శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే సంప్రదాయం ఉంది. క్రీస్తు పూర్వం 2500 సంవత్సరాలనాడే విలసిల్లిన సింధులోయ నాగరికతలో తూనికలు, కొలతల వ్యవస్థ ఉండేది. క్షేత్ర గణిత పరిజ్ఞానం లేకుండా ఆనాటి నగరాలు నిర్మించబడి ఉండేవి కావు. ఆ తర్వాత వైద్యరంగంలోను, ఖగోళ రంగంలోను, గణిత రంగంలోను ఎన్నో విజయాలు సాధించబడినాయి.

కాని ప్రాచీన భారతదేశంలో సాధించబడిన ఈ తొలి విజయాలు పటిష్టపరచబడలేదు. మత ఛాందసుల నుండి ఎదురైన వ్యతిరేకతే దానికి కారణం. హేతుబద్ధతపైన, సైన్స్ పైన విశ్వాసమున్న తత్వవేత్తలకు ఆనాటి ఆధిపత్య మతాధిపతుల నుండి వ్యతిరేకత ఎదురైంది. విడ్డూరమేమంటే అద్వైత వాదులైన తత్వవేత్తలు ప్రాచీన భారతదేశంలో సాధించిన సైన్స్ విజయాలు తమవే అన్నట్లు నేడు చెప్పుకుంటున్నారు. కాని ఆ విజయాలను, శాస్త్ర జిజ్ఞాసను ఆనాడు తీవ్రంగా వ్యతిరేకించిన వారిలోనే వీరి మూలం ఉంది. మనదేశం గతంలో సాధించిన నిజమైన విజయాల పట్ల శాస్త్రవేత్తలు అవగాహనను మెరుగుపరుచుకొని, వాటిని ముందుకు తీసుకొని వెళ్లాలి. తన మతతత్వ రాజకీయ పథకం కోసం వాటిని సంఘపరివార్ దుర్వినియోగం చేయడాన్ని ఎదుర్కొనాలి.

మానవ జాతి చరిత్ర మొత్తంలోను మత ఛాందసాన్ని, సిద్ధాంతాలను ప్రశ్నించడం ద్వారానే సైన్స్ అభివృద్ధి చెందింది. ఐరోపాలో చర్చి అధికారులతో తీవ్రమైన, కొన్ని సందర్భాలలో హింసాత్మకమైన సంఘర్షణల మూలంగానే ఆధునిక సైన్స్ స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకుంది. పునర్వికాస దశలో జరిగిన ఈ పోరాట విప్లవాత్మక పర్యవసానమే సైన్స్‌ను మతం నుండి విడగొట్టడం. ఆధునిక అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షిస్తున్న ఏ సమాజానికైనా సైన్స్ మత శక్తుల పట్టులోకి పోవటం ఆత్మహత్యా సదృశమే అవుతుంది.

అన్ని రకాల మతతత్వ శక్తులు సైన్స్ మూల సూత్రాలకు వ్యతిరేకులే. హేతుబద్ధతను, శాస్త్ర స్ఫూర్తిని అవి హీనంగా చూస్తాయి. శాస్త్ర

> **"రామజన్మభూమి, ఆవు లాంటి మత చిహ్నాలను మతపరమైన సమీకరణ కోసం సంఘపరివార్ వినియో గించుకుంటున్నది. ప్రజలను, ప్రత్యేకించి సమాజంలోని పేద ప్రజానీకాన్ని మతతత్వపూరితం చేయడానికి మత ఘర్షణలను ప్రధాన సాధనంగా వినియోగించు కుంటున్నది."**

పురోగతికి ఛాందసవాదం సహజంగానే శత్రువు. సైన్స్, చాందసవాదం సహజీవనం చేయలేవు. శాస్త్ర అభివృద్ధికి లౌకికతత్వం పట్ల నిబద్ధత అవసరం. భారతదేశంలో మతతత్వ చీడను తొలగించడానికి సైన్స్ అభివృద్ధి, స్వేచ్ఛగా, విమర్శనాయుతంగా పరిశోధించే స్ఫూర్తి ఎంతగానో దోహదపడతాయి.

**VI**

రామజన్మభూమి, ఆవు లాంటి మత చిహ్నాలను మతపరమైన సమీకరణ కోసం సంఘపరివార్ వినియోగించుకుంటున్నది. ప్రజలను, ప్రత్యేకించి సమాజంలోని పేద ప్రజానీకాన్ని మతతత్వపూరితం చేయడానికి మత ఘర్షణలను ప్రధాన సాధనంగా వినియోగించుకుంటున్నది. రాజ్యాంగంలోని 370 అధికరణం, ఉమ్మడి పౌరస్మృతి, హిందువులు, ముస్లిములకు మధ్య జనాభా పెరుగుదల రేటులో తేడాలు, విదేశీయుల అక్రమ వలసలు మొదలైన వాటిని మత భావాలను రెచ్చగొట్టడానికి వినియోగించు కుంటున్నది.

**ఆవు పవిత్రత పేరుతో ఆహారంపై ఆంక్షలు, దాడులు**

ప్రజలను మతాలవారీగా విభజించడానికి, పశుమాంసాన్ని తినే ముస్లిము, క్రైస్తవ మైనారిటీ మతాలవారిని, దళితులను లక్ష్యంగా చేసుకోవడానికి గోవధ అంశం సంఘపరివార్‌కు ఒక ముఖ్యమైన సాధనంగా పనిచేస్తున్నది. మెజారిటి ప్రజలు అంగీకరించని ఆహార నిబంధనలను దేశంపై రుద్దటానికి ప్రచారం చేస్తున్నది. అదే సమయంలో సాపేక్షంగా చౌకగా లభించే ప్రొటీన్ పోషకాలను పేదలకు దూరం చేస్తున్నది. అనవసరమైన ఆర్థిక భారాన్ని రైతులపై మోపుతున్నది.

ఆరెస్సెస్ దేశీయ గోవులకు పవిత్రతను, అద్భుత శక్తులను ఆపాదిస్తున్నది. ఈ జంతువును ప్రతి ఒక్కరు గౌరవించాలని డిమాండు చేస్తున్నది. "ఈ విశ్వానికి మాతృక గోవు... అది భూమిని సారవంతం చేస్తుంది. జంతువులను, పక్షులను పోషిస్తుంది, మానవులను కూడ పోషిస్తుంది, రోగాల నుండి రక్షిస్తుంది. మానవ హృదయాన్ని పువ్వులాగా సుకుమారంగా చేస్తుంది" అని చెబుతుంది.

వేదాలు పశుమాంస భక్షణను నిషేధించాయని, అలా తిన్న వారికి మరణశిక్షను నిర్దేశించాయని ఆరెస్సెస్ చెబుతుంది. భారతదేశంలోకి ముస్లిములు ప్రవేశించేంతవరకు ఇక్కడ పశుమాంస భక్షణ లేదని ఉద్ఘాటిస్తున్నది. కాని ఇది పూర్తిగా తప్పు. యజ్ఞాలలో గోవులను వధించడం గురించి, ప్రాచీన భారతంలో పశుమాంస భక్షణ గురించి వేదాల్లో కావలసినంత సమాచారం ఉంది. గోవులతో సహా కొన్ని జంతువుల మాంసం దేవతలకు ప్రీతిపాత్రమైనదని వేదాలు చెబుతాయి. గోఘ్న అని చెప్పబడే విశిష్ట అతిథులకు పశుమాంసాన్ని ప్రత్యేకంగా వండి వడ్డించేవారు. వేదకాలంలో గోవులను బలి ఇవ్వడం, గో మాంసాన్ని భక్షించడం ఉండేదని పురాతత్వ పరిశోధనలు కూడ ధృవీకరిస్తున్నాయి. వేదకాలం నుండి గోవులు పూజింపబడుతూ ఉన్నాయన్న ఆరెస్సెస్ మాటల్లోని బూటకత్వాన్ని ఈ వాస్తవాలు వెల్లడిస్తున్నాయి.

ప్రాచీన భారతంలో పశువులను, ఎద్దులను దేవతలకు బలిఇచ్చి, వాటి మాంసం తినేవారు. స్థిరనివాసాలు విస్తరించి వ్యవసాయం అభివృద్ధి చెందటం, అహింసా సిద్ధాంతం కలిగిన బౌద్ధం, జైనం ఆవిర్భవించడంతో బ్రాహ్మణవాదాన్ని అనుసరించేవారు సైతం పశుమాంస భక్షణను బలవంతంగా మానుకోవలసి వచ్చింది. బౌద్ధం, జైనం క్షీణించి, కుల వ్యవస్థ ఘనీభవించిన దశలో హిందూయిజంలో అత్యున్నత కులమైన బ్రాహ్మణులతో ఆవులు ముడివేయబడినాయి. గోవును చంపడం బ్రాహ్మణుని చంపడంతో సమానం అని బ్రాహ్మణ ధర్మ శాస్త్రాలు చెప్పసాగాయి. అయితే ఈ దశలో సైతం సమాజంలోని వివిధ సెక్షన్లలో పశుమాంస భక్షణ కొనసాగుతూనే ఉంది.

ఆనాటి పునరుద్ధరణవాద ఉద్యమాల నేపథ్యంలో 1800ల చివరిలో గోరక్షణ ఆందోళన మొదలయింది. 19వ శతాబ్దంలో హిందూ సంస్కరణవాద ఉద్యమాలు హిందువులను ఏకం చేసే చిహ్నంగా గోవు పవిత్రతను వినియోగించుకున్నాయి. ఆర్యసమాజ స్థాపకుడు దయానంద సరస్వతి ఆవులను రక్షించటానికి గోరక్షిణి సభ అనే సొసైటీని కూడ ఏర్పాటు చేశాడు. మత ప్రాతిపదికన హిందువులను ఏకం చేయడానికి అది ఉద్దేశించబడింది. ముస్లిములతో పదే పదే ఉద్రిక్తతలు పెరగటానికి ఇది దారితీసింది.

మహాత్మా గాంధీ కూడ గోరక్షణను సమర్థించాడు. ఆనాడు కాంగ్రెస్ పార్టీలో గణనీయమైన భాగం ఈ నినాదానికి మద్దతు ఇచ్చారు. స్వాతంత్ర్యం లభించిన వెంటనే పలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు గోవధను నిషేధిస్తూ చట్టాలు చేశాయి. అయితే ఆయా రాష్ట్రాల చట్టాలలో వ్యత్యాసాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలు గోవధపైన, గోమాంస భక్షణ పైన పూర్తి నిషేధం విధించాయి. కొన్ని రాష్ట్రాలు ప్రభుత్వ అనుమతితో గోవులను వధించాలని చెప్పాయి, మరి కొన్ని రాష్ట్రాలు 'వధించతగినవి' అని సర్టిఫికేట్ ఇవ్వబడిన వాటిని మాత్రమే వధించాలని చెప్పాయి. ఈ చట్టాల ఉల్లంఘనలకు జుల్మానాలు కూడ వేరువేరుగా ఉన్నాయి. అనేక ఇతర రాష్ట్రాలు గోవధను కాని, గోమాంస భక్షణను కాని నిషేధించలేదు.

స్వాతంత్ర్యానంతర తొలి దశాబ్దాలలో ఆరెస్సెస్ గోరక్షణ అంశాన్ని మతపరమైన భావాలను రేపడానికి ప్రధాన రాజకీయ సాధనంగా వినియోగించుకున్నది. 1960లలో గోల్వాల్కర్ నాయకత్వాన ఆరెస్సెస్ గోరక్షణ ఉద్యమాన్ని నిర్వహించింది. 1966 నవంబరు 7న 1,25,000 మంది పార్లమెంటు ముట్టడికి ప్రయత్నించారు. నేటి బిజెపి అవతారమైన జనసంఘ్ మద్దతుతో నాగసాధువుల గ్రూపు ఒకటి ఈ ప్రదర్శనను నిర్వహించింది. బల్లేలు, త్రిశూలాలు చేతపట్టుకొని, దేశవ్యాపితంగా గోవధను నిషేధించాలన్న ఏకైక డిమాండుతో ఈ ముట్టడి జరిగింది.

ఆ తర్వాత కాలంలో మతమార్పిడులు, రామజన్మభూమి సమస్యలు ముందు కొచ్చినప్పటికీ గోరక్షణ అంశం మాత్రం ప్రధాన ప్రచార ఎజెండాగా కొనసాగుతూనే ఉంది. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో బిజెపి ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీ గోవు పవిత్రత అంశాన్ని ముందుకు తీసుకొచ్చాడు. బిజెపి అధికారంలోకి వచ్చిన కొన్ని మాసాల్లోనే దేశంలో గోరక్షణ పేరుతో కొట్టిచంపిన ఘటనలు అత్యధిక సంఖ్యలో నమోదయినాయి. దాడులకు గురైనవారు అత్యధికులు ముస్లిములే. బిజెపి తన అధికారాన్ని దేశవ్యాపితంగా విస్తరించుకుంటున్న కొద్దీ కొట్టిచంపే ఘటనలు కూడ పెరుగుతూ వచ్చాయి.

గోవధకు వ్యతిరేకంగా జాతీయ చట్టాన్ని తీసుకురావాలన్న తన ఆందోళనను ఆరెస్సెస్ తీవ్రతరం చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం, తర్వాత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయాల తర్వాత పలు రాష్ట్రాలు ఈ అంశంపై తమ చట్టాలను కఠినతరం చేశాయి. ఉదాహరణకు బిజెపి పాలిత గుజరాత్ రాష్ట్రం 2017 మార్చిలో గోవధకు పాల్పడిన వారికి విధించే గరిష్ట జైలు శిక్షను ఏడేళ్ళ నుండి జీవిత ఖైదుకు పెంచుతూ చట్టసవరణ చేసింది. కేంద్ర ప్రభుత్వం 2017 మేలో దేశ వ్యాపిత గోవధ నిషేధాన్ని ప్రకటించింది.

ఇదే సమయంలో బిజెపి, సంఘపరివార్ ప్రోత్సాహంతో బరితెగించిన నిఘామూకలు గో రక్షకులమంటూ అనేక రాష్ట్రాలలో హింసాకాండకు పాల్పడ్డారు. 2014 నుండి దేశవ్యాపితంగా గోవులకు సంబంధించి కనీసం 130 దాడులు జరిగాయి. వీటిలో 50 మంది చనిపోయారు. ఈ హింసాకాండ బాధితులలో అత్యధికులు ముస్లిములే ఉన్నారు.

గోవధను పూర్తిగా నిషేధించడం రైతులపై ఆర్థిక భారాన్ని పెంచింది. వట్టిపోయినవి లేదా వ్యవసాయానికి పనికిరావని వదిలిపెట్టిన పశువులు పంటలకు పెద్ద ప్రమాదంగా తయారయ్యాయి. రైతుల కంటిమీద కునుకు లేకుండా చేశాయి. సంఘ్ ఈ పరిస్థితిని తట్టుకోలేకపోయింది. దాని ఆధ్యాత్మిక వాదనలు తీవ్రమైన విమర్శల నెదుర్కొన్నాయి. దీనితో సంఘ్ తనను తాను సమర్థించుకోవడానికి మరొక రకమైన ప్రచారాన్ని మొదలు పెట్టింది. ఆవు పేడ, ఆవు మూత్రం తులసి చెట్టు మాదిరిగానే ఔషధ లక్షణాలు కలిగి ఉంటుంది, ఆవు మూత్రం అనేక జబ్బులను నయం చేస్తుంది, దేశీయ ఆవులకు సూర్య కిరణాలను బంగారంగా మార్చే శక్తి ఉంటుంది, ఆవు పాలలో అది పసుపు వచ్చ పొరలాగా ఉంటుంది – ఇలా సాగుతుంది ఆ ప్రచారం. గోవధ నిషేధాన్ని సమర్థించుకోవడానికి సంఘ్ పరివార్ చేపట్టిన ఈ కుహనా సైన్సు పడికట్టు పదాల ప్రచారం దాని మతతత్వ రాజకీయాల కుటిల పథకాలను కప్పిపుచ్చలేకపోయింది.

> “ ప్రార్థనాస్థలాల విధ్వంసం ముస్లిం రాజులకే పరిమితం కాలేదు. బౌద్ధుల నిర్మాణాలను హిందువులు ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. హిందూ రాజులు హిందువుల, జైనుల ప్రార్థనా స్థలాల్ని ధ్వంసం చేశారు. ఇతర దేశాలలో కూడా ప్రార్థనాస్థలాల విధ్వంసాలు జరిగాయి. ”

**అన్యమత పూజా ప్రదేశాల ధ్వంసం**

అయోధ్య, కాశీ, మధుర ఆలయాల పునరుద్ధరణ: విదేశీ ఇస్లామిక్ దురాక్రమణ దారుల చేతుల్లో హిందూ సమాజం బలయిపోయిందని, చరిత్రలో ఆనాడు జరిగిన తప్పులను సరిచేయాలని, హిందువుల ఔన్నత్యాన్ని తిరిగి నిలబెట్టాలని హిందూత్వ శక్తులు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల్లో సామూహిక ఉన్మాదాన్ని రెచ్చగొట్టి, మతపరమైన విభజన పెంచటం కోసం దేవాలయాల ధ్వంసం, వాటి శిధిలాలపై మసీదుల నిర్మాణం అంటూ ప్రచారం చేస్తున్నారు. రామజన్మభూమి– బాబ్రీ మసీదు అంశాన్ని మనం చూశాం. పరాకాష్టగా 1991లో వివాదాస్పద కట్టడం నేలమట్టం చేయబడింది. ఆ తర్వాత ఓటర్లలో మతవిభజన తేవడం కోసం రామాలయ నిర్మాణం అంశాన్ని ప్రతి ఎన్నికల్లోనూ వినియోగించుకున్నారు. ఇప్పుడు రెండవ దఫా అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం వివాదాస్పద భూమిపై హిందూ కక్షిదారుకే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేలా చేయకలిగింది. క్రైస్తవులకు రోమ్ లాగా, ముస్లింలకు మక్కాలాగా రాబోయే రోజుల్లో ప్రపంచ హిందూకేంద్రంగా అయోధ్యలో రామాలయాన్ని నిర్మాణం చేయాలంటూ హిందూత్వ శక్తులు మతతత్వ మంటలను ఎగదోస్తున్నాయి.

గత రాజకీయాలు గతానికి సంబంధిం చినవి, వాటిని ఇప్పుడు తిరగదోడటం నిష్ఫలమైన, ప్రమాదకరమైన చర్య. అది నేటి సమస్యలనేమీ పరిష్కరించజాలదు. మత ఘర్షణలను మాత్రమే పెంచుతుంది.

గతంలో ఆలయాలను నిర్మించడం, ధ్వంసం చేయడం అనేవి అధికారాన్ని ఉద్ఘాటించుకునే రాజకీయ పోరాటంలో భాగం. మతాలతో నిమిత్తం లేకుండా రాజులు దేవాలయాలను లూటీ చేశారు.

ప్రార్థనాస్థలాల విధ్వంసం ముస్లిం రాజులకే పరిమితం కాలేదు. బౌద్ధుల నిర్మాణాలను హిందువులు ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. హిందూ రాజులు హిందువుల, జైనుల ప్రార్థనా స్థలాల్ని ధ్వంసం చేశారు. ఇతర దేశాలలో కూడా ప్రార్థనాస్థలాల విధ్వంసాలు జరిగాయి. దండయాత్రలు జరిపిన సందర్భాలలో తమ రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి విజేతలు ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేసేవారు. గతించిన చరిత్రను మార్చటం అసంభవం. గతాన్ని గతించిన అంశంగానే పరిగణించాలి.

మతపరమైన, శాఖాపరమైన ఘర్షణలు గతంలో జరిగాయి. బౌద్ధులకు, శైవులకు మధ్య, శైవులకు, జైనులకు మధ్య, సన్యాసులకు, బైరాగులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలకు మతపరమైన అంశాలే పూర్తి కారణాలు కాదు. రాజుల ప్రాపకం సంపాదించుకోవడానికి, వాణిజ్య హక్కుల కోసం, యాత్రా స్థలాలపై అదుపు కోసం వారి మధ్య తరచు పోటీ ఉండేది.

(తరువాతి భాగం సెప్టెంబరు సంచికలో)

# బూర్జువా పార్టీలు: సరళీకృత ఆర్థిక విధానాలు



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్. వీరయ్య**

**ప్రభుత్వ విధానాలకు బూర్జువా, భూస్వామ్య ప్రత్యామ్నాయం ఉంటుందా?**

**బూర్జువా ప్రత్యామ్నాయం సాధ్యపడుతుందా?**

**వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం ఎట్లా సాధ్యపడుతుంది?**

ఉదారవాద ఆర్థిక విధానాల దుష్ఫలితాలు స్పష్టంగా చూస్తున్నాం. మోడీ ప్రభుత్వం అత్యంత దుందుడుకుగా ఈ విధానాలు అమలుచేస్తున్నది. ఈ విధానాలు ప్రారంభించిన దగ్గర నుంచీ ఇప్పటివరకూ బడాపెట్టుబడిదారులు బలిసిపోవడానికీ, విదేశీ బహుళజాతి సంస్థల దోపిడీ పెరుగుదలకే ఉపయోగపడ్డాయి. కార్మికుల శ్రమదోపిడీ అనేక రెట్లు పెరిగింది. కార్మిక చట్టాల రద్దుతో ఇప్పుడు స్వేచ్ఛగా దోపిడీ చేసే అవకాశం ఏర్పడింది. కేంద్రం రైతు వ్యవస్థనే నిర్మూలించి, వ్యవసాయ రంగాన్ని బడాబాబులకు అప్పగించేందుకు బరితెగించి ప్రయత్నించింది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ పేరుతో అమలుజరుపుతున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం, జీవితంలో అభద్రతా భావం పెరిగింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయినా ఈ విధానాలు విదేశీ బహుళజాతి సంస్థలతో పాటు, దేశంలో బడాపెట్టుబడిదారులకు, సాధారణ పెట్టుబడిదారీ వర్గం మొత్తానికీ, లాభదాయకంగానే ఉన్నది. అందుకే జాతీయ, ప్రాంతీయ పార్టీలన్న తేడాల్లేకుండా బూర్జువా, భూస్వామ్య పార్టీలన్నీ, తాము ఎక్కడ అధికారంలో ఉన్నా ఈ విధానాలే అమలు చేస్తున్నాయి. ఫలితంగా దేశంలో బడాబాబులు బలిసిపోవటంతో పాటు, వివిధ ప్రాంతాల్లో కొందరు ప్రాంతీయ పెట్టుబడిదారులు కూడా బలపడ్డారు. మరోవైపు ఆర్థిక అసమానతలు పెరిగాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. పెద్దఎత్తున పరిశ్రమలు మూత పడుతున్నాయి. 2021 నాటికి 6 సంవత్సరాలలో 5లక్షల పరిశ్రమలు మూతపడ్డాయని కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి పార్లమెంటులోనే ప్రకటించారు. రైతు వ్యవస్థమీద దాడితో బడా బూర్జువా వర్గానికీ, ధనిక రైతులతో సహా, మొత్తం రైతాంగానికీ మధ్య వైరుధ్యం ముదురుతున్నది. ఫామ్‌హౌజ్‌ల పేరుతో ఫ్యూడల్ భూస్వాములను పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చే ప్రయత్నాలు పెరిగాయి.

భూస్వామ్య విధానాన్ని రద్దు చేయకుండానే, భూసంస్కరణలు అమలు చేయకుండానే, రకరకాల వత్తిడులతో భూస్వామ్య సంబంధాల ఆటంకాలను అధిగమించేందుకు పెట్టుబడిదారీ వర్గం ప్రయత్నిస్తున్నది. ప్రారంభంలో భూసంస్కరణల పేరుతో వత్తిడి, హరిత విప్లవం పేరుతో ప్రోత్సాహకాలతో ప్రయత్నించింది. ఇప్పుడు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించాయి. ఆర్థిక అసమానతలు పెరుగుదల, పరిశ్రమల మూత, ప్రజల కొనుగోలు శక్తి పడిపోవటం ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కూరుకుపోతున్నది. 2019 నవంబర్ నాటికే ఆర్థిక వ్యవస్థ ఐసీయూలో ఉన్నదని అరవింద సుబ్రహ్మణ్యం (మోడీ ప్రభుత్వానికి ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేసిన ఆర్థికవేత్త) అన్నారు. ఈ స్థితిలో దోపిడీ తీవ్రతరం చేసేందుకు బడా పెట్టుబడిదారులు ప్రయత్నాలు పెంచారు. దేశంలో మార్కెట్ మొత్తం మీద తమ పట్టు మరింత బిగించే ప్రయత్నాలు తీవ్రతరం చేసారు. 'ఒకే దేశం-ఒకే ప్రజ' నినాదం సారాంశం ఇదే. నిజానికి ఇది 'ఒకే దేశం-ఒకే మార్కెట్' కోసం చేస్తున్న ప్రయత్నం. కేంద్రం చేతిలో వనరుల కేంద్రీకరణ, రాష్ట్రాల హక్కులు హరించటం ఇందులో భాగమే ! 'ఒకే దేశం-ఒకే పార్టీ' దిశలో అడుగులు వేస్తున్నది ఇందుకోసమే! విభేదించే ప్రాంతీయ పార్టీల నేతల బ్లాక్‌మెయిలింగ్ కూడా ఇందుకే! కేంద్రం నియంతృత్వం బలపడుతున్నది. బలపడుతున్న ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గం ప్రయోజనాలకు ఇవన్నీ హానికరం. ఈ నేపథ్యంలోనే అనేక ప్రాంతీయ పార్టీలు కేంద్రంతో ఘర్షణకు సిద్ధపడుతున్నాయి. ఏడేండ్లపాటు మోడీ ప్రభుత్వంతో లాలూచీ కుస్తీ నడిపిన టీఆర్ఎస్ నాయకత్వం, ఉన్నట్టుండి కేంద్రంమీద పోరాటానికి సై అంటున్నది. కేంద్రంలో బీజేపీ దుష్పరిపాలనను ఎదుర్కోడానికి ఇది ఎంత ఉపయోగపడినా ఆమేరకు మంచిదే. అదే సమయంలో పరిమితులు కూడా గమనంలో ఉండాలి.

ఈ దేశంలో ప్రైవేటీకరణ విధానాలు ప్రారంభించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ విధానాల అమలు కోసం కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీలలో ఎవరున్నా.... పరస్పరం సహకరించుకుంటున్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం అత్యంత దుందుడుకుగా అమలు చేస్తున్నది. కార్మిక చట్టాలు రద్దు చేసినా, పార్లమెంటులో కాంగ్రెస్ వ్యతిరేకించలేదు. కీలక ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, పెద్ద నోట్ల రద్దుతో సహా ప్రజా వ్యతిరేక చర్యలను కాంగ్రెస్ ప్రతిఘటించలేదు. ఈరెండు పార్టీలూ టాటా, బిర్లా, అంబానీ, అదానీ లాంటి బడాబాబుల కనుసన్నల్లోనే నడుచుకుంటున్నాయి. అందుకే ఈ రెండు పార్టీలూ దేశంలో ప్రజలకు శత్రువులు. ఏమాత్రం ప్రజాస్వామ్య స్వభావం లేని పార్టీలు. దేశంలో బూర్జువా వర్గం భూస్వామ్య విధానం రద్దుకు సిద్ధంగా లేదు కదా ! స్నేహపూర్వక వత్తిడినే ఎత్తుగడగా అమలుచేస్తున్నది. అందువల్ల భూస్వామ్య

భావజాలాన్ని కూడా వ్యతిరేకించడానికి సిద్ధంగా లేదు. దాని ఫలితంగానే మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న బీజేపీకి బడా పెట్టుబడిదారీ వర్గం పూర్తి అండగా ఉన్నది. కాంగ్రెస్ జాతీయస్థాయిలో ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ లౌకిక విలువల కోసం నికరంగా నిలబడలేకపోవడానికి కారణం కూడా ఇదే. తాను లౌకిక పార్టీగా చెప్పుకున్నప్పటికీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలబడితే హిందువుల ఓట్లు పడవేమోనని, అవకాశవాదం ప్రదర్శిస్తున్నది.

> **“ తెలంగాణలో టీఆర్ఎస్‌గానీ, ఏపీలో వైసీపీగానీ తమ అధికారం నిలబెట్టుకోవటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తాయి. కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించుకుని ఈ రాష్ట్రాలలో కూడా అధికారంలోకి రావాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డు తున్నది. తెలంగాణలో కాంగ్రెస్‌గానీ, ఏపీలో టీడీపీగానీ రానున్న ఎన్నికలలో తామే అధికారంలోకి రావాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ”**

టీఆర్ఎస్‌తో సహా ప్రాంతీయ పార్టీలన్నీ కూడా లౌకిక విలువల విషయంలో అవకాశవాదం ప్రదర్శిస్తున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించ నిరాకరిస్తున్నది. రికార్డులలో నుంచి 'కాస్తు' కాలమ్ తొలగించి, దశాబ్దాలుగా భూమిని సాగుచేసుకుంటున్న పేదరైతులను బయటకు నెడుతున్నది. అసైన్డ్ భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నది. 'రైతుబంధు' నిధుల్లో కూడా గణనీయమైన భాగం భూస్వాములకూ, ధనిక రైతులకే అందుతున్నది. హరితహారం పేరుతో పోడురైతుల మీద దాడులు చేస్తున్నది. ఏ ఒక్క రంగంలో కనీస వేతనాలు సవరించలేదు. కార్మిక చట్టాల రద్దును సమర్థించింది. కార్మిక సంఘాల పట్ల అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నది. ప్రజా ఉద్యమాల పట్ల నియంతృత్వ ధోరణులు ప్రదర్శిస్తున్నది. సరళీకృత ఆర్థిక విధానాలను పూర్తిగా సమర్థిస్తున్నది. ఇలాంటి పరిస్థితులలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు చూపగల స్థితిలో టీఆర్ఎస్ లేదు. దేశంలో ఇప్పుడున్న ఏ ఒక్క ప్రాంతీయ పార్టీ కూడా ఇందుకు సిద్ధంగా లేదు. పైగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా, ఈ ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు అవసరం. భూసంస్కరణలు, ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధి, కార్మికులు, రైతులు, కూలీల హక్కులు, పని హక్కు, కులవివక్ష వ్యతిరేకత, మహిళల హక్కుల వంటివి ప్రాతిపదికగా ప్రత్యామ్నాయ విధానాలు ఉంటాయి. అందువల్ల ఇప్పుడు దేశంలో అమలు జరుగుతున్న ఆర్థిక విధానాలకు మరో బూర్జువా, భూస్వామ్య ప్రత్యామ్నాయం ఉండదు. భూసంస్కరణలు అమలు చేయడానికి గానీ, ఫ్యూడల్ భావజాలం మీద రాజీలేని పోరాటం చేయడానికి గానీ బూర్జువా వర్గం సిద్ధంగా లేదు. అందుకే బూర్జువా ప్రత్యామ్నాయం కూడా సాధ్యం కాదు. ఇందుకు అవకాశాలు లేవు. ఫ్యూడల్ సంబంధాల మీద, భావజాలం మీద కూడా పోరాడే బాధ్యత కార్మికవర్గం మీదనే ఉన్నది. శ్రామికులంతా సమైక్యంగా పోరాడవల్సిన కర్తవ్యం ఇది. రాజకీయంగా వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన మాత్రమే ఈ బాధ్యత నెరవేర్చగలదు. అనుక్షణం ఈ సంఘటన నిర్మాణం కోసమే కృషి చేయాలి.

ఎల్‌డీఎఫ్ (లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్) నిర్మాణం బాధ్యతను పక్కనబెట్టి నిరంతరం ఎన్నికల ఎత్తుగడల గురించి చర్చించటం పార్లమెంటరీతత్వమే కాదు... సంస్కరణవాదం కూడా. ఎన్నికలు వచ్చినపుడు బీజేపీని ఓడించేందుకు తోడ్పడే ఎత్తుగడలు నిర్ణయించవచ్చు.

తెలంగాణలో టీఆర్ఎస్‌గానీ, ఏపీలో వైసీపీగానీ తమ అధికారం నిలబెట్టుకోవటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తాయి. కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించుకుని ఈ రాష్ట్రాలలో కూడా అధికారంలోకి రావాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతున్నది. తెలంగాణలో కాంగ్రెస్‌గానీ, ఏపీలో టీడీపీగానీ రానున్న ఎన్నికలలో తామే అధికారంలోకి రావాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది సహజం. వారు అధికారం కోసం ఆరాటపడుతున్నారు... పోటీ పడుతున్నారు... అందుకే రోజూ ఎన్నికల గురించే మాట్లాడతారు. వామపక్షాలకు రోజూ ఎన్నికల గురించి మాట్లాడవల్సిన అవసరం ఏమున్నది? వామపక్షాల పరిస్థితి పూర్తి భిన్నం. ఎన్నికల ఫలితాలకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలలోకి పోవాలి. ప్రజలు కదిలితే పోరాటం చేయాలి. సరళీకృత ఆర్థిక విధానాల మీద రాజీలేని పోరాటం చేయాలి. మతోన్మాదం మీద సామాజిక, సాంస్కృతిక, భావజాల రంగాలలో నిరంతరం పోరాడాలి. ప్రజలతో నిత్య సంబంధాలు పెంచుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డి కృషి చేయాలి. స్వతంత్ర కార్యాచరణతో పాటు వామపక్షాలు ఐక్యంగా ప్రజలను సమీకరించే ప్రయత్నం చేయాలి. ఇదొక నిరంతర ప్రక్రియ. ఈ క్రమంలోనే వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘటన నిర్మాణానికి అవకాశాలు మెరుగుపడతాయి.

❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

చరిత్ర

# అశోకుడి శాసనాలూ దక్షిణాది ప్రాంతం

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

చరిత్రలో దక్షిణాది ప్రాంతానికి సంబంధించి నమోదైన సమాచారం మనకు క్రీ.పూ 4వ శతాబ్దం నాటిది. గ్రీకు పర్యాటకుడు మెగస్తనీస్ తన ఇండికా అనే గ్రంథం ఎనిమిదో భాగంలో దక్షిణాది ప్రాంతానికి సంబంధించిన ప్రస్తావన చేశాడు. గ్రీకు పురాణ పురుషుడైన హెర్క్యులస్ కుమార్తె పాండయా రాణిగా ఉన్న ప్రాంతం దక్షిణ భారత ఉపఖండంలో ఉన్నదని, అక్కడ ముత్యపు సంపద అమితంగా ఉన్నదని, ఆ ముత్యాల విలువ చెల్లించాలంటే వాటి బరువుకు మూడు రెట్లు బంగారాన్ని ఇచ్చుకోవాలని అతగాడు ఆ గ్రంథంలో పేర్కొన్నాడు. దక్షిన భారతదేశంలోని పాండ్య రాజ్యానికి సంబంధించిన తొలి ప్రస్తావన ఇది. పాండ్య రాజ్యానికి మదురై రాజధానిగా ఉండేది. ఆ రాజ్యంలోని ట్యుటికోరిన్ రేవు ముత్యాల సాగుకు కేంద్రంగా ఉండేది.

ఆ తర్వాత దక్షిణ భారతానికి సంబంధించిన ప్రస్తావనలు మనకు అశోకుడి శిలాశాసనాలలో లభిస్తున్నాయి. చోళులకు, పాండ్యులకు, సాత్యపుత్రులకు, కేరళపుత్రులకు, తామ్రపర్ణికి తన ప్రభుత్వం అందించిన వైద్య సహాయం గురించి క్రీ.పూ. 258 నాటి శిలా శాసనంలో పేర్కొన్నాడు. అదే కాలానికి చెందిన మరొక శిలా శాసనంలో చోళులకు, పాండ్యులకు, తామ్రపర్ణి వరకు విస్తరించిన ప్రాంతానికి ధర్మ ప్రచారం నిమిత్తం ప్రతినిధులను పంపిన ప్రస్తావన ఉంది. కావేరి డెల్టా ప్రాంతం చోళుల రాజ్యంగా ఉండేది. తంజావూరు కేంద్రంగా అది నడిచింది. దానికి ఉత్తరంగా ఉన్న ప్రాంతంలో సాత్యపుత్ర రాజ్యం ఉండేది. ఆరికమేడు (నేటి పాండిచేరి) దాని రాజధాని. కేరళపుత్రులు అన్న ప్రస్తావన చేర రాజ్యానికి సంబంధించినది. ఐతే ఇది మొదట్లో కేరళలో గాకుండా తమిళనాడులోని కోయంబత్తూరు ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ఉండేది.

అశోకుని కాలం నాటి రాతి స్థంభంలో ఒక భాగం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో ఉన్న అమరావతి వద్ద లభించింది. దానితోబాటు అశోకుడి కాలం నాటి బ్రాహ్మీ లిపిని వాడి ప్రాకృత భాషలో రాసిన శిలాశాసనాలు అమరావతి ప్రాంతంలో లభించాయి. ఇవన్నీ క్రీ.పూ. రెండవ శతాబ్దపు తొలి సంవత్సరాలనాటివి. దీనికి సమీపంలోని భట్టిప్రోలు దగ్గరకూడా ఇదే విధమైన రాతలు ఉన్న నిక్షేపాలు లభించాయి. ఐతే ఈ శిలానిక్షేపాలమీద ఉన్న రాతలలో ఉపయోగించిన లిపి అశోకునికాలపు బ్రాహ్మీలిపి అయినప్పటికీ, అందులో తమిళ లేదా ద్రవిడ భాషల ప్రభావం ఉన్నట్టు నిపుణులు నిర్ధారించారు. అశోకుడికాలంలో బ్రాహ్మీ లిపిని ఉపయోగించి రూపొందించిన శిలా శాసనాలలో ప్రాకృత భాషతో బాటు అప్పటి తమిళభాష కూడా ప్రతిబింబించింది. ప్రాకృతం తోబాటు అశోకుడి శాసనాలలో మనకు కనిపించిన రెండవ ప్రాచీన భారతీయ భాష తమిళం.

(ఫిగర్ 2.1, బ్రాహ్మీ లిపిలోని అశోకుడి శిలా శాసనం

మొదటి లైను: దేవానాపియెన పియదాసినా లాజినా విసతివాసాభిసితెన

రెండో లైను: అతన అగచ మహియితె హిదా బుధె జాతె శాక్యముని తి

మూడో లైను: సిల విగడభిచా కలపిత శిలాతాబె చా ఉసాపాపితె


నాలుగో లైను: హిదా భగవమ్ జాతె తి లుమ్మిని గామె ఉబాలికె కాతె

ఐదో లైను: అతా భాగియె చా)

మౌర్య సామ్రాజ్యపు చివరి దశలో లేదా ఆ సామ్రాజ్యం పతనం అయిన తర్వాత తొలి దశలో రూపొందిన శిలా శాసనాలు మదురై ప్రాంతంలో, తిరునల్వేలి సమీపంలోని తాంబపర్ణి నదీ తీరంలో లభించాయి. ఐతే మట్టి కుండలమీద రాయబడిన తమిళ బ్రాహ్మీ లిపిలోని రాతలు అటు ఆరికమేడు నుండి ఇటు రామేశ్వరం వరకు వివిధ ప్రాంతాల్లో లభించాయి. ఇవి క్రీ.పూ.రెండవ శతాబ్దానికి చెందినవి. వీటిలో ఎక్కువ భాగం జైన ఆరామాలకు ఇచ్చిన విరాళాలకు సంబంధించినవి. దీనిని బట్టి పాండ్య రాజులు జైన మతాన్ని ఎక్కువగా ఆదరించారని నిర్ధారణ అవుతున్నది. ఇదే కాలంలో తామ్రపర్ణిలో (నేటి శ్రీలంక) బౌద్ధ మతానికి అదే విధమైన ఆదరణ ఉండేది.

మదురై ప్రాంతంలో లభించిన ఆధారాలను బట్టి ఆ ప్రాంతంలో ముత్యాల సేకరణ, వ్యాపారం ఎక్కువగా సాగేదని, వరి పంట ప్రధానంగా సాగు చేసేవారని నిర్ధారించగలిగారు. అప్పటికి ఆ పాండ్య రాజ్యంలో కుల వ్యవస్థ ఏర్పడిందని చెప్పడానికి స్పష్టమైన దాఖలాలు ఏవీ లభించలేదు.

(మ్యాప్ 2.5: క్రీ.పూ.300 –100 మధ్య




కాలం నాటి దక్షిణ భారత ఉపఖండం, శ్రీలంక ప్రాంతం)

శ్రీలంక చరిత్రకు సంబంధించి రెండు ప్రాచీన ఆధారాలు ఉన్నాయి. దీప వంశ, మహా వంశ అని వాటి పేర్లు. వాటిని బట్టి క్రీ.పూ. మూడవ శతాబ్దంలో అశోకుడి సహాయంతో బౌద్ధం శ్రీలంకలో ప్రవేశించింది. ఐతే శ్రీలంక సాంప్రదాయ చరిత్రలో ఒక గాథ ఉంది. ఇది కల్పితం అయివుండవచ్చు. దాని ప్రకారం ఉత్తర భారతదేశంలోని సింహపుర అనే ప్రాంతం నుండి (ఇదెక్కడుందో ఇంతవరకూ తేలలేదు) విజయుడు అనేవాడు తన అనుచరులతో శ్రీలంక వచ్చి ఇక్కడ రాజ్యం స్థాపించాడని, అందుకే దీనికి సింహళ దేశం అన్న పేరు వచ్చిందని అంటారు. గౌతమబుద్ధుడు నిర్యాణం చెందిన తొలి కాలంలో (క్రీ.పూ. 5వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో) ఈ రాజ్య స్థాపన జరిగిందని అంటారు. ఈ గాధను బట్టి సింహళ భాషను ఇండో–ఆర్యన్ భాషగా పరిగణించాలన్న వాదన ఉంది. ఐతే, ఈ విజయుడు వచ్చినప్పుడు తన అనుచరులతోబాటు పాండ్య దేశం నుండి ఎక్కువ సంఖ్యలో స్త్రీలను వెంటబెట్టుకు వచ్చాడని కూడా మహా వంశలో పేర్కొన్నారు. ఇటీవల అనూరాధపుర ప్రాంతంలో బైటపడిన త్రవ్వకాలలో ఇండో–ఆర్యన్లు శ్రీలంకలో క్రీ.పూ 450 నాటినుండీ ఉన్నట్టు ఆధారాలు లభించాయి. ఆ కాలానికి చెందిన మట్టికుండలపై ఉన్న బ్రాహ్మీ లిపిలోని రాతలు చిత్రాలు ఈ విషయానికి ఆధారాలుగా ఉన్నాయి. ఆఫ్ఘనిస్తాన్ , బెలూచిస్తాన్ ప్రాంతంలో దొరికే ఇంద్రనీలమణి రాళ్ళు, గుజరాత్ ప్రాంతంలో లభించే కెంపులు ఇక్కడ దొరికాయి. దానిని బట్టి ఈ ప్రాంతం సంపద్వంతంగా ఉండేదని నిర్ధారించవచ్చు. అక్కడ దొరికిన ఆధారాలమీద రాతలలో ప్రాకృత భాష వాడారు. ఆ ప్రాకృత భాషను పరిశీలిస్తే మగధ ప్రాంతపు భాష ప్రభావం కన్నా వాయువ్య ప్రాంతపు ప్రాకృతభాష ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నది. చరిత్రకారులకు ఇదొక చర్చనీయాంశంగా ఉంది.

అశోకుడు క్రీ.పూ. 258లో తయ ధర్మాన్ని ప్రచారం చేయడానికి ఒక బృందాన్ని పంపాడు. ఆ బృందం వెంట వైద్య సహాయం అందించే వారిని కూడా పంపాడు. అప్పటి శ్రీలంక పాలకుడు ముతశివ. అతని వారసుడు గా దేవానాంప్రియ తిస్స అనే రాజు క్రీ.పూ. 253లో అధికారం చేపట్టాడు. ఈ దేవానాంప్రియ అనే బిరుదును వాడడం మౌర్య రాజుల

❝ శ్రీలంక చరిత్రకు సంబంధించి రెండు ప్రాచీన ఆధారాలు ఉన్నాయి. దీప వంశ, మహా వంశ అని వాటి పేర్లు. వాటిని బట్టి క్రీపూ. మూడవ శతాబ్దంలో అశోకుడి సహాయంతో బౌద్ధం శ్రీలంకలో ప్రవేశించింది. ❞

సాంప్రదాయం. దానిని బట్టి ఈ తిస్స అనే రాజు మీద మౌర్య సామ్రాజ్య ప్రభావం బలంగా ఉండిందని భావించవచ్చు. తిస్స తన రాయబారిని అశోకుడివద్దకు పంపిన అనంతరం దానికి ప్రతిస్పందనగా అశోకుడి కుమారుడు, ఉన్నతస్థాయిలో ఉన్న బౌద్ధసన్యాసి అయిన మహింద శ్రీలంకకు ప్రచారం నిమిత్తం వెళ్ళాడు. ఆతర్వాత బోధివృక్షం నుండి ఒక కొమ్మను తీసుకుని అశోకుడి కుమార్తె సంఘమిత్ర కూడా శ్రీలంక వెళ్ళింది. తిస్స 40 సంవత్సరాలపాటు పాలించాక అతని సోదరుడు ఉత్తియ క్రీ.పూ. 213 నుండి 203 వరకూ పాలించాడు. ఆ కాలం నాటికి బౌద్ధం శ్రీలంకలో బలంగా వ్యాపించి స్థిరపడింది. అప్పటినుంచీ పాలకుల ఆదరణ కొనసాగింది. వలసపాలన కాలం వరకూ అదే విధమైన ఆదరణ కొనసాగింది.






(టేబుల్ 2.3 : అశోకుడి కాలంలో శాసనాలమీద ఉపయోగించిన బ్రాహ్మీ లిపిని నేటి దేవనాగరి లిపితోను, నాటి రోమన్ లిపి తోను పోల్చుతూ రూపొందించిన పట్టిక. దేవనాగరి లిపిని సంస్కృత భాషలోను, నేటి హిందీ భాషలోను వాడతారు. ఇది ఆధునికమైన లిపి. దానితో పోల్చితే అశోకుడి కాలంనాడు ఉపయోగించిన ప్రాకృత భాష, బ్రాహ్మీ లిపి చాలా ప్రాచీనమైనవి. భాష, లిపి నిరంతరం పరిణామం చెందుతూవుంటాయి. ఆ మార్పు ఎంత ఎక్కువ మోతాదులో జరిగిందో ఈ పట్టిక చూస్తే కొంత బోధపడుతుంది. అనాదికాలం నుండీ భారత ఉపఖండంలో ప్రజలు అందరూ ఒకే భాష !ఉపయోగించారని, సంస్కృతమే అత్యంత ప్రాచీన భాష అని చేసే ప్రచారం ఎంత నిరాధారమైనదో అశోకుడి శాసనాలు స్పష్టంగా తెలియజేస్తాయి.)

❋

విశ్లేషణ

# పార్లమెంటరీ విధానంపై బిజెపి దాడి

ఎ.కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**75వ** స్వాతంత్ర్యోత్సవాలను "ఆజాదీ కా అమృత్‌మహోత్సవ్" అంటూ ఊదరగొడుతున్న బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న వేళ పార్లమెంటు సభ్యుల హక్కులను హరించటానికి, పార్లమెంటరీ సాంప్రదాయాలను ఉల్లంఘించటానికి పూనుకున్నది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించటానికి సభ్యులకున్న హక్కులను కాలరాస్తున్నది. లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించటానికి వీలులేదన్న చందంగా అధికారపక్ష వ్యవహార సరళి ఉన్నది. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న సమయంలో ధరల తగ్గింపుకు చర్యలు తీసుకోవటానికి మారుగా అనేక నిత్యావసర సరుకులపై జిఎస్‌టి విధించటాన్ని, పెంచటాన్ని ప్రశ్నిస్తూ, ఉభయసభలలో ప్రతిపక్ష సభ్యులు చర్చకోసం పట్టుపట్టారు. చర్చకు అంగీకరించని ప్రభుత్వం వరుసగా ఉభయసభలను వాయిదా వేసుకుంటూ వచ్చింది. ప్రతిపక్ష సభ్యులు తమపట్టు వీడకపోవటంతో చర్చకు అంగీకరించటానికి మారుగా ప్రభుత్వం ఆందోళన చేస్తున్న సభ్యులను సభ నుండి సస్పెండ్ చేయటానికి పూనుకున్నది. కోట్లాదిమంది ప్రజలపై మోయలేని భారాలను మోపుతున్న నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఇంధన ధరల పెరుగుదల, జిఎస్‌టి పెంపుదలపై చర్చించాలని ఉభయ సభల వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి ప్రతిపక్ష పార్టీల ఎంపిలు డిమాండ్ చేస్తున్నారు. కోవిడ్ సమయంలో అనాలోచితంగా విధించిన లాక్‌డౌన్, శత కోటీశ్వరుల సంపదలను మరింతగా పెంచటం కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన కోట్లాది మంది ఉపాధి కోల్పోయారు. పనులు చేస్తున్న శ్రామికులకు కూడా అంతకు ముందుకన్నా వేతనాలు తగ్గాయి. నిరుద్యోగుల సంఖ్య గతంలో ఏనాటి కన్నా ఎక్కువగా పెరిగింది. మరోవైపు ప్రభుత్వం వంటగ్యాస్ ధరను విపరీతంగా పెంచుతున్నది. 2014లో మోడి అధికారంలోకి వచ్చేనాటికి 410 రూపాయలున్న గ్యాస్ సిలిండర్ ధర ఈ సంవత్సరం జనవరిలో 952 రూపాయలుండగా, జులైలో 1105 రూపాయలకు పెరిగింది. ఒకవైపున ఈ విధంగా వంట గ్యాస్ ధరలను పెంచుతున్న మోడి ప్రభుత్వం మరోవైపున గ్యాస్ సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీని పూర్తిగా రద్దుచేసింది. దీనితో సామాన్యులకు వంటగ్యాస్ మోయలేని భారంగా మారింది. మోడి అధికారంలోకి వచ్చిన తర్వాతన పెట్రోలు, డీజిల్‌పై కొండలా పెంచిన సర్‌ఛార్జిలలో కొద్దిభాగం తగ్గించి అదేగొప్ప అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. కాని ధరల భారం వినియోగదారులను పీల్చివేస్తున్నది. మరోవైపున ఆహార సరుకుల ధరలు చుక్కలను చూస్తున్నాయి. వంటనూనెలు, కూరగాయలు, పాలు, మాంసం ఉత్పత్తులన్నింటి ధరలు పెరిగాయి. ఫలితంగా 90 శాతం ప్రజలకు ఈ సరుకుల వినియోగం మోయలేని భారంగా పరిణమించింది. ధరల తగ్గింపును గురించి పట్టించుకోని ప్రభుత్వం గోరుచుట్టుపై రోకటిపోటులాగా పాల ఉత్పత్తులతో పాటు అనేక ఆహార సరుకులపై జిఎస్‌టిని పెంచింది. ధరల పెరుగుదల, ఉపాధిపోవటం, ద్రవ్యోల్బణం ఎగసిపడుతున్న పరిస్థితులలో వీటినుండి ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నమైన విధానాలను అనుసరించటంతో ఈ సమస్యలు మరీ తీవ్రం అవుతున్నాయి. ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నపుడు వారి కొనుగోలు శక్తిని పెంచి, ఆర్థికవృద్ధికి ఊతం ఇవ్వాల్సిన ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నమైన విధానాలను అనుసరిస్తుండటంతో వారి కొనుగోలు శక్తి మరింత పడిపోయింది. అందువలన దేశ ఆర్థికవ్యవస్థ మాంద్యంలో కూరుకుపోతున్నది.

ఈ స్థితిలో ప్రజల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీయాలని, ధరల పెరుగుదల నుండి ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకొనేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చలేవనెత్తాయి. దానిని సహించలేని ప్రభుత్వం రాజ్యసభ నుండి 19 మంది సభ్యులను ప్రస్తుతం జరగుతున్న వర్షాకాల సమావేశాలు పూర్తయేవరకు సస్పెండ్ చేసింది. అంతకు ఒకరోజు ముందు ఇదే సమస్యలపై లోక్‌సభలో ఆందోళన చేస్తున్న నలుగురు సభ్యులను వారం రోజుల పాటు సస్పెండ్ చేసింది. తర్వాతి రోజు ఒకరిని, ఆ తర్వాతి రోజు ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేసి, సస్పెన్షన్ల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. సభ్యుల సస్పెన్షన్‌ను రద్దు చేసి, వారిని తిరిగి సభా కార్యకలాపాలలో పాల్గొనేలా చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తుండగా, ఆ విధంగా చేయాలంటే సభ్యులు పార్లమెంటు వెల్‌లోకి రాబోమని, కాగితాలు విసరమని హామి ఇవ్వాలని ప్రభుత్వపక్షం డిమాండ్ చేస్తున్నది. అంటే ప్రజల సమస్యలపై పార్లమెంటులో ఆందోళన చేయటానికి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టటానికి ప్రతిపక్ష సభ్యులకు ఉన్నహక్కును వదులుకోవాలని ప్రభుత్వం కోరుతున్నది. పార్లమెంటరీ సాంప్రదాయాలు, ప్రజాస్వామిక విలువలకు ఈ ప్రభుత్వం వీసమెత్తు విలువ కూడా ఇవ్వదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ పరిణామాలు ఇలా ఉండగా ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం అంశాలపై వచ్చే వారం చర్చ ఉంటుందని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. అంటే ప్రజలందరికీ సంబంధించిన అత్యంత ప్రాధాన్యత కలిగిన సమస్యను పార్లమెంటు సమావేశాలు ముగియబోతున్నపుడు నామమాత్రంగా చర్చకు అనుమతించి సరిపెడతారన్నమాట! బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు, వారి సంపదలను పెంచటంపై మినహా ప్రజా సమస్యలపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ లేదని ఈ పరిణామాలు

స్పష్టం చేస్తున్నాయి. సంఘ్ పరివార్, దాని రాజకీయ విభాగమైన బిజెపి నిజస్వరూపాన్ని ఇది వెల్లడిస్తున్నది.

**ఆంధ్ర, తెలంగాణలో ప్రధాని పర్యటన**

ప్రధాని నరేంద్రమోడి జులై నెల 3వ తేదీన హైదరాబాద్‌లో, 4వ తేదీన ఆంధ్ర ప్రదేశ్‌లోని చిన్న అమిరంలో జరిగిన సభలలో పాల్గొన్నాడు. బిజెపి జాతీయ కార్యనిర్వాహక కమిటి సమావేశం జులై 2, 3 తేదీలలో హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణతో పాటు ఈ సంవత్సరం చివరకు ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలలో అధికారానికి రావటంపైనే బిజెపి కేంద్రీకరించింది. అయినా ఎన్నికలను మాత్రమే అధికారానికి సాధనంగా బిజెపి భావించటం లేదు. ఆ పార్టి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అధికారానికి వచ్చిన తీరు చూసినట్లయితే ఎన్నికలతో పాటు పార్టి ఫిరాయింపులు కూడా ప్రధాన సాధనంగా ఆ పార్టి వినియోగించుకుంటున్నదని స్పష్టమౌతున్నది. కాబట్టి ఆ పార్టి గత చరిత్రను పరిశీలిస్తే ఎన్నికలలో ప్రజలు ఓడిస్తే బిజెపి ప్రతిపక్షంలో కూర్చోదు. ప్రజల తీర్పును వమ్ముచేసి, అధికారంలో ఉన్న శాసనసభ్యులను కొనుగోలు చేయటం, బెదిరించటం, సిబిఐ, ఎన్ఐఎ, ఇడి తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించటం తదితర విధాలుగా ప్రతిపక్ష పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలను కూల్చి, తాము అధికారంలోకి వస్తున్నారు.

హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగించిన మోడి రాష్ట్రానికి డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవసరమని, కాబట్టి రాష్ట్రంలో కూడా తమ పార్టిని అధికారంలోకి తీసుకురావాలని కోరాడు. తెలంగాణ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రం నుండి అందాల్సిన సహకారం తదితరాలను గురించి ప్రస్తావించలేదు. మరోవైపున కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని, రాష్ట్రానికి అవసరమైన రుణాలు తీసుకోనీయటం లేదని, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కేటాయింపులు చేయటం లేదని టిఆర్ఎస్ ఆరోపణలు చేసింది. మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి, సమాఖ్య సూత్రాలను కాలరాస్తూ చిత్తం వచ్చినట్లుగా రాష్ట్రాలకు కేటాయింపులు చేస్తున్నారు. ఎన్నికలు రానున్న, బిజెపిని ఎన్నుకుంటారనుకున్న రాష్ట్రాలకు, బిజెపి ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు నిధులు, పథకాల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలున్న రాష్ట్రాలకు నిధులతో పాటు కేంద్ర పథకాలు, వివిధ శాఖల ద్వారా జరగాల్సిన కార్యక్రమాలలోనూ

"హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రసంగించిన మోడి రాష్ట్రానికి డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవసరమని, కాబట్టి రాష్ట్రంలో కూడా తమ పార్టిని అధికారంలోకి తీసుకురావాలని కోరాడు. తెలంగాణ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రం నుండి అందాల్సిన సహకారం తదితరాలను గురించి ప్రస్తావించలేదు."

వివక్ష చూపుతున్నారు. తెలంగాణ పట్ల కూడా అదే విధమైన వివక్ష చూపుతున్నారు. తమకు అవసరమైనపుడు ప్రస్తావించటం మినహా ప్రజలను, ఇతర పార్టీలను కలుపుకుని కేంద్ర వివక్షపై స్థిరంగా పోరాటం చేయటానికి టిఆర్ఎస్ పార్టి, రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావటం లేదు. టిఆర్ఎస్ యొక్క ఈ బలహీనతను ఉపయోగించుకొని బిజెపి తెలంగాణలో స్థానం సంపాదించుకోవటానికి ప్రయత్నిస్తున్నది. టిఆర్ఎస్ తన అవకాశవాద విధానాలను విడనాడి, రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటం, ప్రతిపక్షాలు, ప్రజలను కలుపుకొని కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై పోరాటానికి పూనుకోవటం ద్వారానే కేంద్ర వివక్షను ఎదుర్కోవటం, రాష్ట్రంలో బిజెపి ఎదుగుదలను అడ్డుకోవటం సాధ్యమౌతుంది.

హైదరాబాద్‌లో సభ జరిగిన మర్నాడు విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కాళ్ళ మండలం, పెదఅమిరంలో జరిగిన సభలో ప్రధాని పాల్గొన్నాడు. తన జీవితాన్ని ఫణంగా పెట్టి జాతీయోద్యమంలో గిరిజనులను చైతన్యపరుస్తూ, బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాయుధంగా సవాలు చేసి ప్రాణాలర్పించిన అల్లూరికి, జైలుశిక్షకే గజగజలాడి బ్రిటిష్ వారికి సలాంకొట్టి, స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్న సంఘ్ పరివార్‌కు హస్తిమశకాంతరం ఉన్నది. అయినప్పటికీ స్వాతంత్ర్యం కోసం పోరాడి, ప్రాణాలర్పించిన వారిని తమ ఖాతాలో వేసుకొని, ప్రజలను మోసం చేయటమనే రాజకీయ వ్యూహంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నాడు.

రాష్ట్రానికి వచ్చి, సభలో పాల్గొన్న సందర్భంలో కనీసం రాష్ట్రానికి సంబంధించి కేంద్రం పరిష్కరించాల్సిన సమస్యలనైనా ప్రధాని ప్రస్తావిస్తాడని, కేంద్రం నుడి రాష్ట్రానికి రావలసిన వాటిపై కనీసం హామీలైనా ఇస్తాడని ప్రజలు భావిస్తారు. కాని రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క సమస్యను ప్రధాని ప్రస్తావించలేదు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలుచేయలేదు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన వాటిలో పోలవరం ప్రాజెక్టు ఒకటిగా ఉంది. ప్రాజెక్టును పూర్తిచేయటంలో పునరావాసం, పునర్నిర్మాణం ప్రధానాంశాలుగా ఉన్నాయి. ఇందుకు 30 వేలకోట్ల రూపాయలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కాని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ పునరావాసం, పునర్నిర్మాణం తమ బాధ్యత కాదని, అందుకు నిధులివ్వబోమని కేంద్రం పదేపదే ప్రకటిస్తున్నది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన పునరావాసం, పునర్నిర్మాణాలకు బాధ్యత వహించనని కేంద్రం ప్రకటించటం ఏ మాత్రం సమంజసం కాదు. ఈ విషయంపై ప్రధాని నోరు మెదపలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా చట్ట ప్రకారం ఇవ్వవలసిన ప్రత్యేకహోదాను కేంద్రం తిరస్కరిస్తున్నది. ఆర్థికలోటును భర్తీ చేయటం లేదు. విశాఖ రైల్వే డివిజన్, కడపలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు తదితరాల అమలుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదు. ఆంధ్రులు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కుఫ్యాక్టరీని కేంద్రం ప్రైవేటీకరిస్తానని ప్రకటించింది. దానిని వ్యతిరేకిస్తూ ఉక్కుఫ్యాక్టరీ కార్మికవర్గం, విశాఖలోని కార్మికులు, ప్రజలు అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రజలతో పాటు తెలంగాణ ప్రభుత్వం, ప్రజలు కూడా ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలుపుతున్నారు. దేశవ్యాపితంగా ఉన్న కార్మికవర్గం కూడా ఈ పోరాటానికి సంఘీభావం తెలుపుతున్నది. వీటిలో ఏ ఒక్క సమస్యను గురించి ప్రధాని ప్రసంగంలో కనీస ప్రస్తావన లేదు. ప్రధాని ఈ విధంగా వ్యవహరించినప్పటికీ అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న టిడిపిలు

**"నైతిక విలువలకు కట్టుబడి ఉండటంలో తమను మించిన వారు లేరని నిరంతరం ప్రచారం చేసుకుంటూ, అధికారం, స్వప్రయోజ నాల కోసం ఎంతకైనా దిగజారటంలో తమకు సాటి లేరని సంఘ్ పరివార్ పదేపదే రుజువు చేసుకుంటున్నది. ప్రజలు ఇతర పార్టీల ప్రతినిధులుగా గెలిపించిన ఎం ఎల్ ఎ, ఎం పిలను ప్రలోభపెట్టటం, పార్టి ఫిరాయింపులను ప్రోత్సహించి, ఫిరా యింపుదారులతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయటంలో కూడా సంఘ్ పరివార్ సారథ్యంలోని బిజెపికి ఎవరూ సాటిరారు."**

నోరు మెదపలేదు. అధికారాన్ని కాపాడుకోవటం, తమ స్వప్రయోజనాలను నెరవేర్చుకోవటమే ప్రధానంగా ఉన్న వైసిపి, ఆ పార్టినేతృత్వంలోని ప్రభుత్వం ఇందుకు కనీస నిరసన కూడా తెలుపలేదు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా ఇటువంటి దుస్థితిలోనే ఉన్నది. రానున్న శాసనసభ ఎన్నికలలో బిజెపి కటాక్షంతో విజయం సాధించి అధికారానికి రావాలన్న యావ తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు వీసమెత్తు విలువ కూడా ఇవ్వటం లేదు. మరో ప్రతిపక్ష పార్టీ జనసేన బిజెపితో అంటకాగుతూ నోరు మెదిపే పరిస్థితిలో లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టి, ప్రతిపక్షంలో ఉన్న ప్రధానపార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదలి, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టి దయకోసం పాకులాడిన పరిస్థితి ఇంతకు ముందెన్నడూ లేదు. రాష్ట్ర ప్రజలు ఈ పార్టీల అవకాశ వాదాన్ని అర్థం చేసుకొని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న శక్తులకు మద్దతు ఇవ్వటం ద్వారానే ఇటువంటి దుస్థితి నుండి బయటపడటం సాధ్యమౌతుంది.

### బిజెపి అధికారదాహంతో దేశంలో పెరుగుతున్న అస్థిరత

నైతిక విలువలకు కట్టుబడి ఉండటంలో తమను మించిన వారు లేరని నిరంతరం ప్రచారం చేసుకుంటూ, అధికారం, స్వప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారటంలో తమకు సాటిలేరని సంఘ్ పరివార్ పదేపదే రుజువు చేసుకుంటున్నది. ప్రజలు ఇతర పార్టీల ప్రతినిధులుగా గెలిపించిన ఎం ఎల్ ఎ, ఎం పిలను ప్రలోభపెట్టటం, పార్టి ఫిరాయింపులను ప్రోత్సహించి, ఫిరాయింపుదారులతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయటంలో కూడా సంఘ్ పరివార్ సారథ్యంలోని బిజెపికి ఎవరూ సాటిరారు. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న శివసేన నుండి ఫిరాయింపులను ప్రోత్సహించి, ఫిరాయింపుదారులతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలో భాగం పంచుకున్న బిజెపి తాజాగా గోవాలో కూడా అదే విధమైన ఫిరాయింపుల క్రీడకు తెరలేపింది. మహారాష్ట్రలో శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపిలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉండగా, గోవాలో బిజెపి కూటమే అధికారంలో ఉన్నది. అయినప్పటికీ ప్రతిపక్ష పార్టి నుండి ఫిరాయింపులను ప్రోత్సహించటం ద్వారా తమ వక్రబుద్ధిని బయట పెట్టుకున్నారు. గోవాలో కాంగ్రెస్ ఎం ఎల్ ఎలు బిజెపి వైపుకు వచ్చినప్పటికీ ఆ పార్టికి తక్షణం చేకూరే ప్రయోజనమంటూ ఏమీలేదు. అయినా తమ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించేవారు లేకుండా చేసుకోవటం కోసం ప్రతిపక్షపార్టీలను నాశనం చేయటంలో భాగంగానే ఇలా చేస్తున్నారు. అందుకే గోవాలో ఈ ఫిరాయింపులను ప్రోత్సహించారు.

గోవా శాసనసభలో 40 స్థానాలు ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చినెలల్లో జరిగిన ఎన్నికలలో బి జె పి 20 స్థానాలు గెలవగా, కాంగ్రెస్ పార్టి 11 స్థానాలలో విజయం సాధించింది. కాంగ్రెస్ తరఫున గెలిచిన 11 మందిలో ఎనిమిది మందిని తనవైపుకు తెచ్చుకోవటానికి బిజెపి ప్రయత్నించింది. మాజి ముఖ్యమంత్రి, ప్రస్తుత శాసనసభలో కాంగ్రెస్ పార్టి నేత దిగంబర కామత్ ఈ ఫిరాయింపుదారులకు నాయకునిగా ఉన్నాడు. బిజెపి అగ్ర నాయకులలో ఒకరు ఫిరాయింపుదారులతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకున్నారని, వారిని గోవా నుండి తరలించటానికి సన్నాహాలలో ఉన్నారని కాంగ్రెస్ పార్టి వెల్లడించింది. పార్టి ఫిరాయించటానికి సిద్ధమైన ప్రతి శాసనసభ్యునికి 15 నుండి 20 కోట్ల రూపాయల వరకు చెల్లించటానికి సిద్ధమయ్యారని, కొందరిని బెదిరించటం, భయపెట్టటం చేశారని తెలుస్తున్నది. అయితే ఫిరాయింపులకు సిద్ధమైన శాసనసభ్యుల సంఖ్య తగ్గటంతో తాత్కాలికంగా ఫిరాయింపుల కార్యక్రమం వాయిదా పడింది. ఈరోజు కాకపోతే రేపైనా ఫిరాయింపుదారులు బిజెపితో చేరిపోతారని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మతతత్వాన్ని పెంచుతూ, లౌకికతత్వాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బిజెపి పథకం ప్రకారం ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ దేశానికి ప్రధాన ప్రమాదంగా ఉన్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

### బిజెపి నిజస్వరూపాన్ని వెల్లడించిన ఉగ్రవాద ఘటనలు

మెజారిటీ మతతత్వం ముసుగులో తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, మైనారిటీలందరూ తీవ్రవాదులని ముద్రవేస్తున్న సంఘ్ పరివార్, బిజెపిల నిజస్వరూపం మరోమారు ప్రజల ముందు బట్టబయలైంది. రాజస్థాన్‌లో దర్జి హత్యపై బిజెపి, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు నానాయాగీ చేశాయి. ముస్లీం తీవ్రవాదులు ఈ హత్య చేశారని విద్వేషం పెంచటానికి ప్రయత్నం చేశారు. చివరికి నిందితులలో ఒకరు బిజెపి కార్యకర్త, ఆ పార్టి నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నవాడని వెల్లడవటంతో వారి నోళ్ళు మూతపడ్డాయి. తర్వాత కొద్దిరోజులకు జమ్మూలో గ్రామస్తులు ఇద్దరు తీవ్రవాదులను బంధించి, పోలీసులకు అప్పగించగా, వారిలో ఒకడు బిజెపి జమ్మూ ప్రాంత మైనారిటీ మోర్చా ఇన్‌ఛార్జిగా ఉన్నాడని వెల్లడైంది. బిజెపి, సంఘ్ పరివార్‌కు తీవ్రవాదులతో ఉన్న సంబంధాలు, వారు ఉగ్రవాదులను ప్రోత్సహించటం, ఉగ్రవాద కార్యకలాపాలలో భాగస్వాములుగా ఉన్న ఘటనలు గతంలో వెల్లడైనాయి. కొన్ని ఉగ్రవాద ఘటనలపై విచారణకు నియమించిన కమిషన్‌లు సంఘ్ పరివార్‌కు చెందిన వారు ఆ ఘటనలలో ఉన్నారని సాక్ష్యాలతో సహా రుజువు చేశాయి. 2014లో మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మైనారిటీలపై దాడుల, కొట్టి చంపిన ఘటనలలో దోషులు సంఘ్ పరివార్‌కు చెందినవారేనని వెల్లడైంది. గౌరిలంకేశ్, గోవింద పన్సారే, దభోల్కర్ తదితరుల హత్యలలోనూ వారికి భాగముందని స్పష్టమౌతున్నది. పైకి ధర్మపన్నాలు వల్లిస్తూ, నీతిబోధలు చేస్తున్న సంఘ్ పరివార్ దేశంలో ఉగ్రవాదాన్ని పెంచిపోషించటంలో ప్రధాన భాగస్వామిగా ఉన్నది. మరోవైపున ముస్లింలంతా ఉగ్రవాదులని ప్రచారం చేస్తున్నది. మేకతోలు కప్పుకున్న పులి తన నిజస్వరూపాన్ని ఎక్కువ రోజులు దాచలేనట్లే మతం ముసుగులో మారణకాండను ప్రోత్సహిస్తున్న సంఘ్ పరివార్, బిజెపిల నిజస్వరూపం కూడా ఎక్కువ కాలం దాగదు.

❋

# ఉక్రెయిన్ రణక్షేత్రంలో రష్యాతో నాటో యుద్ధం

**ఎస్.వెంకట్రావు**



రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

ఫిబ్రవరి 24న ప్రారంభమైన ఉక్రెయిన్ యుద్ధం ఐదు మాసాలు నిలపుకొని ఆరవ మాసంలోకి అడుగుపెట్టింది. ప్రపంచంలోనే అతి శక్తివంతమైన రష్యా సైనిక పాటవం ముందు పిట్టలాంటి ఉక్రెయిన్ ఎలా నిలుస్తుంది అనుకున్న వారికి ఐదు మాసాలుగా యుద్ధం కొనసాగడం ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ పూర్వాపరాలు పరిశీలించిన వారికి మాత్రం అక్కడ జరుగుతున్నది రష్యాకూ, ఉక్రెయిన్‌కూ మధ్య యుద్ధం కాదనీ, అమెరికా నాయకత్వంలోని నాటో దళాలకూ, రష్యా సైన్యానికీ మధ్య యుద్ధం జరుగుతున్నదని అర్థమవుతుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పినట్లు ఉక్రెయిన్‌లో అమెరికా దాని నాటో మిత్ర దేశాలు రష్యాతో ''నిరంతర యుద్ధానికి'' (ఫరెవర్ వార్) తలపడ్డాయనీ బోధపడుతుంది. ఈ రోజున ఉక్రెయిన్‌లో రష్యా దళాలు యుద్ధం చేస్తున్నది ఆ దేశ సైన్యంతో కాదు, అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ ఇతర నాటో దేశాలు అందిస్తున్న సైనిక బలంతోనూ, అమెరికా, ఐరోపా యూనియన్ అందిస్తున్న అర్థబలంతోనూ యుద్ధం చేస్తున్నది. నాటో సైనికులు ఉక్రెయిన్ యుద్ధంలో ప్రత్యక్షంగా కూడా పాల్గొంటున్నారు.

**ఉక్రెయిన్‌లో నాటో ఆయుధాలు, బలగాలు**

రష్యా దాడి ఉక్రెయిన్ యుద్ధానికి నాంది పలికినప్పటికీ వాస్తవానికి ఈ యుద్ధానికి రిహార్సల్స్ 2014 నుండే జరుగుతున్నది. 2014లో ఉక్రెయిన్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని అమెరికా, యూరప్ దేశాలు కుట్రతో కూలదోసినప్పటి నుండి ఆ దేశాన్ని నాటో కూటమి సాయుధం గావిస్తూ వచ్చాయి.

“ఎట్టకేలకు మా పశ్చిమ దేశాల మిత్రులు పంపిస్తున్న ఆయుధాలు పనిచేయడం ప్రారంభించాయి” అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇటీవల ప్రకటించాడు. “దురాక్రమణదారుల నష్టాలు రానురాను మరింత పెరుగుతున్నాయి” అని పేర్కొంటూ ఇంకా ఇంకా ఆధునికమైన మారణాయుధాలు, ఆర్థిక సాయం అందించాలని తద్వారా యుద్ధాన్ని సాధ్యమైనంత కాలం పొడిగిస్తామని జెలెన్స్కీ పేర్కొన్నాడు. నిజానికి ఈ మాటలు జెలెన్స్కీవి కావు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌వి. జులై ఆరంభంలో బైడెన్ మీడియాతో మాట్లాడుతూ ఉక్రెయిన్‌కు ఆర్థిక, సైనిక సాయం చేయడానికి పరిమితులు ఉండబోవని చెప్పారు. దాని అర్థం ఏమిటి అని ఒక విలేకరి నాటో శిఖరాగ్ర సభ సందర్భంగా బైడెన్‌ను ప్రశ్నించినప్పుడు ఆయన “ఉక్రెయిన్ తీసుకున్నంత కాలం మేం మద్దతు ఇస్తూనే ఉంటాం” అని చెప్పారు. అంటే “నిరంతర యుద్ధానికి స్వస్తి పలకాల్సిన సమయం వచ్చింది” అని ఏడాది క్రితం ఆఫ్ఘన్ యుద్ధాన్ని ముగిస్తూ ఏ మాటలైతే బైడెన్ చెప్పారో ఆయనే అదే నోటితో ఉక్రెయిన్‌లో నిరంతర యుద్ధానికి సిద్ధపడ్డామని చెబుతున్నారు.

ఒకవైపు అమెరికాతో సహా ప్రపంచమంతా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి దిగజారిపోతుండగా అమెరికా ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు ఉక్రెయిన్‌కు 760 కోట్ల డాలర్ల (సుమారు రూ. 60,000 కోట్లు) సైనిక సాయం అందించింది. దీనికి తోడు మరో 82 కోట్ల డాలర్ల సాయం అందించాలని ఈ నెలారంభం లో నిర్ణయించింది. అమెరికా సాయానికి తోడు బ్రిటన్, ఐరోపా యూనియన్‌లు కూడా భారీగా ఆయుధాలు, ఆర్థిక సాయం అందిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు అత్యంత ఆధునికమైన విమాన విధ్వంసక వ్యవస్థలు, యుద్ధ డ్రోన్‌లు, రాకెట్‌లు, ఫిరంగులు మందుగుండు సామగ్రిని పెద్ద ఎత్తున చేరవేశాయి. ఒక రకంగా అమెరికా అమ్ముల పొదిలోని అత్యంత ఆధునిక సంప్రదాయ ఆయుధాలను రష్యాపై ప్రయోగించడానికి ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రాన్ని ఉపయోగించుకుంటోంది. ఇటీవల అమెరికా నుండి వచ్చిన ‘హిమార్స్’ వ్యవస్థలను (హై మొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్) ను ఉపయోగించి రష్యా మందుగుండు గొడౌన్‌ను పేల్చివేసినట్లు ఉక్రెయిన్ సైనికాధికారులు తెలిపారు. డజన్ల కొద్దీ ‘హిమార్స్’ వ్యవస్థలు ఉక్రెయిన్‌కు అందాయి. వీటికి తోడు ఇటీవల అత్యంత ఆధునికమైన 18 ఎంఎల్ఆర్ఎస్ (మల్టీ లాంచ్ రాకెట్ సిస్టమ్)లను అమెరికా, జర్మనీ, నెదర్లాండ్స్, బ్రిటన్‌లు ఉక్రెయిన్‌కు పంపాయి. ఇంతటి ఆధునిక ఆయుధాలను ఉక్రెయిన్ సైన్యం రాత్రికి రాత్రి ఉపయోగించలేదు. అందుకు శిక్షణ అవసరం. అంటే ఈ ఆయుధాలను రష్యా దాడి తరువాత పంపినప్పటికీ ఇంతకు ముందు నుండే అమెరికా, నాటో దళాలు ఉక్రెయిన్ సైన్యానికి వాటిపై శిక్షణ ఇస్తున్నాయన్న మాట. రష్యా బలహీనమైన తమ దేశం మీద దురాక్రమణ చేసిందని జెలెన్స్కీ మీడియా ముందు ఏడుస్తున్నప్పటికీ, పశ్చిమ దేశాల మీడియా దీనిపై రష్యాకు వ్యతిరేకంగా విపరీతమైన ప్రచారం చేస్తున్నప్పటికీ వాస్తవానికి ఈ యుద్ధానికి రష్యాను పురిగొల్పిందీ, ఉక్రెయిన్‌ను యుద్ధానికి ముందుగానే సమాయత్తం చేసిందీ అమెరికా, నాటో కూటమే.

ఉక్రెయిన్‌లో ఈ రిహార్సల్స్‌ను 2014లోనే, ఇంకా చెప్పాలంటే అంతకు చాలా ముందు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై స్వతంత్ర ఉక్రెయిన్ ఏర్పాటి నుండే అమెరికా ప్రారంభించింది. 1990వ దశకంలో ఉక్రెయిన్‌లోని యారొవివ్ సైనిక క్షేత్రాన్ని నాటో కార్యకలాపాల శిక్షణా కేంద్రంగా మార్చేశారు. ఆ కేంద్రంలో విదేశీ దళాల చేత సుమారు 1000 మంది నిరంతరం శిక్షణ పొందేవారు. ఈ కేంద్రమీద గత మార్చిలో రష్యా దళాలు దాడి చేసి ధ్వంసం చేశాయి. 1997 నుండి అమెరికా, నాటో దళాలతో కలిసి ఉక్రెయిన్ ‘సీ బ్రీజ్’ పేరుతో నల్ల సముద్ర తీరంలో విన్యాసాలు చేస్తూ వస్తోంది. రష్యా ఈ విన్యాసాల్లో 1998లో ఒక్క సారి మాత్రమే పాల్గొన్నది. తరువాత ఈ విన్యాసాలు ఈ ప్రాంతంలో రష్యా ప్రాబల్యాన్ని

" అంతకు ముందు పాత సోవియట్ సైనిక కమాండ్ వ్యవస్థ మాదిరిగా ఉన్న ఉక్రయిన్ కమాండ్ వ్యవస్థ నాటో, అమెరికాల శిక్షణలో నాటో వ్యవస్థ తరహాలోకి మారి పోయింది. నాటోతో కలిగి రష్యాతో యుద్ధం చేయడానికి ఉక్రయిన్ సైన్యాన్ని సిద్ధం చేశారు. ఉక్రెయిన్ సైన్యంలో రష్యా అనుకులురను అరెస్టు చేశారు. కొందరిని రష్యాకు లేక డాన్‌బాస్‌కు పారిపోయే ట్లు వెంటాడారు. "

నిలువరించేందుకే జరుగుతున్నాయని గ్రహించి అది పాల్గొనడం మానేయడమే కాదు ఈ సైనిక విన్యాసాలను వ్యతిరేకించింది. అయితే 2014 వరకు ఉక్రెయిన్ ప్రభుత్వాలన్నీ ఒకవైపు రష్యాతో చారిత్రక ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే మరోవైపు నాటోతో సంబంధాలు నెరుపుతూ వచ్చాయి. 2006లో ప్రధానిగా, తరువాత 2010లో దేశాధ్యక్షునిగా అధికారంలోకి వచ్చిన విక్టర్ యనుకోవిచ్ నాటోతో ఉక్రెయిన్ సంబంధాలను తెంచుకోవడం ప్రారంభించా డు. దాంతో నాటో పత్రిక 'నాటో రివ్యూ జర్నల్' యనుకోవిచ్ చర్యలను ఖండిస్తూ వ్యాసాలు రాసింది. 2014లో అమెరికా, ఇయుల మద్దతులో జరిగిన కుట్రద్వారా యనుకోవిచ్ ప్రభుత్వాన్ని కూల్చివేసింది. దానికి ప్రతిగా రష్యా నల్ల సముద్రంలో తన ముఖ్యమైన సైనిక స్థావరం ఉన్న క్రిమియాను ఉక్రెయిన్ నుండి స్వాధీనం చేసుకుని స్వతంత్రం ప్రకటించింది. ఉక్రెయిన్ తూర్పున రష్యన్లు మెజారిటీగా గల ప్రాంతాల్లో అంతర్యుద్ధం మొదలైంది. ఇక అప్పటి నుండి రష్యాపై యుద్ధానికి అమెరికా, నాటో కూటమి ఉక్రెయిన్‌ను సన్నద్ధం చేస్తూ వచ్చాయి. ఉక్రెయిన్ సైన్యానికి నిరంతరాయం గా శిక్షణ ఇవ్వడం, ఆ దేశంలోకి ఆయుధాలు, మందుగుండు పంపించడం ప్రారంభించియి.

1991 నుండి క్షీణిస్తూ వచ్చిన ఉక్రెయిన్ సైన్యాన్ని అమెరికా 2014 తరువాత బలోపేతం చేయడం మొదలు పెట్టింది. 1991లో 8 లక్షల మందితో ఉన్న ఉక్రెయిన్ సైన్యం 2014 నాటికి 1.3 లక్షలకు తగ్గిపోయింది. వీరిలో కూడా 60 వేల నుండి 70 వేల మంది మాత్రమే యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. అయితే అమెరికా నిధులతోనూ, ఉక్రెయిన్ జిడిపిలో 6 శాతం మొత్తం సైన్యంపై ఖర్చు చేయడం ద్వారా 2014 నుండి 2022 మధ్య ఉక్రెయిన్ సైన్యం సంఖ్య రెట్టింపై 2 లక్షలకు చేరింది. ఆ విధంగా ఉక్రెయిన్ సైన్యం రష్యా తరువాత ఈ ప్రాంతంలో రెండవ అది పెద్ద సైన్యంగా మారింది. దాని సైనిక శిక్షణ కూడా నాటో తరహాలో, దాని స్టాండర్డ్స్‌లో సాగింది. మరోవైపు ఉక్రెయిన్ ప్రభుత్వం "ఫాసిస్టు సైనిక బెటాలియన్" ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఫలితంగా హిట్లర్ నాజీ సైనికుల తరహాలో ఉక్రయిన్‌లో "అజోవ్ బెటాలియన్" ఏర్పడింది. వీళ్ళ తూర్పు ఉక్రెయిన్ అంతర్యుద్ధంలో రష్యా అనుకూల మిలీషియాతో పోరాటానికి సిద్ధం చేయబడ్డారు. ఇటువంటి ఫాసిస్టు దళాలు 2020 నాటికి లక్ష మందికి చేరుకున్నాయని రాయిటర్ వార్తా సంస్థ తెలిపింది.

అంతకు ముందు పాత సోవియట్ సైనిక కమాండ్ వ్యవస్థ మాదిరిగా ఉన్న ఉక్రయిన్ కమాండ్ వ్యవస్థ నాటో, అమెరికాల శిక్షణలో నాటో వ్యవస్థ తరహాలోకి మారిపోయింది. నాటోతో కలిగి రష్యాతో యుద్ధం చేయడానికి ఉక్రయిన్ సైన్యాన్ని సిద్ధం చేశారు. ఉక్రెయిన్ సైన్యంలో రష్యా అనుకులురను అరెస్టు చేశారు. కొందరిని రష్యాకు లేక డాన్‌బాస్‌కు పారిపోయే ట్లు వెంటాడారు.

2014 కుట్ర తరువాత 2016లో అధికారంలోకి వచ్చిన పొరోషెంకో ప్రభుత్వం ఉక్రెయిన్ సైన్యాన్ని "నాటో అనుమతించిన సూత్రాలు, స్టాండర్డ్స్‌కు అనుగుణంగా తీర్చిద్దిదడం" తమ వ్యూహంగా ప్రకటించాడు. మరోవైపు 'ఉక్రెయిన్, జార్జియాలతో అను సంధానం ద్వారా నల్ల సముద్రంలో తమ ఉనికిని పెంచుకోవడం' తమ లక్ష్యం అని నాటో ప్రకటించింది. నాటో సహకారంతో క్రిమియాను తిరిగి స్వాధీనం చేసుకుంటాం అని పొరొషెంకో ప్రభుత్వమూ, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత జెలెన్‌స్కీ ప్రభుత్వమూ ప్రకటించాయి. సైనిక చర్యల ద్వారా క్రిమియా, డాన్‌బాస్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం తమ సైనిక లక్ష్యమని 2021లో ఉక్రెయిన్ సైన్యం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు నాటో క్రమంగా ఉక్రెయిన్‌ను తమ కూటమిలో చేర్చుకోడానికి పావులు కదుపుతూ వచ్చింది. 2016లో ఉక్రెయిన్‌కు నాటోలో "పెరిగిన అవకాశాల భాగస్వామి" హోదా ఇచ్చింది. ఇంకో వైపు ఉక్రెయిన్ సమస్యను సృష్టించి రష్యాతో యుద్ధానికి నాటో కూడా సిద్ధం చేసుకోవడం ప్రారంభించింది. 2015 నుండి 2022 మధ్య నాటో సభ్య దేశాల రక్షణ వ్యయం ఏడాదికి సగటున 3.5 శాతం చొప్పున పెరిగింది. 2014లో 9,100 కోట్ల డాలర్ల నుండి 2022 నాటికి లక్ష కోట్ల డాలర్లు దాటింది.

ఉక్రెయిన్‌ను సాయుధం చేసేందుకు 2014లో ఒబామా ప్రభుత్వ హయాంలో అమెరికా పార్లమెంటు "ఉక్రయిన్ స్వేచ్ఛకు మద్దతు చట్టం" ఆమోదించి ఆ దేశానికి 35 కోట్ల డాలర్ల సైనిక సాయం అందించింది. అప్పటి నుండి ప్రతి ఏటా ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్నీ, ఆధునిక మారణాయుధాల సరఫ రాలనూ పెంచుతూ వచ్చింది. ఈ ఆయుధాల్లో ప్రధాన భాగం ఉక్రెయిన్‌లోని నయా-నాజీ "అజోవ్ సైన్యం" చేతుల్లోకి వెళ్లాయి. ఈ ఆయుధాలతో మరియుపోల్ నగరంలో అజోవ్ సైనికులు శిక్షణ పొందుతున్న ఫోటోలు 2017 లో వెలువడ్డాయి. అమెరికా అమ్ముల పొదిలో అత్యంత మారణాయుధాలైన 210 జావెలిన్ క్షిపణులనూ, 37 లాంచర్లనూ 2018లో ఉక్రెయిన్‌కు పంపారు. అమెరికానే కాకుండా బ్రిటన్, బాల్టిక్ దేశాలు, జెక్ రిపబ్లిక్, పోలాండ్, ఫ్రాన్, లిథుయేనియా, ఇతర నాటో దేశాలు 2014 తరువాత పెద్ద ఎత్తున ఉక్రె యిన్‌కు ఆయుధాలు పంపడం ప్రారంభించా యని 'ఫోరమ్ ఆన్ ఆర్మ్స్ ట్రేడ్' సంస్థ తెలిపింది. ఆయుధాలతో పాటు నాటో దేశాలు వేలాది మంది సైనిక శిక్షకులను కూడా ఉక్రెయిన్‌కు పంపించాయి. నయా-నాజీ అజోవ్ బెటా లియన్‌కు కూడా విదేశీ సేనలు శిక్షణ ఇచ్చాయి. 2014 తరువాత శిక్షణ బాగా పెంచాయి. అమెరికాకు చెందిన 7వ ఆర్మీ శిక్షణ కమాండ్ ఒక్కటే 23,000 మంది ఉక్రెయిన్ సైనికులకు శిక్షణ ఇచ్చిందని బ్రిగేడియర్ జనరల్ జోసఫ్ హిల్‌బెర్ట్ చెప్పారు. తమ దేశం 2015 తరువాత 20,000 మంది ఉక్రెయిన్ సైనికులకు శిక్షణ ఇచ్చిందని బ్రిటిష్ విదేశాంగ మంత్రి బెన్ వాలెస్ తెలిపారు. ఉక్రెయిన్‌లో అమెరికా గూఢచారి సంస్థ "రహస్య శిక్షణ కార్యక్రమాన్ని" నిర్వహించిందని యాహూ న్యూస్ వెల్లడించింది. దీ న్నం త టి నీ పరిశీలించి నప్పుడు ఉక్రెయిన్ యుద్ధం అనేది రష్యాకు వ్యతిరేకంగా అమెరికా, నాటో సిద్ధం

చేసి ఉంచిన దీర్ఘకాలిక వ్యూహంలో భాగమని తెలుస్తుంది. అందువల్లనే యుద్ధం ప్రారంభమై 5 మాసాలు గడుస్తున్నా, రోజూ విపరీతమైన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగుతున్నా రాజీ ప్రయత్నాలు జరగకుండా యుద్ధాన్ని కొనసాగించడానికి అమెరికా, ఇయు దేశాలు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి.

❝ ఆంక్షల ప్రభావం ఒక్క రష్యానే కాదు అటు అమెరికా, ఇయు దేశాలనూ, అంతర్జాతీయంగా అన్ని దేశాలనూ ప్రభావితం చేసింది. అంతర్జాతీయంగా చమురు రిటైల్ ధరలు పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. అదే సమయంలో ఆర్థిక మాంద్యం కూడా ప్రపంచాన్ని చుట్టుముట్టింది. ❞


ఉక్రెయిన్ సైన్యంలో నయా–ఫాసిస్టు అజోవ్ బెటాలియన్

### రష్యాపై ఆంక్షలు, ప్రభావం

తనే ప్రారంభించిన ఉక్రెయిన్ యుద్ధానికి పూర్తిగా రష్యాను బాధ్యురాలిగా చేసిన అమెరికా, ఐరోపా దేశాలు ఆ దేశంపై తీవ్రమైన ఆంక్షలు విధించాయి. ఒక రకంగా రష్యాను ఆర్థికంగా దిగ్బంధించి యుద్ధంలో అది ఓడిపోయేట్టు చేయడం ఆంక్షలు లక్ష్యం. 2014లోనే రష్యాపై అమెరికా, పలు ఐరోపా దేశాలు పెద్ద ఎత్తున ఆంక్షలు విధించి దాని ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేయడానికి ప్రయత్నించాయి. ఫలితంగా రష్యా తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. 2014 ఆంక్షల వల్ల రష్యాకు 4000 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని, చమురు ధరలు తగ్గిపోవడం వల్ల మరో 10,000 డాలర్ల నష్టం వాటిల్లిందని రష్యా ఆర్థిక మంత్రి ఆంటొన్ సిలియనోవ్ చెప్పారు. రష్యా చమురు, గ్యాస్‌పైనా ఆధారపడిన ఇయుకు కూడా 10,000 కోట్ల యూరోల నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపించి అమెరికా, ఇయులు రష్యా, దాని మిత్రదేశమైన బెలారస్‌లపై మరోదఫా ఆంక్షలు విధించాయి. ఈ సారి రష్యాతో వ్యాపారం చేసే ఇతర దేశాల సంస్థల పైన కూడా ఆంక్షల కొరడా ఝుళిపించాయి. రష్యా ఆస్తులను స్తంభింపజేశాయి. రష్యా ప్రభుత్వ రంగ సంస్థలను బహిష్కరించాయి. పుతిన్‌పైనా, ఇతర రష్యా అధికారులపైనా ప్రయాణ ఆంక్షలు పెట్టాయి. రష్యా చమురు కొనుగోలును పూర్తిగా నిషేధించాయి. అంతర్జాతీయ వాణిజ్యం నెరిపే 'స్విఫ్ట్' వ్యవస్థ నుండి రష్యాను బహిష్కరించాయి. ఇతర దేశాల బ్యాంకుల్లో ఉన్న రష్యా కేంద్ర బ్యాంకుకు చెందిన 63,000 కోట్ల డాలర్ల (సుమారు రూ. 50 లక్షల కోట్ల రూపాయల ఆస్తులను స్తంభింపజేశాయి. ప్రధాన బహుళజాతి కంపెనీలు రష్యాలో వ్యాపారాన్ని ఆపేశాయి. ఆంక్షల వల్ల రష్యాకు అపారమైన ఆర్థిక నష్టం వాటిల్లింది. 2022లో రష్యా జిడిపి 10 శాతం తగ్గిపోతుందని అంచనా. అయినప్పటికీ తగ్గేదే లేదని పుతిన్ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

రష్యా కూడా ప్రతీకార చర్యలకు దిగింది. తమ దేశం నుండి టెలికమ్ వస్తువులు, మందులు, వాహనాలు, వ్యవసాయోత్పత్తులు, విద్యుత్ సాధనాలు, కలపతో సహా 200 వస్తువుల ఎగుమతులపై రష్యా నిషేధం విధించింది. ఇవన్నీ ప్రధానంగా ఐరోపా దేశాలకు దిగుమతి అవుతాయి. రష్యాలో బాండ్లు కొని పెట్టుబడులు పెట్టిన పశ్చిమ దేశాల పెట్టుబడిదారులకు వడ్డీ చెల్లింపులను నిలిపివేసింది. రష్యాలో పెట్టుబడులు పెట్టిన విదేశీయులు వాటిని అమ్ముకోకుండా నిషేధం పెట్టింది.

ఆంక్షల ప్రభావం ఒక్క రష్యానే కాదు అటు అమెరికా, ఇయు దేశాలనూ, అంతర్జాతీయంగా అన్ని దేశాలనూ ప్రభావితం చేసింది. అంతర్జాతీయంగా చమురు రిటైల్ ధరలు పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. అదే సమయంలో ఆర్థిక మాంద్యం కూడా ప్రపంచాన్ని చుట్టుముట్టింది. ప్రపంచ వ్యాపితంగా మాంద్యోల్బణం (స్టాగ్ ఫ్లేషన్) ఏర్పడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రపంచాన్ని చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభాన్ని అమెరికా, ఇయులు రష్యా పై విధించిన ఆంక్షలు మరింత తీవ్రం చేశాయి. అధిక ధరల ప్రభావం అన్నిటి కన్నా ఇయు దేశాల మీద అత్యధికంగా ఉంది.

రష్యాపై ఆర్థిక ఆంక్షలను ఒక ఏడాది పాటు కొనసాగిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 0.7 శాతం తగ్గిపోతుందని జపాన్‌కు చెందిన విదేశీ వాణిజ్య సంస్థ (జెట్రోస్)లో ప్రచురించబడిన ఒక వ్యాసంలో ఆర్థిక నిపుణులు వెల్లడించారు. "రష్యా ఉక్రెయిన్‌లు ప్రపంచానికి అన్నదాతలు" అని బ్రిటిష్ మాజీ ట్రెజరీ అధికారి ఆండ్రూ మిల్లిగన్ చెప్పారు. ఈ రెండు దేశాలు కలిపి ప్రపంచ దేశాలకు 29 శాతం గోధుమలు ఎగుమతి చేస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం వల్ల గోధుమ ఎగుమతులు ఆగిపోతడంతో కార్పొరేట్ వ్యాపారులు ఇదే అదనుగా చూసుకుని ప్రపపంచవ్యాపితంగా ఆహార వస్తువుల ధరలు ఇప్పటి వరకు 77 శాతం పెంచేశారని అమెరికా వ్యవసాయ శాఖ తెలిపింది. ఇక్కడితో ఆగదు. యుద్ధం వల్ల ప్రపంచవ్యాపితంగా ఆహార ఉత్పత్తి కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. రష్యా, దాని మిత్ర దేశమైన బెలారస్‌లు ప్రపంచానికి మూడో వంతు ఎరువులు సరఫరా చేస్తున్నాయి. రష్యా ఒక్కటే 14 శాతం నత్రజని ఆధార ఎరువు ఎగుమతి చేస్తున్నది. ఈ ఎగుమతులకు ఆటంకం ఏర్పడ్డం వల్ల ఆహారోత్పత్తి ప్రమాదం లో పడుతుందని ఫలితంగా ఆహారం ధరలు మరింతగా పెరుగుతాయిని ఫైనాన్షియల్ పరిశోధనా సంస్థ

> **ఉక్రెయిన్ యుద్ధం తరువాత అమెరికా, పశ్చిమ దేశాలూ గతంలో కన్నా ఎక్కువ ఐక్యత ప్రదర్శించాయి. రష్యాపై కలిసికట్టుగా ఆంక్షలు విధించాయి. ఒక రకంగా నాటో ఐక్యత బలపడింది. అమెరికా, ఐరోపాల మధ్య చీలికలు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయి. కానీ అదే సమయంలో రాష్యా కూడా ఈ కాలంలో మిత్రులను కూడగట్టుకుంది.**

సిఎఫ్ఆర్ఐ తెలిపింది. ప్రధానంగా ఐరోపా దేశాలు రష్యా గ్యాస్ మీద పెద్ద ఎత్తున ఆధారపడి ఉన్నాయి కనుక రష్యాపై ఆంక్షల ప్రభావం ఆ ప్రాంతం మీద ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంత అభివృద్ధి ఆంక్షల కారణాన 0.5 శాతం వరకు తగ్గవచ్చునని మిల్లిగన్ అంచనా వేశారు. రష్యన్లు వినోద పర్యటనలు ఎక్కువగా చేస్తారు గనుక ఐరోపా పర్యాటక రంగం మీద కూడా దీని ప్రభావం ఎక్కువగానే ఉంటుంది.

### రష్యాకు మద్దతుగా

"రష్యాలాంటి దేశాన్ని ఒంటరిపాటు చేయడం అమెరికా, పశ్చిమ దేశాలకు సాధ్యపడదు" అని అమెరికా ఆంక్షలపై స్పందిస్తూ రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నాడు. వాస్తవానికి సమారు 1.48 ట్రిలియన్ డాలర్ల రష్యా ఆర్థిక వ్యవస్థ గొప్పది కాకపోవచ్చు. కానీ విస్మరించ వీలు లేనిది. అదీగాక సైనిక, సాంకేతిక రంగంలో అది ప్రపంచంలోని అగ్రగామి దేశాల్లో ఒకటి. రక్షణోత్పత్తుల్లో అమెరికా కన్నా ఒక ఆకు ఎక్కువే చదివింది. పైగా ప్రపంచ గ్యాస్ ఉత్పత్తిలో అగ్రగామి, చమురు ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానం ఆక్రమిస్తున్నది. ఆహారం, ఎరువులు ఎగుమతి చేసే దేశం. సరిగ్గా ఈ కారణం చేతనే పశ్చిమ దేశాలు రష్యా సహజవనరులను చేజిక్కించుకోడానికి ఆ దేశంలో తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదలచుకున్నాయి. దానికోసమే నాటోను రష్యా వరకు విస్తరిస్తూ వచ్చాయి. ఉక్రెయిన్‌ను ఈ వ్యూహంలో పావుగా ఉపయోగించుకోదలచుకున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం తరువాత అమెరికా, పశ్చిమ దేశాలూ గతంలో కన్నా ఎక్కువ ఐక్యత ప్రదర్శించాయి. రష్యాపై కలిసికట్టుగా ఆంక్షలు విధించాయి. ఒక రకంగా నాటో ఐక్యత బలపడింది. అమెరికా, ఐరోపాల మధ్య చీలికలు తాత్కాలికంగా తగ్గుముఖం పట్టాయి.

కానీ అదే సమయంలో రాష్యా కూడా ఈ కాలంలో మిత్రులను కూడగట్టుకుంది. మొత్తం వర్ధమాన దేశాలు, అభివృద్ధిలో ముందుకొస్తున్న బ్రిక్స్ దేశాలూ ఉక్రెయిన్ యుద్ధం విషయంలో పశ్చిమ దేశాల పక్షం చేరకపోగా చాలా వరకు రష్యా పక్షాన నిలబడ్డం విశేషం. ఈ యుద్ధ కాలంలో చైనా - రష్యాల బంధం మరింత బలపడింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. అదే సమయంలో ఉక్రెయిన్ మాదిరిగా తైవాన్‌ను ఉపయోగించుకుని తమ దేశంపై దాడికి అమెరికా కవ్వింపులకు దిగుతున్నదని చైనా విమర్శించింది. కష్ట కాలంలో రష్యాతో రూబుల్స్‌లో వ్యాపారం చేయడానికి చైనా అంగీకరించడం ద్వారా పశ్చిమ దేశాల ఆంక్షల ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా రష్యాతో కలిసి అంతర్జాతీయ మార్కెట్‌లో డాలరు ఆధిపత్యానికి సవాలు విసిరింది. సోషలిస్టు దేశాలైన ఉత్తర కొరియా, క్యూబాలు రష్యాకు అండగా నిలిచాయి. నాటోను విస్తరించడం ద్వారా అమెరికా రష్యాను రెచ్చగొడుతున్నదని క్యూబా విమర్శించింది. ఇక మధ్య ప్రాచ్యంలో అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న ఇరాన్ రష్యాకు అండగా నిలబడింది. చైనా, రష్యా, ఇరాన్‌ల మధ్య ఇటీవలి కాలంలో వాణిజ్య, ఆర్థిక సంబంధాలతోపాటు వ్యూహాత్మక సంబంధాలు పెరిగిన విషయం విదితమే. మునుపటి సోవియట్ రిపబ్లిక్కులైన బెలారస్, ఆర్మీనియా, కజకస్థాన్, తజికిస్థాన్, కిర్గిజిస్థాన్ లు రష్యాతో సమిష్టి భద్రతా ఒప్పంద సంస్థ (సిఎస్‌టిఒ)లో భాగస్వాములుగా ఉన్నాయి. నాటి పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఉక్రెయిన్ యుద్ధ సమయంలో మాస్కో సందర్శించడం ద్వారా రష్యాకు సంఘీభావం తెలి పాడు. అజర్బయిజాన్, సిరియాలు కూడా రష్యాకు మద్దతుగా నిలబడ్డాయి. నాటో భాగస్వామి అయిన టర్కీ నుండి కూడా రష్యా కొంతవరకు మద్దతు కూడగట్టగలిగింది. యుద్ధం కన్నా దౌత్య మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడం మంచిది అని టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డగోన్ చెప్పారు. ఈ విషయంలో టర్కీ ఒకవైపు నాటో సభ్యత్వం, మరోవైపు రష్యాతో సత్సంబంధాలు ఒదులుకోలేక కత్తిమీద సాము చేస్తున్నది. అన్నిటికీ మించి ఈ విషయంలో రష్యాకు సౌదీ అరేబియా నుండి మద్దతు లభించడం విశేషం. ఇటీవలి కాలంలో సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సాల్మన్‌కూ అమెరికాకూ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. 2015లో సాల్మన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

### భారత దేశ విధానం

అన్నింటికీ మించి ఇటీవలి కాలంలో అమెరికాతో వ్యూహాత్మకంగా జతకట్టిన భారత ప్రభుత్వం ఉక్రెయిన్ యుద్ధంలో 'తటస్థ' వైఖరి తీసుకోవడం కొంతవరకు రష్యాకు ఊరట కలిగించే విషయం. ఐక్య రాజ్య సమితిలో రష్యాకు వ్యతిరేకంగా ప్రవేశం పెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత దేశం గైరుహాజరయింది. "దౌత్యం ద్వారా సమస్యలు పరిష్కారించుకోవాలి, ఆయుధాల ద్వారా శాంతి ఎన్నటికీ చేకూరబోదు" అని ఇటీవల ఫ్రాన్స్‌లో భారత విదేశాంగ మంత్రి జయశంకర్ ప్రకటించారు. భారత దేశం ఈ విషయంలో తటస్థంగా ఉండడానికి రెండు బలమైన కారణాలున్నాయి. మొదటిది, రష్యాకు భారత్ వ్యూహాత్మక భాగస్వామిగా ఉంది. అత్యంత ఆధునికమైన ఎస్400 క్షిపణులతో సహా అనేక ఆధునిక ఆయుధాలను, విడిభాగాలనూ రష్యా నుండి అది దిగుమతి చేసుకుంటున్నది. రష్యాతో తెగతెంపులు చేసుకుంటే ఈ ఆయుధ సరఫరాకు ఆటంకాలు ఏర్పడతాయి. రెండోది, భారత దేశ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నది. ఆంక్షల అనంతరం రష్యా చమురును 30 చౌకగా అమ్మడానికి ముందుకు వచ్చింది. పైగా రెండు దేశాల మధ్య డాలర్లలో కాకుండా రూపాయల్లో వ్యాపారానికి అంగీకారం కుదిరింది. దేశ ప్రయోజనాల రీత్యా రష్యాతో తెగతెంపులు చేసుకోవడం భారత్‌కు సాధ్యం కాదు. అందువల్లనే అది తటస్థ వైఖరి తీసుకుంది.

### ఐరోపా సమాజంలో చీలికలు

రష్యాకు వ్యతిరేకంగా ఐరోపా సమాజం గతంలో ఎన్నటి కన్నా ఎక్కువగా నేడు ఐక్యమయ్యింది. రష్యాకు వ్యతిరేకంగా

వ్యవహరించడంలో అమెరికా కన్నా బ్రిటన్ మరింత ఉత్సాహంగా ఉంది. గతంలో అనేక విషయాల్లో అమెరికాతో విభేధించిన ఫ్రాన్స్, జర్మనీలు కూడా ఈ విషయంలో ఏకమ య్యాయి. అయితే ఈ ఐక్యత ఎంతో కాలం నిలిచేది కాదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తొలి 100 రోజుల పాటు కార్పొరేట్ ప్రచార సాధ నాల ప్రభావంతో ఐరోపాలో ప్రజల అభిప్రా యం రష్యాకు వ్యతిరేకంగా మళ్లించబడింది. రష్యాపై ఆంక్షలను మెజారిటీ ప్రజలు బలపరి చారు. కానీ మే నెల మధ్యలో ఇసిఎఫ్ఆర్ సంస్థ జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో 33 శాతం మంది యూరోపియన్లు శాంతి కావాలనీ, ఉక్రెయిన్-రష్యా-నాటో మధ్య సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరుకుంటున్నారు. 22 శాతం మంది మాత్రమే యుద్ధంలో రష్యా సంగతి తేల్చాలంటున్నారు. యుద్ధం పొడిగించ బడే కొద్దీ వీరి శాతం మరింత తగ్గి శాంతి యుత పరిష్కారం కోరే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఐరోపా ప్రభుత్వాలు యుద్ధాన్ని కొనసాగించడమో, ఆపడమే నిర్ణయించుకోవాల్సింది ఉక్రెయిన్ ప్రభుత్వమూ, ప్రజలేనని చెబుతున్నప్పటికీ ప్రజాభిప్రయం మాత్రం దానికి భిన్నంగా ఉంది. మెజారిటీ యూరోపియన్లు ఉక్రెయిన్ కొన్ని రాయితీలు ఇచ్చి అయినా రష్యాతో శాంతి ఒడంబడిక కుదుర్చుకోవాలని కోరుతున్నారు. ఉక్రెయిన్ నుండి లక్షలాది మంది ప్రజలు వలస రావడం, ఇప్పటికే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొం టున్న తమ దేశాలు వారిని భరించలేకపోవడం వల్ల ప్రజల్లో యుద్ధం పట్ల విముఖత స్పష్టంగా కనిపిస్తున్నదని నిపుణులు చెబుతున్నారు.

మరోవైపు శీతాకాలం వస్తున్న కొద్దీ ఐరోపా దేశాలకు కంటిమీద కునుకు కరువవుతోంది. ఐరోపా యూనియన్‌కు అవసరమైన సహజవా యువులో 40 శాతం రష్యా నుండి దిగుమతి అవుతోంది. ఇందులో కూడా యూరప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీ అతి ఎక్కువగా రష్యన్ గ్యాస్ ఉపయో గించుకుం టున్నది. బ్రిటన్‌కు చాలా తక్కువ 4 శాతం మాత్రమే రష్యా గ్యాస్ దిగుమతి అవుతున్నది. నార్డ్ స్ట్రీమ్ 1 ప్రాజెక్టులో భాగంగా పైప్‌లైన్ ద్వారా రష్యా నుండి ఇయుకు గ్యాస్ వస్తున్నది. రష్యాపై ఆంక్షల్లో భాగంగా 15 శాతం గ్యాస్ దిగుమతులు తగ్గించుకోవాలని ఇయు తీర్మానిం చింది. అంతేకాని పూర్తిగా గ్యాస్ దిగుమతులను ఆపేయలేకపోయింది. ఆ మాత్రం నిషేధం కూడా అమలవుతుందన్న నమ్మకం లేదు.

"మరోవైపు శీతాకాలం వస్తున్న కొద్దీ ఐరోపా దేశాలకు కంటిమీద కునుకు కరువవుతోంది. ఐరోపా యూనియ న్‌కు అవసరమైన సహజవా యువులో 40 శాతం రష్యా నుండి దిగుమతి అవుతోంది. ఇయు ఆంక్షలకు ప్రతిగా రష్యా తమకు గ్యాస్ సరఫరా నిలిపివేస్తే తమ గతి ఏమిటి అని బ్రిటన్ మినహా యూరప్ దేశాలన్నీ మదనపడు తున్నాయి. ఇందులో కొన్ని దేశాలు బహిరంగం గానే యుద్ధాన్ని వ్యతిరే కిస్తున్నాయి."



ఉక్రెయిన్ సైన్యంలో పనిచేస్తున్న విదేశీ సైనికులను పట్టుకుని విచారిస్తున్న రష్యన్ సైనికాధికారులు

ఎందుకంటే రానున్న శీతాకాలంలో రష్యన్ గ్యాస్ దిగుమతి ఆగిపోతే యూరప్ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. రష్యాకు ప్రత్యామ్నాయంగా అమెరికా, కతర్‌ల నుండి ద్రవీకరించిన గ్యాస్ (ఎల్ఎన్‌జి) దిగుమతి చేసుకోవాలి. ఇది వ్యయభరితమే కాకుండా ఐరోపాలో ఎల్ఎన్‌జి దిగుమతికి అవసరమై నన్ని టెర్మినల్స్ లేవు. అందువల్ల ఇయు ఆంక్షలకు ప్రతిగా రష్యా తమకు గ్యాస్ సరఫరా నిలిపివేస్తే తమ గతి ఏమిటి అని బ్రిటన్ మినహా యూరప్ దేశాలన్నీ మదనపడు తున్నాయి. ఇందులో కొన్ని దేశాలు బహిరంగం గానే యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

హంగరీ దీనికి చక్కని ఉదాహరణ. ఇటీవల హంగరీ ప్రధాన మంత్రి విక్టర్ అర్బన్ మాట్లాడుతూ నాటో సభ్యదేశమైన తమ దేశం ఉక్రెయిన్ యుద్ధానికి దూరంగా ఉంటుందని ప్రకటించాడు. యూరోపియన్ యూనియన్‌కు కొత్త వ్యూహం కావాలి. శాంతి చర్చలపై ఆధారపడే చర్చల ప్రాతిపదికపై ఆ వ్యూహం ఉండాలి అని అర్బన్ స్పష్టం చేశాడు. హంగ రీకి కావలసిన గ్యాస్‌లో 80 శాతం, చమురులో 50 శాతం రష్యా నుండి దిగుమతి అవుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సత్సంబంధాలు పెంచుకోడానికి హంగరీ ప్రధాని తహతహలాడుతున్నాడు. ఇటీవల మెయింటెనెన్స్ పేరుతో నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్‌ను రష్యా 10 రోజుల పాటు మూసివేయడం రానున్న శీతాకాలంలో జరగబోయే పరిణా మానికి సూచన అని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రష్యా ఈ గ్యాస్‌పైప్ లైనును మూసివేస్తే ఐరోపా వాసులు శీతాకాలంలో నరకం అనుభవించాల్సి వస్తుందని భయపడు తున్నారు. మరోవైపు రష్యాపై ఆంక్షల వల్ల తలెత్తిన ఇబ్బందుల నుండి, నష్టాల నుండి తప్పించుకునేందుకు ఐరోపా యూనియన్ రష్యా ఆయిల్ అమ్మకాలపై ఆంక్షలను కొద్దిగా సడలించింది. రష్యా ప్రభుత్వ రంగ కంపెనీలు మూడో దేశాలకు చమురు అమ్ముకోవడంపై విధించిన ఆంక్షలను సడలించినట్లు ఇయు కౌన్సిల్ కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. "ప్రపంచంలో ఆహారం, ఇంధన కొరత నివారిం చేందుకు తాము ఈ చర్యలు తీసుకున్నట్టు" అని పేర్కొంది. రోజులు గడిచే కొద్దీ మరిన్ని సడలింపులు జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఏమైనా ఉక్రెయిన్ యుద్ధం నాటో యుద్ధ వ్యూహంలో భాగంగానే జరుగుతున్నదన్న విషయం స్పష్టం. అమెరికా పై ప్రజా ఒత్తిడి పెరిగితనే ఈ యుద్ధానికి ముగింపు జరుగుతుంది. లేకుంటే ఇది మరో ప్రపంచ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. ❋

# పర్యావరణం - పెట్టుబడి

**జాన్ బెల్లమీ ఫాస్టర్, బ్రెట్ క్లార్క్**



రచయిత జాన్ బెల్లమీ ఫోస్టర్ అమెరికాలోని ఒరెగావ్ యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్, మంత్లీ రివ్యూ పత్రిక సంపాదకుడు

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచాన్ని అధఃపాతాళానికి తొక్కేసింది. భూమ్మీద ఉన్న మనం ఇప్పుడు నిర్ణయాత్మక దశకి చేరుకున్నాం. అంతిమ పోరుకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూమి ఇంకెంత మాత్రం మానవులకు నివాస యోగ్యం కాని పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. మొత్తం నాగరికత ధ్వంసం కాబోతున్నది. అయితే ఇప్పటికీ వెనక్కి మళ్లే అవకాశం కాస్తంత ఉన్నది. ఉత్పత్తి, వినిమయం, ఇంధన వినియోగం తగ్గించుకునే విధంగా విప్లవాత్మకమైన మార్పులు చేసుకోగలిగితే ఈ మానవ కల్పిత విపత్తు నుండి బయటపడే అవకాశాలు కొంతవరకైనా ఉన్నాయి.

**ప్రమాద స్థాయి ఎంత?**

**అసలు ఇంతకీ ప్రమాదం నిజమేనా?**

ఇప్పుడున్న ఉత్పత్తి, వినిమయ విధానాల వలన మొత్తం పర్యావరణం వేడెక్కుతున్న మాట వాస్తవం. 2040 నాటికి భూమి సరాసరి ఉష్ణోగ్రత 1.5 సెంటిగ్రేడ్ అదనంగా పెరుగుతుంది. ఈ శతాబ్దం అంతమయ్యే లోపు ఆ వేడి తగ్గే అవకాశాలు లేవు. ఈ విధానాలు ఇలాగే కొనసాగితే శతాబ్దం అంతమయ్యే నాటికి 1.8 సెంటి గ్రేడ్ పెరగవచ్చని అంచనా. ఆ తర్వాత భూమి వేడి మరో 2 సెంట్రిగ్రేడ్లు, ఆ తర్వాత కాలంలో 4.4 సెంటిగ్రేడ్లు పెరుగుతుందని అంచనా. అప్పుడిక వెనక్కి మళ్లే అవకాశాలు శూన్యం. అందువలన ఏమైనా చర్యలు తీసుకోవాలనుకుంటే, ఆ అవకాశం ఇప్పుడే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఫలితం ఉండదు.

ఇప్పటికే ఈ దశాబ్దాలలో పర్యావరణం వేడెక్కిన కారణంగా విపరీతమైన వరదలు, తుఫానులు, వాతావరణంలో తేమ పెరగడం, వడగాడ్పులు, కరువు, అడవులు దహించుకుపోవడం, రుతుపవనాలు మందగించడం చూస్తున్నాం. సముద్ర మట్టం పెరుగుతున్నది. దీనిని ఆపే పరిస్థితి ఇప్పుడు ఇక లేదు. కేవలం తగిన చర్యల ద్వారా పెరుగుదల వేగాన్ని అరికట్టగలం. ఈ పర్యావరణంలో మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పంటల దిగుబడి తగ్గుతున్నది. కోట్లాది మంది ప్రజలు వలసలు పోవలసి వస్తుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో లక్షలాది జాతులు అంతమయి, జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ఇప్పటికే సముద్రాలు ఆమ్లీకరణ చెందుతున్నాయి. నత్రజని భాస్వర చక్రం దెబ్బతింటున్నది. అడవులు నాశనం అవుతున్నాయి. మంచి నీటి నిల్వలు రసాయనాలతో కలిసి కలుషితం అవుతున్నాయి. 'మానవ జీవన క్రమం' పూర్తిగా సమతూకాన్ని కోల్పోయి, తన రక్షక వ్యవస్థ రక్షణను కోల్పోతుంది" అని మార్క్స్ అన్న మాటలు సత్యమవుతున్నాయి.

అణుధార్మికత కారణంగా గాలి, నీరు, జీవం కలుషితమవుతున్నాయి. భూ వ్యవస్థ ప్రక్రియలు దెబ్బతినడం వలన, అణు పరీక్షలు నిర్వహించడం వలన ఆర్కిటిక్ ప్రాంతం మనకు ఎంతో దూరంగా ఉన్నప్పటికీ, అక్కడ కూడా అణుధార్మిక ప్రభావం కనపడుతున్నది. అయోడిన్ 131తో థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. స్ట్రాటియం – 90 ని అనేక మొక్కలు పీల్చుకుంటున్నాయి. ఆహార పదార్థాలలో హెచ్చు స్థాయిలో రేడియో న్యూక్లైడ్స్, ఇతర విషపదార్థాలు ఉండడాన్ని కార్సన్ అనే పర్యావరణ శాస్త్రవేత్త తన పరిశోధనతో వెలుగులోకి తెచ్చారు. కృత్రిమ ఎరువులు వాడకం అంటే, "రసాయనిక యుద్ధం" అని, ఆహారం విషతుల్యమవడం ఒక్కటే కాక మొత్తం పర్యావరణం కూడా ధ్వంసం అవుతుందని, కానీ "లాభదాయక ఉత్పత్తుల వేటలో పడిన" వాళ్ళు ఇవేవి పట్టించుకోరని వాపోయారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ "అత్యున్నత స్థాయికి" చేరుకుందని, 'అది కోట్లాది ప్రాణాలు తీయడానికి దారితీస్తుందని' బ్రిటిష్ మార్క్సిస్టు సిద్ధాంతకర్త ఇ.పి.థామ్సన్ అంటున్నారు. ప్రజలందరినీ ప్రపంచ పర్యావరణ రక్షణకు, పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించడానికి, సమీకరించాలని కోరుకున్నారు.

పర్యావరణం, ఆహారం, నీరు, గాలి కలుషితం అవడం వలన, మనుషుల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతినడం, మరణాలు సంభవించడమే కాదు. వాతావరణ తాపానికి గుండె జబ్బులు, ఊపిరితిత్తుల జబ్బులు పెరుగుతాయి. గాలిలో, నీటిలో ఉండే వైరస్‌ల వలన మనుషులకు రోగాలు సంక్రమించడం పెరగడమే కాదు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలు కూడా పెరుగుతాయి. దాదాపు 360 కోట్ల మంది ప్రజలు పర్యావరణ కాలుష్యానికి బలవుతారు. అంటే మొత్తం మానవ సమాజం క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటుంది. దీనికంతటికి కారణం హస్వదృష్టితో చేసే లాభాలు వేట.

పర్యావరణం ఒక సున్నితమైన, సమతుల్యత గల వ్యవస్థ. దానికి కలుషితాలు చేర్చి అవమానించాడు మానవుడు. సృష్టిలో ఏనాడూ ఈ విధంగా తనకు జీవితాన్ని, జీవనాన్ని ఇచ్చే భూమికి, కలుషితాలు, వ్యర్థాలు చేర్చి తన నాశనం తానే కొని తెచ్చుకున్న దాఖలాలు లేవు.

దీనికి కారణం ఈ నాటి వ్యవస్థ. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉచ్ఛ స్థితికి చేరుకున్న తర్వాత అభివృద్ధి మందగిస్తుంది. నిరుద్యోగం పెరుగుతుంది. దీనినే హెర్మన్ "ఓడిపోయిన అభివృద్ధి వ్యవస్థ" అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి నిలిచిపోవడం అంటే వ్యవస్థ నాశనం అవడమే. అందుకని ప్రతి కొత్త యాంత్రీకరణ, ప్రతి మార్పు, అవసరంతో నిమిత్తం లేకుండా, దాని ప్రభావంతో పని లేకుండా అభివృద్ధి వైపు నడవాల్సిందే. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థ 'తొలి రోజులకన్నా', ఉత్పత్తిని పెంచి, మరింత విధ్వంసం చేయడం వైపే అడుగులేస్తోంది.

తిరిగి వెనక్కి రా లేనంత ముందుకు పోవడానికి కూడా సంశయించదు. కేవలం రెండు శాతం భూమి వేడెక్కితే సముద్రాల నీటి మట్టం 50 అడుగులు పెరుగుతుంది. మొత్తం తీరాలన్నీ నీట మునుగుతాయి. వ్యవసాయం ధ్వంసం అవుతుంది. "ఆధునిక వ్యవసాయం కేవలం కార్మికులను మాత్రమే దోపిడీ చేయదు. భూమిని కూడా దోపిడీ చేస్తుంది. భూమి నుండి కూడా అదనపు విలువ కొల్లగొడుతుంది, కొల్లగొట్టే వనరులే పునఃప్రతిష్టించే వనరుల కన్నా ఎక్కువ ఉంటాయి. అంటే కార్మికులకు వారు సృష్టించే సంపద కన్నా తక్కువ చెల్లించడం, తద్వారా చెల్లింపులు చేయని శ్రమ పొందడం కాదు, ప్రకృతి నుండి కూడా బలవంతంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తిరిగి ప్రకృతికి చేర్చలేనంత ఎక్కువగా దోచుకుంటుంది. అంటే పర్యావరణాన్ని దెబ్బతీస్తూ లాభాలు పొందుతారు. పర్యావరణం యథాస్థితిలో కొనసాగడానికి కావలసిన చర్యలు తీసుకోరు. అది భూమి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది.

ప్రాచీన మెసొపొటేమియా నాగరికత కాలంలో భూమి ఉప్పు ఊరడానికి 1500 ఏళ్ళు పట్టింది. అది కూడా అత్యంత నిదానంగా జరగడం వలన చాలా సంవత్సరాల తర్వాత గానీ మార్పును గమనించడం జరగలేదు. కానీ ఉత్పత్తులు, మార్పిడులు మొదలవగానే ప్రకృతి విధ్వంసం విపరీతమైన వేగం పుంజుకుంది. ఇప్పుడు మనం అలౌకికంగా మాట్లాడుకోవలసి వస్తున్నది. కారణం సాంస్కృతిక నిరాశావాదం కాదు. విధ్వంసం పైచేయి సాధించడమే. పెట్టుబడిదారీ వ్యవస్థ అడ్డూ, అదుపు లేకుండా ప్రకృతితో తలపడటానికి ముందుకు ఉరకడం దీనంతటికి కారణం.

**పెట్టుబడిదారీ వ్యవస్థ చెప్పే పర్యావరణ రక్షణ నిజమేనా?**

పర్యావరణానికి హాని కలిగించకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ నడవగలదని కొందరు వాదిస్తున్నారు. ఇది కేవలం భ్రమ మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి చర్యలు తాత్కాలికమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి సంచయనం మందగించగానే, ఆర్థిక అభివృద్ధి చల్లబడగానే, నిరుద్యోగం పెరగగానే, పెట్టుబడి నిరుపయోగంగా ఉండడం మొదలవగానే ఈ సూత్రాలు గాలిలో కలిసిపోతాయి. పెట్టుబడిదారులు తమ అధికారాన్ని మరింత శక్తివంతంగా ఉపయోగించడం మొదలు పెడతారు. కొత్త సమాచార మాధ్యమాలు, నిఘా వ్యవస్థ సహాయంతో ప్రపంచీకరణ, ద్రవ్య పెట్టుబడి, నుంచి ప్రపంచ గుత్త ద్రవ్య పెట్టుబడి ప్రవేశిస్తుంది.

**"పర్యావరణానికి హాని కలిగించకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ నడవగలదని కొందరు వాదిస్తున్నారు. ఇది కేవలం భ్రమ మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి చర్యలు తాత్కాలికమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి సంచయనం మందగించగానే, ఆర్థిక అభివృద్ధి చల్లబడగానే, నిరుద్యోగం పెరగగానే, పెట్టుబడి నిరుపయోగంగా ఉండడం మొదలవగానే ఈ సూత్రాలు గాలిలో కలిసిపోతాయి."**

పర్యావరణాన్ని రక్షించడంలో ప్రధాన పాత్ర పోషిస్తానని ఈ వ్యవస్థ అంటే, అందులో ప్రవేటు పెట్టుబడుల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని అర్థం చేసుకోవలసి ఉంటుంది. కార్పొరేట్ సంస్థలు, ఎన్.జి.ఓ లు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అంతర్ ప్రభుత్వ సంస్థలు, అనేక రంగాలలో ప్రవేశించి రకరకాల అనుమతులు మంజూరు చేయడానికి ముందుకు వస్తాయి. ఉద్గారాల విడుదల పై, పరిమితులు విధిస్తామంటాయి. ఇవన్నీ ప్రకృతిని రక్షిస్తామన్న పేరుతో ప్రకృతిని ద్రవ్యీకరించడమే. పెట్టుబడి సంచయనానికి కొత్త మార్కెట్ తయారు చేసుకోవడం. పారిస్ ఒప్పందం వంటి వాటిలో ఈ విషయాన్ని మనం గమనిస్తాం." ఒక వర్గం నాయకత్వంలో సమాజం పతనం దిశగా వేగవంతంగా ప్రయాణం చేస్తున్నది. ఈ రైలు బండి సేఫ్టీ వాల్వ్ జామయి ఉంది. డ్రైవర్ బలహీనంగా ఉన్నాడు" అని ఏంగెల్స్ అన్నది ఈ వ్యవస్థను గురించే.

**మన ముందున్న దారేమిటి?**

ఈ పరిస్థితులను ఇక్కడితో ఆపాలంటే క్రింది చర్యలు తీసుకోవడం తప్పనిసరని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

1. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బొగ్గు ఆధారిత పరిశ్రమలు నిలిపివేయాలి. అందువలన భూమి ఉష్ణోగ్రత దశాబ్దకాలంలో 1.5 సెంటి గ్రేడ్ దాటి పెరగకుండా నిలువరించగలం.
2. ఉత్పత్తులను, ఇంధన వినియోగాన్ని ప్రభావితం చేసే రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను వెనువెంటనే మార్చవలసి ఉంటుంది.
3. తక్కువ ఇంధన వినియోగం గల ఉత్పత్తుల వైపుకు మళ్ళాలి.
4. "వలసలు వేగవంతం" చేసే చర్యలు చేపట్టాలి.
5. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల నష్టపోయే తరగతులకు ఆ నష్టాలను వివరించాలి. తద్వారా సమాజంలో పర్యావరణ పరిరక్షణకు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. కానీ ఇవన్నీ చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టు మారాయి. స్వప్రయోజనాలకు ఇటువంటి సూచనలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దానికి ఉదాహరణ పెరుగుతున్న బొగ్గు ఆధారిత పరిశ్రమలు.

నిజానికి పై పది శాతం ప్రపంచ ప్రజలు పది రెట్లు ఎక్కువగా గ్రీన్ హౌస్ ఉద్గారాల విడుదలకి కారణం అవుతున్నారన్నది నిర్వివాదాంశం. అందులో అత్యున్నత తరగతులలో 1 శాతం చేసే విమాన ప్రయాణాలు 50 శాతం ఉద్గారాల విడుదలకి కారణం. అంతేకాదు అభివృద్ధి చెందుతున్న దేశాలు విడుదల చేసే 40 శాతం ఉద్గారాలు కూడా అభివృద్ధి చెందిన దేశాలకు చేసే ఎగుమతుల కారణంగా విడుదల అవుతున్నవే.


**ఇప్పుడు మనం ఏం చేయాలి?**

ఈ పరిస్థితిని అధిగమించాలంటే మనం ఈ సమస్యను రెండు స్థాయిలలో పరిష్కరించాలి.

1. మానవ చరిత్ర మున్నెన్నడూ ఎరగనంత వేగవంతంగా విధ్వంసానికి గురవుతూ, కోట్లాది ప్రాణుల జీవితాలు గాలిలో కలిసిపోకుండా ఉండడానికి, భూ వ్యవస్థ సంక్షోభం నివారించడానికి, భూమి జీవులందరికీ నివాసయోగ్యంగా నిలపడానికి ఉన్న ఉత్పత్తి వ్యవస్థను సమూలంగా మార్చడం.

2. పర్యావరణంలో మార్పులు వేగం పుంజుకుంటుండగా వాటి ఫలితంగా వచ్చే తీవ్రమైన విధ్వంసాలకు ఇప్పుడు అడ్డుకట్ట వేయగల పరిస్థితి లేదు. అవి ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలను తీవ్రంగా బాధిస్తాయి. అందువలన ప్రపంచవ్యాప్తంగా

> **“ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం గురించి గుటెర్రస్ మాట్లాడుతూ, ఇదొక “వాతావరణ అత్యవసర పరిస్థితి”, “చేసిన ఒప్పందాలన్నీ ఉల్లంఘించబడిన స్థాయి”; “అసత్యాలు”, “ఉత్తుత్తి ప్రమాణాలు” కారణంగా ఈనాడు భూమి నివాసయోగ్యం కాకుండా పోతున్నది అన్నారు. ఇది నిజమైన “సామాజిక హత్య” అన్నారు ”**



ప్రజలను ఈ పర్యవసానాలను (ముఖ్యంగా వీటి వలన ఎక్కువ నష్టపోయేది పేద ప్రజలే,) గురించి చైతన్యవంతం చేయడం, తద్వారా పరిస్థితి మరింత దిగజారకుండా ఉండేటట్టు చేసే ప్రయత్నంలో వారిని భాగస్వాములను చేయడం.

ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం గురించి గుటెర్రస్ మాట్లాడుతూ, ఇదొక “వాతావరణ అత్యవసర పరిస్థితి”, “చేసిన ఒప్పందాలన్నీ ఉల్లంఘించబడిన స్థాయి”; “అసత్యాలు”, “ఉత్తుత్తి ప్రమాణాలు” కారణంగా ఈనాడు భూమి నివాసయోగ్యం కాకుండా పోతున్నది అన్నారు. ఇది నిజమైన “సామాజిక హత్య” అన్నారు ఏంగెల్స్. ఈ హత్య భూగోళవ్యాప్తంగా జరుగుతున్నదని, మొత్తం మానవజాతి అంతం అవుతుందని భయపడవలసి వస్తున్నది.

“లాభాలు వస్తుంటే పెట్టుబడి ధైర్యం పుంజుకుంటుంది. 10 శాతం లాభం వస్తుందంటే ఎక్కడికైనా పరిగెడుతుంది. 20 శాతం వస్తుందంటే ఉత్సాహంగా ఉత్పత్తి చేస్తుంది. 50 శాతం వస్తుందంటే ఎదురులేని ధైర్యంతో ముందుకెళుతుంది. 100 శాతం లాభాలొస్తాయంటే అన్ని మానవ చట్టాలను తొక్కేస్తుంది. 300 శాతం లాభాలొస్తాయంటే ఏ నేరమన్నా చేయడానికి వెనుకాడదు. ఆఖరికి తన యజమానిని కూడా ఉరితీస్తుంది. యుద్ధాలు, అల్లకల్లోలాలు లాభాలు తెచ్చిపెడతాయంటే వాటిని కూడా ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు జరిగిన స్మగ్లింగ్ అయినా, బానిస వ్యాపారమైనా దీనినే ధృవీకరిస్తోంది.”

పైన చెప్పిన విధంగా రెండు స్థాయిలలో పర్యావరణ రక్షణ జరుగుతున్నది. సోషలిస్టు సమాజాలలోనే. సోషలిస్టు సమాజాలే పెట్టుబడి లాభాపేక్షను ప్రతిఘటించ గలుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థదే అధిపత్యమయినప్పటికీ, సోషలిస్టు సమాజాలలో వాతావరణ పరిరక్షణ జరిగే విధంగా ఆర్థిక ప్రణాళికలు రచించబడుతున్నాయి. ప్రత్యామ్నాయ పునరుత్పత్తి సామాజిక జీవక్రియకి అవకాశం కల్పిస్తున్నది. ఉదాహరణకి క్యూబానే తీసుకుందాం. క్యూబా పెట్టుబడిదారీ వ్యవస్థ అనుసరించే విధానాలకు భిన్నంగా “ప్రత్యామ్నాయ” ఇంధనాలకు ప్రాధాన్యత ఇస్తున్నది. పర్యావరణం పై ప్రతికూల ప్రభావాలు లేని, ఇంధనాలను పొదుపుగా ఉపయోగించే ఉత్పత్తి విధానాన్ని అనుసరిస్తుంది. క్యూబా అనుసరిస్తున్న ఈ విధానాలే ప్రపంచానికి ఆదర్శం.

అలాగే వెనిజులాలోని బొలివారియన్ విప్లవం కూడా. భిన్నమైన రీతిలోనే అయినా, పర్యావరణ అనుకూల సమాజాన్ని రూపొందించుకుంటున్నది. గ్రామాలు, పట్టణాలలో కూడా ప్రజల కనీస అవసరాలు తీర్చే విధంగా ప్రణాళికలను రూపొందించుకుంటున్నది.’ ప్రజల నుంచి ప్రజల వద్దకు’ నినాదంగా తీసుకున్నది. ప్రణాళిక బద్ధంగా ఉత్పత్తి చేయడం, సాంస్కృతికంగా సంఘటితమవడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములు కావడం” ప్రధాన అంశాలుగా వ్యవస్థను నిర్మించుకుంటున్నది.

చైనా అభివృద్ధి చెందుతున్న దేశం. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చి చూస్తే తక్కువ తలసరి ఆదాయం కలిగి ఉన్నప్పటికీ, 2060 నాటికి కర్బన ఉద్గారాలు వెలువరించడం పూర్తిగా నిలుపుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. సౌర శక్తిని ఉపయోగించడంలో ప్రపంచంలో మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ప్రపంచ జనాభాలో 20 శాతం ఉండగా, ఉత్పత్తికి పనికి వచ్చే భూమి 10 శాతం మాత్రమే కలిగి ఉన్నప్పటికీ, ఈనాడు చైనా ప్రపంచ ధాన్యం ఉత్పత్తిలో 25 శాతం వాటా కలిగి ఉంది. అయితే ఈ ఉత్పత్తి సహకార రంగంలో, కమ్యూనిటీలలో జరుపుతున్నది. రాజ్యం ఆధీనంలో అనేక సహకార సంఘాలు ఉన్నాయి. అవే దేశంలో అత్యంత పేదరికాన్ని రూపుమాపేందుకు ఉపయోగపడుతున్నాయి.

లాభల వేటలో ఉన్న, మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కన్నా ప్రజల అవసరాల ఆధారంగా ఉండే ఆర్థిక వ్యవస్థ వలన ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయి. భూమి పర్యావరణ సమతుల్యత కోల్పోదు. మానవ మనుగడకు విఘాతం కలగదు.

అయితే ఇలా జరగాలంటే కార్మికులను, ప్రకృతిని కూడా పెట్టుబడి దోచుకోవడాన్ని నిలువరించగలగాలి. అంటే దేశీయుల నుండి, వలస దేశాల నుండి, చారిత్రికంగా బానిసలుగా చేయబడిన ప్రజల నుండి పాఠాలు నేర్చుకోవాల్సి ఉంటుంది. సామాజిక పునరుత్పత్తి సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే సరికొత్త సామాజిక జీవావరణ నాగరికతను సృష్టించవలసిన అవసరం ఉంది. మానవ మేధస్సు, జాతి ఆధారంగా ఇది నిర్మించబడాలి. అంటే గొప్ప ఐరిష్ విప్లవకారుడు జేమ్స్ కొన్నోలీ మాటల్లో,” మాకు కేవలం మా భూమి కావాలి”.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# జాతీయోద్యమంలో వామపక్షం

(11వ పేజీ తరువాయి)

### సంక్షోభంలో జాతీయ సంఘటన 1938-39

కాంగ్రెస్‌లోను ప్రత్యేకించి ఎ.ఐ.సి.సి.లోను వామపక్షవాదుల సంఖ్య పెరిగింది. ప్రజలలో పెరుగుతున్న వామపక్షాల పలుకుబడికి ఇది నిదర్శనం. 1937 ఎన్నికలలో పాల్గొనడానికి కాంగ్రెస్ సన్నాహాలు ప్రారంభించింది. ఫైజపూర్ మహాసభలో (1936 డిసెంబర్) ఆమోదించిన దాని ఎన్నికల ప్రణాళికకు కరాచీ తీర్మానం ప్రాతిపదికగా మారింది. దానిపై వామపక్షాల ముద్ర స్పష్టంగా వుంది. 1939 నాటికి ఎ.ఐ.సి.సి.లో ఇరవై మంది కమ్యూనిస్టులున్నారు. ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, సజ్జద్ జహీర్‌లు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సంయుక్త కార్యదర్శులుగా నియమితులవడంతో కమ్యూనిస్టుల పలుకుబడి అంతకంతకూ పెరిగింది. 1939 ప్రారంభంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుభాష్ బోస్ తిరిగి ఎన్నికవడం వామపక్షాలు సాధించిన ఘన విజయం. బోస్ అతివాద కాంగ్రెస్ నాయకుడు. తన అభిప్రాయాల కారణంగా ఆయన చాలాకాలంపాటు చిక్కుల్లో పడ్డారు. ఫాసిజం పట్ల ఆయనకున్న సానుభూతి గత చరిత్రగా మారిపోయింది. నెహ్రూ తర్వాత కాంగ్రెస్ అధ్యక్షునిగా మారిన బోస్ ఆయన వలెనే వామపక్షాల వైపు మొగ్గు చూపే విధానాలను స్వీకరించారు. 1939లో తిరిగి ఎన్నికవ్వాలని ఆయన కోరుకున్నాడు. గాంధీజీ నిలబెట్టిన పట్టాభి సీతారామయ్యపై పోటీచేశాడు. 1939 జనవరిలో జరిగిన ఎన్నికలలో బోస్‌కు 1580 ఓట్లు రాగా పట్టాభికి 1375 ఓట్లు వచ్చాయి. బోస్ విజయాన్ని వామపక్షాల విజయంగా వార్తాపత్రికలు వ్యాఖ్యానించాయి. కాంగ్రెస్‌లో వామపక్షాల పలుకుబడికి దీనిని రుజువుగా భావించారు.

అయితే ఈ విజయం స్వల్పకాలికమైంది. సోషలిస్టు భావాలు తనకు 'నచ్చవని' 1934కు ముందే గాంధీ ప్రకటించాడు. కాంగ్రెస్‌లో ఉండటానికి సోషలిస్టులకు హక్కు వున్నప్పటికీ దానిలో వారికి "ఆధిపత్య స్థానం" తనకు ఆమోదయోగ్యం కాదని అన్నారు. కాంగ్రెస్‌లో వామపక్షాల బలం పెరుగుతున్న కొలదీ గాంధీ సానుభూతి మితవాదుల వైపు అంతకంతకూ ఎక్కువ కాసాగింది. అయితే వామపక్షీయునిగా అనేకులు భావించే నెహ్రూతో తన సంబంధాలను ఆయన జాగ్రత్తగా నిలుపుకున్నాడు. ఎన్నికలు, మంత్రివర్గాల తరుణంలో అభ్యర్థుల ఎంపిక, మంత్రివర్గాల ఆధిపత్యం వంటి పనులను పార్లమెంటరీ బోర్డుకు విడిచి పెట్టారు. దీనికి వల్లభాయ్‌పటేల్ అధ్యక్షుడు కాగా ఆజాద్, రాజేంద్రప్రసాద్‌లు సభ్యులుగా వున్నారు. అందరూ మితవాదులే. వామపక్షానికి చెందిన అతి కొద్దిమందిని మాత్రమే అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఎ.ఐ.టి.యు.సి.కి చెందిన ఏకైక అభ్యర్థి (కె.ఎన్. జోగ్లేకర్)ని సైతం బలపరచడానికి కాంగ్రెస్ తిరస్కరించింది. ఇది కాంగ్రెస్‌కు డాంగే రాజీనామా ఇవ్వడానికి దారితీసింది. కాంగ్రెస్ మంత్రి వర్గాలలో చేరడానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తిరస్కరించడంతో మంత్రివర్గాలు మొత్తం మితవాదులతో నిండిపోయాయి (ఈ విధంగా తిరస్కరిస్తూ వామపక్షాలు తీసుకున్న నిర్ణయం సరైనదా కాదా అని ఇప్పుడు ఆలోచించవలసి వుంది).

మంత్రివర్గాలు పనిచేయడం ప్రారంభం కాగానే వాటితో, వామపక్షాల నేతృత్వంలోని ప్రజాసంఘాలకూ ముఖ్యంగా ఆలిండియా కిసాన్ సభ, ఎ.ఐ.టి.యు.సి.లకు విభేదాలు తీవ్రతరమయ్యాయి. తొలుత బీహార్‌లో యీ సంక్షోభం మొదలైంది. భూస్వాములకు బహిరంగంగా మద్దతునిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు పోరాటాలకు నాయకత్వం వహించేటందుకు వీలుగా బీహార్‌లో సుప్రసిద్ధ వామపక్ష రైతు నాయకుడు సహజానంద రాష్ట్ర పి.సి.సి. వర్కింగ్ కమిటీకి రాజీనామా చేశాడు. కాంగ్రెస్‌ను కిసాన్ సభ తృణీకరిస్తున్నదన్న అనుమానాలను వ్యక్తం చేయడంలో గాంధీ, మితవాదుల బృందం సరసన నెహ్రూ కూడా చేరాడు. 1938 సెప్టెంబర్‌లో కాంగ్రెస్ "ప్రక్షాళన" కార్యక్రమాన్ని గాంధీజీ ప్రతిపాదించాడు. ఇది వామపక్షాలకు వ్యతిరేకంగా చేపట్టిందనడం స్పష్టం. "హింసా మార్గాల ద్వారా వర్గ పోరాటాన్ని" ప్రబోధించే వారికి వ్యతిరేకంగా దృఢంగా నిలవాలని ఇదే సమయంలో ఢిల్లీ ఎ.ఐ.సి.సి. సమావేశం కాంగ్రెస్ మంత్రివర్గాలను కోరింది. సరిగ్గా ఈ తరుణంలోనే, మిల్లు యజమానుల తైనాతీగా మారిన బొంబాయి ప్రభుత్వం బోంబే పారిశ్రామిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టింది. దానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ కలిసి 1938 నవంబర్ 7న సార్వత్రిక సమ్మెను నిర్వహించాయి.

ఈ ఘర్షణలు వామపక్ష వాదులకు, మితవాదులకు మధ్య విభేదాలను పెంచాయి. త్రిపుర కాంగ్రెస్ మహాసభలో (1939 మార్చి) ఈ పరిస్థితులే సుభాష్ బోస్ ఎన్నికల విజయానికి తోడ్పడ్డాయి. అయితే కమ్యూనిస్టులు అదే విధంగా సోషలిస్టులు మితవాదులతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధం కాలేదు. అలా చేస్తే జాతీయ సంఘటన పతనానికి దారితీస్తుందని వారు భావించారు. మొత్తం మీద గాంధీజీ "ఆకాంక్షలకు" అనుగుణంగా బోస్‌ను కట్టి పడవేసేందుకు త్రిపుర కాంగ్రెస్‌లో మితవాదులు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించగా దీనిని వ్యతిరేకించకుండా వుండటం ద్వారా కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలు చీలికను నివారించాయి. గాంధీ, నెహ్రూల సహకారం లభించకపోవడంతో బోస్ రాజీనామా చేశారు. ఆయన, ఆయన అనుయాయులు ఫార్వర్డ్ బ్లాక్‌ను స్థాపించారు. ఆ రకంగా వేరుపడి (ఫార్వర్డ్ బ్లాక్, రాయిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టులతో కూడిన వామ పక్ష సమన్వయ కమిటీ కొద్ది కాలం పాటు నిలిచి వున్నప్పటికీ) 1939 జూలై తరువాత క్రమశిక్షణ పేరుతో కాంగ్రెస్ నుండి బహిష్కృతుడయ్యాడు.

మితవాదుల ఒత్తిళ్ళతో వామపక్షాల ఐక్యత మరింత సడలిపోసాగింది. కొమింటర్న్ ఏడవ మహాసభ ఆమోదించిన "వ్యూహాత్మక పంథా"లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం ఒక భాగమేనని ఎం.ఎన్.రాయ్ వాదించాడు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి రాజీనామా చేసి, కిసాన్ సభలను వ్యతిరేకించవలసిందిగా ఎం.ఎన్.రాయ్ 1937 లో తన అనుయాయులను కోరారు. బోస్ అనుయాయుల దుస్థితి చూసిన తరువాత తమకు కూడా ఇలాంటి గతే పడుతుందేమోనని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకత్వం భయపడింది. 1939 మేలో మసాని, లోహియా తదితరుల ఒత్తిడితో కమ్యూనిస్టులను ఏరివేయసాగింది. మరుసటి ఏడాది మే మాసానికల్లా కమ్యూనిస్టులను తొలగించారు. దాని ఫలితమేమిటంటే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యత్వం గణనీయంగా పడిపోవడం. కాగా కేరళ (ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, ఎ.కె. గోపాలన్ నాయకత్వం), ఆంధ్రప్రదేశ్ (పి. సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావుల నాయకత్వం)లలో పార్టీ శాఖలు కమ్యూనిస్టు పార్టీ ప్రాంతీయ శాఖలుగా రూపాంతరం చెందాయి. అప్పటి వరకు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆధిపత్యంలో వున్నాయని తలచిన అతి పెద్ద ప్రజాసంఘాలైన ఎ.ఐ.టి.యు.సి., ఎ.ఐ.కె.ఎస్., ఎ.ఐ.ఎస్.ఎఫ్.పై కమ్యూనిస్టుల ఆధిపత్యం నెలకొన్నది.

వామపక్ష బృందాలలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన శక్తిగా రూపొందినప్పటికీ సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ సంఘటన ఈ జగడాలతో బాగా బలహీనపడింది. అతివాద శక్తుల పలుకుబడి పెరగకుండా నిరోధించాలనే మితవాద శక్తుల పోకడల కారణంగానే ఈ బలహీనత ఏర్పడిందనే విషయాన్ని మనం మరువరాదు.

### సామ్రాజ్యవాద యుద్ధం నుండి ప్రజా యుద్ధానికి 1939-42

1939 సెప్టెంబర్ 3న రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు భారత జాతీయోద్యమంలో విభిన్నాభిప్రాయాలు వ్యక్తమ

య్యాయి. ఒకవైపున భారత్‌పై పెత్తనం చేస్తున్న బ్రిటిష్ వారి పట్ల విద్వేషము, రెండవ వైపున మానవత్వాన్ని మంటగలుపుతున్న నాజీలపై విద్వేషం, భారత ప్రజల ప్రతినిధులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే బ్రిటిష్ ప్రభుత్వం దేశాన్ని యుద్ధంలోకి లాగినందున రాజీనామా లివ్వవలసిందిగా కాంగ్రెస్ మంత్రివర్గాలను పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. దానితో కాంగ్రెస్ పాలిత ప్రాంతాలలో ప్రత్యక్ష పాలన నెలకొన్నది. అయితే తామడిగిన రాయితీలు ఇచ్చినట్లయితే యుద్ధ ప్రయత్నాలలో బ్రిటిష్ ప్రభుత్వానికి సహాయపడగలమని కాంగ్రెస్ తెలియజేసింది. కాగా ఇందుకు ప్రతిగా 1939 అక్టోబర్ 17 నాటి వైస్రాయి ప్రకటనలోనూ, 1940 ఆగస్టు 8 నాటి "ఆగస్టు ప్రతిపాద నల్లోనూ" అరకొర వాగ్దానాలు వెలువడ్డాయి. యుద్ధాన్ని గురించిన సామ్రాజ్యవాదుల అభిప్రాయాలేమిటో యీ రకమైన వాగ్దానాలు వెల్లడి చేశాయి. ప్రభుత్వం రాయితీలను ప్రకటించలేదు. దీనితో 1940 అక్టోబర్ నుండి గాంధీజీ నేతృత్వంలో 'వ్యక్తి శాసనోల్లంఘన ఆందోళన' ప్రారంభమైంది. ప్రభుత్వం పెద్ద ఎత్తున అరెస్టులు జరిపింది. 1941 మే నాటికి 20 వేల మంది ఖైదులో పడ్డారు.

ఇది ఇలా వుండగా కొమింటర్న్ వైఖరిని అనుసరించి ఈ యుద్ధాన్ని మ్యూనిచ్ కుట్ర (1938) అనంతరం తలెత్తిన సామ్రాజ్యవాదుల మధ్య యుద్ధంగా కమ్యూనిస్టు పార్టీ భావించింది. జర్మనీతో సోవియట్ యూనియన్ నిర్యుద్ధ ఒడంబడిక (1939) కుదుర్చుకొన్నది. కనుక తమను పాలించే సామ్రాజ్యవాద శక్తి నెదిరించడానికి "జాతీయ సంఘటన" విధానాన్ని కొనసాగించవలసిన అవసరం వుత్పన్నమైంది. అయితే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకత్వం సోవియట్ వ్యతిరేక వైఖరిని తీసుకోవడంతో మునుపటి వామపక్ష ఐక్యతను పునరుద్ధరించటం సాధ్యం కాలేదు. బోస్‌తో కొంత మేరకు సంబంధాలు కొనసాగాయి. 1940 వేసవిలో బోస్ భారత్ నుంచి సోవియట్ యూనియన్‌కు పారిపోవడానికి కొంతమంది కమ్యూనిస్టులు వ్యక్తిగతంగా సహాయపడ్డారనడానికి ఆధారాలున్నాయి. కాంగ్రెస్ మంత్రివర్గాలు వైదొలగి బ్రిటిష్ వారి ప్రత్యక్ష పాలన నెలకొనడంతో 1934 నాటి నిషేధానికి కమ్యూనిస్టులు మరోసారి గురయ్యారు. అజ్ఞాతవాసాలు, అరెస్టులు, జైళ్ళు మళ్ళీ ప్రారంభమయ్యాయి. 1941 మే నాటికి దాదాపుగా కమ్యూనిస్టు నాయకులందరూ జైళ్ళలో వున్నారు. దాదాపు అయిదువేల మంది సభ్యులు కూడా జైళ్ళ పాలయ్యారు. అప్పటి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పి.సి. జోషి 1942లో ఇలా పేర్కొన్నారు. "జాతీయ సంఘటన చెక్కుచెదరకుండా నిలిచినా... అది ముందుకు కొనసాగలేకపోయింది." కమ్యూనిస్టుల అభిప్రాయాన్ని ప్రక్కన పెడితే ఇది నిజంగానే వున్నదనడం సందేహాస్పదమే.

1941 జూన్ 22న సోవియట్ యూనియన్‌పై నాజీ జర్మనీ దాడికి దిగింది. ఈ సంఘటన యుద్ధ స్వభావంలో మార్పు తెచ్చింది. అయితే ఇతర కమ్యూనిస్టు పార్టీల వలె కాకుండా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుల్లో ఎక్కువమంది జైలులో వున్నారు. బ్రిటన్ సామ్రాజ్యవాదంతో దీర్ఘకాలంగా వున్న శత్రుత్వాన్ని విడచి ప్రపంచవ్యాప్త కూటమిలో దానిని పొత్తుదారుగా పరిగణించడం చాలా కష్టంతో కూడుకున్న పని అని కమ్యూనిస్టు పార్టీ భావించింది. కమ్యూనిస్టు పార్టీ విధానంలో మార్పు రావాలంటూ సహజంగానే బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సూచించింది. "భారత ప్రజల కొక విధానం" అన్న రజనీ పామీదత్ వ్యాసం 1941 అక్టోబర్‌లో వెలువడింది. చివరికి కమ్యూనిస్టులు డియోలి క్యాంప్‌లో ఒక "జైలు డాక్యుమెంట్"ని డిసెంబర్ నెలలో రూపొందించారు. "ప్రజాయుద్ధం" పట్ల అనుసరించవలసిన విధానంలో మార్పు వుండాలని వారు బలంగా వాదించారు. అదే నెలలో యుద్ధంలోకి జపాన్ అడుగుపెట్టడం, ఆగ్నేయాసియాలో దాని విజయం భారత్‌ని దాదాపుగా యుద్ధరంగం వైపుకు నెట్టింది. కనుక విధానంలో మార్పు అనేది తీవ్ర ఆవశ్యకతగా పరిణమించింది.

ఇదే విధంగా కాంగ్రెస్ నాయకత్వం కూడా తన వైఖరిని మార్చుకొన్నది. 1941 డిసెంబర్‌లో కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నాయకులను ప్రభుత్వం విడుదల చేసింది. వీరు బార్డోలీలో సమావేశమై ఒక తీర్మానాన్ని ఆమోదించారు. "యుద్ధం కారణంగా తలయెత్తిన నూతన ప్రపంచ పరిస్థితి, భారత్ విషయంలో దాని వైఖరిని" గూర్చి తీర్మానం పేర్కొంది. "స్వేచ్ఛాయుత, స్వతంత్ర భారతం" తరఫున మిత్రకూటమిలో చేరడానికి ఆ తీర్మానం సంసిద్ధతను వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ఈ తీర్మానాన్ని ఆమోదించడంతో క్రిప్స్ రాయబారానికి (మార్చి – ఏప్రిల్) తగిన భూమిక ఏర్పడింది. సామ్రాజ్యాన్నుండి విడిపోవడానికీ, రాజ్యాంగ సభను ఏర్పాటు చేసుకోవడానికీ, ప్రాంతీయ స్వయం నిర్ణయ హక్కు, మైనారిటీల రక్షణలతో కూడిన అధినివేశ ప్రతిపత్తిని భారతదేశానికి ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదించింది. అయితే యుద్ధం తర్వాత మాత్రమేనని షరతు విధించింది. ఇప్పుడు మాత్రం అధికార మార్పిడి లేదని పేర్కొంది. ఈ చివరి విషయం కారణంగా కాంగ్రెస్‌తో జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం జర్మనీ, జపాన్‌ల పట్ల తమ విరోధాన్ని విడవకుండానే బ్రిటిష్ ప్రభుత్వంతో ఘర్షణ వైఖరిని అవలంబించింది. ఈ పరిస్థితే "క్విట్ ఇండియా" తీర్మానానికి (1942 ఆగస్టు 8) దారితీసింది. ఈ తీర్మానాన్ని వ్యతిరేకించిన కమ్యూనిస్టులు కేవలం 13 ఓట్లనే సంపాదించుకోగలిగారు. ఆసియాలోని దురాక్రమణ దారులను ఓడించడం తక్షణ కర్తవ్యంగా వారు భావించారు. ఆ రకంగానే అంతర్జాతీయ నినాదం పుట్టుకొచ్చింది. బ్రిటిష్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా నూతన ఉద్యమ నిర్మాణంకై గాంధీజీ గట్టి పట్టుపట్టడం "అంతర్జాతీయతపై జాతీయతా విజయం" అని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యానించారు. ఓల్గా తీరాన సోవియట్ రక్షణ వలయాన్ని జర్మనీ ఛేదించగలదని, ఈజిప్టు సరిహద్దులో జర్మనీ నుంచి, ఈశాన్య భారతంలో జపాన్ నుంచి బ్రిటిష్ సామ్రాజ్యానికి ఆపద ఎదురు కాగలదని అప్పట్లో భావించారు. తీవ్ర ప్రమాదంలో చిక్కుకున్న కూటమిలోని భాగస్వామిగా బ్రిటిష్ ప్రభుత్వం తమ షరతులకు తలొగ్గగలదని గాంధీజీ భావించారు. "చైనా, రష్యాల రక్షణకు ఏ విధంగానూ ఇబ్బంది కలగరాదన్న ఆదుర్దా" కాంగ్రెస్‌కు వున్నదని పై తీర్మానం పేర్కొన్నది. గాంధీ, ఆజాద్‌లిరువురూ తమ ముగింపు ఉపన్యాసంలో "ఒప్పందం కుదుర్చుకోవాలన్న వాంఛ"ని నొక్కి చెప్పారని "తక్షణ చర్యలకు బదులు చర్చలను" కోరుకున్నారని నెహ్రూ పేర్కొన్నారు. కాగా పెద్ద ఎత్తున అరెస్టు చేయడం, అరెస్టులకు వ్యతిరేకంగా పెల్లుబికిన నిరసనలను క్రూరంగా అణచివేయడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు దిగింది. ఈ సమయాన పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చింది. 1942-43 శీతాకాలంలో స్టాలిన్‌గ్రాడ్ వద్ద రెడార్మీ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. దానితో తన సామ్రాజ్య రక్షణకు సంబంధించిన ఆందోళన నుండీ, యుద్ధ ఒత్తిళ్ళ కారణంగా భారత్ డిమాండ్‌లను ఆమోదించే పరిస్థితి నుండి బ్రిటిష్ ప్రభుత్వం బయటపడింది. తత్ఫలితంగా క్విట్ ఇండియా ఉద్యమం కారణంగా భారత్‌కు తక్షణ ఫలితాలేవీ సిద్ధించలేదు.

క్విట్ ఇండియా తీర్మానానికి కమ్యూనిస్టుల వ్యతిరేకతను కారణంగా చూపి యుద్ధానంతరం (1945) వారిని కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. వారి దేశభక్తిని శంకించడానికి ఆనాటి నుండి ఈనాటి వరకు వివిధ సందర్భాలలో ఈ విషయాన్ని లేవనెత్తుతూనే వున్నారు. అయితే ఆనాటి పరిస్థితులలో ఫాసిజం ఓటమి ప్రపంచానికి అత్యంతావశ్యకమని ఎవరైనా అంగీకరిస్తే కమ్యూనిస్టులు తీసుకున్న వైఖరి అసాధారణమేమి కాదనడంలో సందేహం లేదు.

(మిగతా వచ్చే సంచికలో)

# డెంగ్ సియావో పింగ్

(2వ పేజీ తరువాయి)

డెంగ్, చౌఎన్‌లై, లీషావ్ చీ వంటి అగ్రనాయకుల్ని ''పెట్టుబడిదారి మార్గీయులు'' గా ముద్రవేసారు.

1969 లో జరిగిన పార్టీ మహసభలో మావో వారసుడిగా లిన్ పియావో పేరును ప్రకటించారు. సాంస్కృతిక విప్లవం నీడలో వ్యక్తి పూజ ప్రారంభమైంది. మావో భార్య జియాంగ్ క్వింగ్ ఆమె అనుచరులైన ఝుగ్ చున్ చియావో, వాంగ్ హంగ్‌వెన్, యావోవెన్ యువాన్‌లతో "గ్రూప్ ఆఫ్ ఫోర్" ఏర్పడింది. వీరు పార్టీ ముఖ్య స్థానాలకు ఎగబకారు. 1976 జనవరి 8న ప్రధాని చౌ ఎన్‌లై మృతి చెందారు. చౌ ఎన్‌లైని డెంగ్ ఎంతగానో అభిమానించారు. తన అన్నగా డెంగ్ చెప్పుకునే వారు. చౌఎన్ లై మరణానంతరం సాంప్రదాయాన్ని అనుసరించి ఏప్రిల్‌లో సంతాపం తెలిపేందుకు "తియాన్‌మేర్ స్క్వేర్" వద్ద పెద్ద సంఖ్యలో చైనీయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా "గ్రూప్ ఆఫ్ ఫోర్"కి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ సంఘటనకు సూత్రదారి డెంగ్ సియావో పింగ్ అని ఆరోపించి ఆయనను పదవి నుంచి తొలగించారు.

1976 సంవత్సరం సెప్టెంబర్–9 న చైనా ప్రజల ప్రియతమ నేత మావో కన్నుమూశారు. దీన్ని ఆవకాశంగా తీసుకుని అధికారాన్ని చేజిక్కించుకొవాలని గ్రూఫ్ ఆఫ్ ఫోర్ (దుష్ట చతుష్టయం) కుట్ర పన్నింది. సాయుధ తిరుగు బాటుకు సైతం ప్రయత్నించింది. పార్టీ సకాలంలో జోక్యం చేసుకుని వీరిని అరెస్టు చేయడంతో 10 సంవత్సరాల సాంస్కృతిక విప్లవం పేరుతో సాగిన అల్లకల్లోలానికి తెరపడింది.

### నూతన శకం ప్రారంభం

సాంస్కృతిక విప్లవం ముగిసిన కొద్ది కాలానికే డెంగ్ బాధ్యతలు చేపట్టారు. చైనా లక్షణాలతో సోషలిజం నిర్మాణం, మరియు ఆర్థిక రంగంలో సంస్కరణలు చేపట్టారు. చైనా సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసిన డెంగ్ తన ఆలోచనలను కార్యచరణలో పెట్టారు. 1978లో జరిగిన చైనా పార్టీ కేంద్ర కమిటీ ప్లీనంలో డెంగ్ తన ఆలోచనల్ని ప్రతిపాదించారు. గ్రామీణ ప్రాంతాలలో పేదరికం పెరుగుతోంది. పట్టణ ప్రాంతాలలో ప్రజల అభిరుచులు మారిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో చైనా అన్ని రంగాలలో ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే అంతర్జాతీయంగా మనజాలాలంటే 4 రంగాలలో ఆధునికరణ సాధించాలి. ఆ నాలుగు

1.పరిశ్రమలు, 2.వ్యవసాయం, 3.శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, 4.రక్షణ

ఈ నాలుగు రంగాలలో అభివృద్ధి సాధిస్తే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని వెల్లడించాడు డెంగ్. అయితే ఈ నాలుగు ఆధునికరణలు సాధించాలంటే మరో నాలుగు మూల సూత్రాలకు కట్టుబడి ఉండాలని ప్రతిపాదించాడు. అవి

1.సోషలిస్టు పంథాను అంటిపెట్టుకోవాలి.

2.కార్మిక వర్గ నియంతృత్వానికి విధేయంగా ఉండాలి.

3.కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ముందుకు సాగాలి.

4.మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాలు అనుసరించాలి.

ఈ "నాలుగు ఆధునికరణలు – నాలుగు మూల సూత్రాల'' కు ఎంతో ప్రదాన్యత ఉంది. సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం వల్ల చైనా తీవ్రంగా నష్టపోయింది. చైనా రిపబ్లిక్ ఏర్పడిన అనంతరం పునాది నుండి నిర్మించాల్సి వచ్చింది. అయితే నేటి ప్రగతికి కారణం సోషలిజమే. సంస్కరణలు అమలు జరిపితే పెట్టుబడిదారీ తాలూకు దుష్ప్రభావాలు రావా? అంటే తప్పక వస్తాయి.

"మనం మంచి గాలి కోసం కిటికీలు తెరుచుకుంటే దోమలు కూడా వస్తాయి" అని డెంగ్ విశ్లేషించారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ రూపొందించిన శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మన అవసరాలకు అనుగుణంగా మలుచుకోవాలి. మనం పెట్టుబడిదారీ దేశాల నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఉపయోగ అంశాలను దిగుమతి చేసుకుంటాం. ఎంపిక చేసుకుని ప్రణాళికాబద్ధంగా తెచ్చుకుంటాం. అయితే మనం పెట్టుబడిదారీ విధానాన్ని తెచ్చుకోము. పనికిమాలింది, కుళ్లిపోయింది ఏదీ తెచ్చుకోము అంటూ డెంగ్ దూరదృష్టితో చెప్పిన అంశాలు ఆచరణలో అద్భుతాలను సృష్టించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదరికం తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. అందుకే చైనా ప్రజలు "మావో జే దుంగ్ మమ్ములను విముక్తి చేశాడు, డెంగ్ సియావో పింగ్ మమ్ములను సంపన్నులను చేశాడు" అని కొనియాడుతారు. నేటి ఆధునిక చైనా అభివృద్ధి వెనకాల డెంగ్ సియావో పింగ్ పాత్ర ఎంతో ముఖ్యమైనది.

డెంగ్ జీవితాన్ని పరిశీలిస్తే మూడు అంశాలు మనకు స్ఫూర్తినిస్తాయి.

1.సిద్ధాంతం–ఆచరణ

2.పార్టీ పై విశ్వాసం

3.యువతను ప్రోత్సాహించడం

సిద్ధాంతం ను అధ్యయనం చేయడమే గొప్ప కాదు దాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టంగా అన్వయించగలగాలి. అలాంటి నిర్దిష్ట వైఖరినే డెంగ్ అనుసరించాడు. "నేటి చైనాలో మౌలిక సమస్యలు", "డెంగ్ ఆలోచనలు'' వంటి రచనలు చైనా పురోగాభివృద్ధికి ఎంతో ఉపయోగపడ్డాయి. విదేశి పెట్టుబడులతో పాటు అవినీతి, నేరాలు, అసమానతలు వ్యాపిస్తాయన్న వాస్తవాన్ని విస్మరించలేదు. విప్లవ ప్రతిఘాత శక్తులపై కార్మిక వర్గ నియంతృత్వం ద్వారా కఠినంగా వ్యవహరించే ఆచరణే గీటురాయిగా సాగింది.

సాంస్కృతిక విప్లవం కాలంలో 2 సార్లు అన్ని పదవుల నుండి తొలగించినా డెంగ్ పార్టీపైనా, సిద్ధాంతంపైనా విశ్వాసం కొల్పోలేదు. మావో అంతటి వాడితో అంతర్గత పోరాటానికీ వెనకడుగు వేయలేదు. 1969 సంవత్సరంలో పార్టీ నుండి తొలగించిన తరువాత 65 ఏళ్ల వయస్సులో ట్రాక్టర్ రిపేరింగ్ ప్లాంట్‌లో ఫిట్టర్‌గా పనిచేశాడు. డెంగ్ భార్య అనారోగ్యంతో మంచానికి పరిమితమైంది. తన పనులు, భార్యకు సపర్యలు చేస్తూనే అర్ధరాత్రులలో మార్క్స్, లెనిన్ ఇతర సైద్ధాంతిక పుస్తకాలు అనేకం అధ్యయనం చేశాడు.

డెంగ్ సియావో పింగ్ అగ్రనాయకుడిగా పరిగణించబడుతున్నా సమిష్టి నాయకత్వానికే ప్రాధాన్యతనిచ్చారు. మేధావుల్ని, శక్తి గల కొత్త వారిని ప్రోత్సాహించారు. జీవితకాలం పదవులు, అనే పద్ధతి పనికిరాదని, క్రమేనా కొత్తవారిని ప్రోత్సాహించాలని చెప్పారు. 1992 సంవత్సరంలో డెంగ్ ఇలా చెప్పాడు. "మరింత మంది యువకులను నాయకత్వ స్థానాలకు ప్రోత్సాహించాలి, మన వంటి వృద్ధ తరం నాయకులు ప్రక్కకు తొలగి, కొత్తగా వచ్చిన వారికి స్వేచ్ఛనిచ్చి వారి పని విధానాన్ని పరిశీలిస్తుండటం అవసరం. పాత వారు స్వచ్ఛందంగా తమ స్థానాలను యువకులకు అప్పగించి, పక్క నుండి సహాయపడాలి. అంతేకాని ఎప్పుడూ వారికి అడ్డంకి కారాదు..."

"వమస్సు పెరిగే కొద్ది వారు మరింత నమ్రత పెంచుకోవాలి జీవిత సంధ్యా సమయంలో తప్పు చేయకుండా జాగ్రత్త పడాలి. మనం యువకులను ఎంపిక చేసి పై స్థానాలకు ప్రోత్సాహించాలి".

ఇలా చెప్పడమే కాదు ఆచరించి చూపాడు డెంగ్. అన్ని స్థానాల నుండి వైదోలగి సలహాల, సూచనలు చేస్తూ వచ్చారు. డెంగ్ సియావో పింగ్ మరణించేనాటికి ఆయనకు గల ఒకే ఒక పదవి "చైనా బ్రిడ్జి క్రీడాకారుల అసోసియేషన్ అధ్యక్ష పదవి'' మాత్రమే. సిద్ధాంతం, ఆచరణ, వాస్తవికత, నమ్రత మేళవింపే డెంగ్ జీవిత విశిష్టత. అ విశిష్టతనను ఎలప్పుడూ గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. "ఆగష్టు–22న 118 వ జయంతి సందర్భంగా డెంగ్ సియావో పెంగ్‌కు ఇవే మా నివాళులు. ❊

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 3 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ప్రపంచ ఆర్థిక మందగమనం



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారుగుతున్నదని ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకులు ఆంచనాకు వచ్చాయి. ప్రపంచ సగటు వార్షికాభివృద్ధి 2021లో 5.7 శాతం నుండి 2022లో 2.9 శాతానికి పడిపోతుందని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. గత జనవరిలో అంచనా వేసిన 4.1 శాతం కన్నా ఇది మరింత తక్కువ. ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక కార్యకలాపాలు చాలా వరకు తగ్గిపోతాయి గనుక 2023-24 సంవత్సరంలో కూడా ఇదే దిగజారిన ధోరణి కొనసాగుతుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. కరోనా మహమ్మారి, యుద్ధాల కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అభివృద్ధి కరోనా ముందు కాలం కన్నా 5 శాతం తక్కువగానే నమోదవుతుందని చెప్పింది.

ఉక్రెయిన్ యుద్ధం, చైనాలో లాక్‌డౌన్ల వల్ల సరఫరా గొలుసులకు అంతరాయం ఏర్పడ్డం వీటితోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మాంద్యోల్బణం ప్రబలుతుందనే భయాలూ ఆర్థికాభివృద్ధిని నీరుగార్చాయని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మాల్పాస్ చెప్పారు.

ద్రవ్యోల్బణం ఈ ఏడాది చివరికి కొంతమేరకు తగ్గుముఖం పట్టవచ్చు కానీ చాలా వర్ధమాన దేశాల్లో వాటి లక్ష్యాలకు మించి ద్రవ్యోల్బణం పెరుతుందని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది.

అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థికాభివృద్ధి 2021లో 5.1 శాతం నుండి 2022లో 2.6 శాతానికి పడిపోతుంది. ఇది గత జనవరిలో అంచనా వేసిన దానికన్నా 1.2 శాతం తక్కువ. ఈ దేశాల్లో 2023లో 2.2 శాతం అభివృద్ధి మాత్రమే ఉంటుందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది.

భారత దేశం ఇతర ఎమర్జింగ్ దేశాల్లో కూడా అభివృద్ధి 2021లో 6.6 శాతం నుండి 2022లో 3.4 శాతానికి తగ్గుతుంది. ఇది వార్షిక సగటు అభివృద్ధి కన్నా 3.4 శాతం తక్కువ.

ప్రాంతాల వారీగా అభివృద్ధి ఇలా ఉండబోతోంది:

తూర్పు ఆసియా, పసిఫిక్ : 2022 లో 4.4 శాతం నుండి 2023లో 5.2 శాతానికి పెరుగుతుంది.

ఐరోపా, మధ్య ఆసియా : 2022లో -2.9 శాతం తగ్గి,2023లో 1.5 శాతం పెరుగుతుంది.

లాటిన్ అమెరికా, కరేబియన్ : 2022లో 2.5 శాతానికి తగ్గి 2023లో 1.9శాతానికి దిగజారుతుంది.

మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా : 2022లో 5.3 శాతానికి పెరిగి 2023లో 3.6 శాతానికి తగ్గుతుంది.

దక్షిణాసియా : 2022లో 6.8 శాతానికి తగ్గి 2023లో మరింతగా 5.8 శాతానికి తగ్గుతుంది.

సహారా దిగువ ఆఫ్రికా : 2022లో 3.7 శాతనికి పెరిగి 2023లో 3,8 శాతానికి పెరుగుతుంది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................

వీధి..........................................

గ్రామం..........................................

మండలం లేదా పట్టణం..........................................

జిల్లా..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,